www.vijayakranthinews.com

గురువారం
03 జనవరి
2019

పేజీలు 12
సంపుటి 1, సంచిక 285

# విజయక్రాంతి

నిజం నిర్భయం నిష్పక్షం

హైదరాబాద్ | PUBLISHED SIMULTANEOUSLY FROM HYDERABAD, NIZAMABAD, KHAMMAM | VIJAYAKRANTHINEWS | రూ. 3.00





వర్జినిటీ నిధి కాదు 11


## అన్నాడీఎంకే ఎంపీల సస్పెన్షన్



**న్యూఢిల్లీ:** లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ అన్నాడీఎంకే ఎంపీలపై 5 రోజుల పాటు సస్పెన్షన్ వేటు వేశారు. బుధవారం సభలో రఫేల్‌పై చర్చ సమయంలో గందరగోళ వాతావరణం నెలకొంది. దీంతో సభ కొద్ది సేపు వాయిదా పడింది. అనంతరం సభ ప్రారంభం కాగానే కొంత మంది అన్నాడీఎంకే ఎంపీలు కావేరీ జలాల వివాదంపై వెల్ లోకి దూసుకొచ్చారు. ప్లకార్డులు ప్రదర్శించడంతో పాటు స్పీకర్ సుమిత్రా మహాజన్‌పై పేపర్లు విసిరారు. దీంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో గందరగోళం సృష్టించిన 24 మంది అన్నాడీఎంకే ఎంపీల పేర్లను వెల్లడిస్తూ వారిని ఐదు రోజుల పాటు సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. సభ సజావుగా జరగకుండా ప్రతిసారి వెల్లోకి వచ్చి ఆటంకం సృష్టిస్తున్నందుకు గాను రూల్ 374(ఏ) ప్రకారం తనకున్న హక్కుల మేరకు 24 మంది ఎంపీలను ఐదు రోజుల పాటు సభా కార్యక్రమాలకు హాజరు కాకుండా సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ మహాజన్ స్పష్టం చేశారు. కావేరీ జలాల వివాదం విషయంలో తమిళనాడుకు న్యాయం జరిగేలా చేయాలంటూ అన్నాడీ ఎంకే ఎంపీలు గత కొన్ని రోజులుగా పార్లమెంట్ ఉభయ సభల్లో ఆందోళన చేస్తున్నారు. బుధవారం కీలకమైన రఫేల్‌పై చర్చ జరుగుతున్న సమయంలో కూడా ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో సభ పలుమార్లు వాయిదా పడింది. అయితే సభ ప్రారంభమైన తర్వాత అన్నాడీఎంకే ఎంపీలు ఆందోళనకు దిగడంతో పాటు స్పీకర్‌పై కాగితాలు విసిరి అమర్యాదకరంగా ప్రవర్తించారు. దీంతో సుమిత్రా మహాజన్ వారిపై ఆగ్రహం వ్యక్తం చేయడంతోపాటు 24 మంది ఆ పార్టీ సభ్యులను ఐదు రోజుల పాటు సభా కార్యక్రమాల నుంచి సస్పెండ్ చేశారు.

# మళ్లీ రఫేల్ ప్రకంపనలు

- రఫేల్ పత్రాలు గోవా సీఎం బెడ్‌రూంలో ఉన్నాయి
- యుద్ధ విమానాలపై సమాధానం చెప్పే దమ్ము మోదీకి లేదు
- ఆడియో టేపులను లోక్‌సభకు వినిపిస్తానన్న రాహుల్
- రాహుల్ గతంలోనూ సభను తప్పుదోవ పట్టించారు: జైట్లీ





**న్యూఢిల్లీ:** లోక్‌సభలో బుధవారం రఫేల్ యుద్ధ విమానాల ఒప్పందంపై వాడివేడి చర్చ జరిగింది. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై విరుచుకుపడ్డారు. తాను సంధించిన ప్రశ్నలకు సమాధానం చెప్పే దమ్ము మోదీకి లేదన్నారు. రఫేల్ వ్యవహారంపై పార్లమెంటులో రాహుల్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రఫేల్‌పై సమాధానం ఇచ్చేందుకు ప్రధాని మోదీకి ధైర్యం లేదని, అందుకే ఆయన తన గదిలో ఉండిపోయారని రాహుల్ ఎద్దేవా చేశారు. "పార్లమెంటుకు వచ్చి రఫేల్‌పై సమాధానం చెప్పేందుకు ప్రధాన మంత్రికి ధైర్యం చాలడం లేదు. రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ కూడా సభలో అన్నా డీఎంకే ఎంపీల వెనుక దాక్కున్నారు. రఫేల్ ఒప్పందంలో చాలా లొసుగులు ఉన్నాయి. గతసారి నేను ఈ అంశం లేవనెత్తినప్పుడు కూడా ప్రధాని ఐదు నిమిషాలే స్పందించారు." అని రాహుల్ వ్యాఖ్యానించారు. రఫేల్ జెట్ ఒప్పందానికి సంబంధించిన పత్రాలు అప్పటి రక్షణ మంత్రి, ప్రస్తుత గోవా సీఎం మనోహర్ పారికర్ బెడ్ రూంలో ఉన్నాయన్న గోవా మంత్రి వ్యాఖ్యలకు సంబంధించిన ఆడియో టేపులను సభలో వినిపించాలని రాహుల్ పట్టుబట్టారు. ఆడియో టేపులు ఉన్నట్లు మీరు నమ్ముతున్నారా..? అని స్పీకర్ సుమిత్రా మహాజన్ రాహుల్ను ప్రశ్నించారు. మరోవైపు అరుణ్ జైట్లీ సైతం ఆడియో టేపులు నిజమని నిరూపించగలరా? అని సవాలు విసిరారు. ఈ క్రమంలోనే కొంత సేపు సభలో వాడివేడిగా చర్చ జరిగింది.

### రఫేల్‌పై జేపీసీకి రాహుల్ పట్టు

రఫేల్ పై గందరగోళంతో సభ తొలుత 2.30కు వాయిదా పడింది. అనంతరం సభ పునఃప్రారంభమయ్యాక రఫేల్ అంశంపై రాహుల్ సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)వేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు కూడా రఫేల్ విచారణ వ్యవహారం తమ పరిధిలోకి రాదని చెప్పింది కానీ, జేపీసీ ఏర్పాటు చేయకూడదని ఎక్కడా అనలేదని రాహుల్ గుర్తు చేశారు. తనపై వ్యక్తిగతంగా చిన్న ఆరోపణ కూడా లేదన్న మోదీ వ్యాఖ్యను రాహుల్ తప్పుబట్టారు. మంగళవారం ఓ వార్తా సంస్థకు మోదీ ఇచ్చిన ముఖాముఖిలో కూడా రఫేల్ ఒప్పందం గురించి అడిగిన ప్రశ్నలకు మోదీ ఎక్కడా సమాధానం చెప్పలేదని రాహుల్ ఆక్షేపించారు. ఒప్పందంలో భాగంగా ఒక్కో విమానానికి రూ.1,600 కోట్ల ధరను వెచ్చించడానికి రక్షణ శాఖ ఉన్నతాధికారులు సైతం అభ్యంతరం తెలిపారని అన్నారు. కేవలం తన "ప్రియ స్నేహితుడు" అయిన అనిల్ అంబానీకి లబ్ధి చేకూర్చేందుకే మోదీ ఒప్పందంలో మార్పులు చేశారని ఆరోపించారు. ఈ క్రమంలో జరిగిన గందరగోళంతో సభ 3.30 కు వాయిదా పడింది.

### రాహుల్ వన్నీ పచ్చి అబద్ధాలు, అసత్యప్రచారాలే: అరుణ్ జైట్లీ

రఫేల్ ఒప్పందంపై లోక్సభలో చర్చ జరుగుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీల మధ్య మాటల యుద్ధం జరిగింది. ప్రధాని మోదీ, ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసిన రాహుల్‌పై జైట్లీ ధ్వజమెత్తారు. అరుణ్ జైట్లీ కూడా రాహుల్ గాంధీకి దీటుగా సమాధానమిచ్చారు. కొందరు సహజంగా నిజాలను ఇష్టపడరని జైట్లీ రాహుల్‌ను ఉద్దేశించి అన్నారు. ఆయన రఫేల్ ఒప్పందంపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. గతంలో జరిగిన రక్షణ కుంభకోణాల్లోని కుట్రదారులు ఇప్పుడు మోదీ ప్రభుత్వంపై వేలెత్తి చూపిస్తున్నారని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పును కూడా రాహుల్ ఎలా సవాలు చేస్తారని ప్రశ్నించారు. కనీసం యుద్ధ విమానం అంటే ఏంటో తెలియని వ్యక్తి ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి అధ్యక్షత వహిస్తున్నారంటూ విమర్శించారు.

రాజకీయ వివాదానికి కేంద్ర బిందువుగా మారిన రఫేల్ యుద్ధవిమానాల ఒప్పందంలో కేంద్రప్రభుత్వానికి క్లీన్చిట్ ఇస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై రివ్యూ పిటిషన్ దాఖలైంది. ఈ తీర్పును పునఃసమీక్షించాలని కోరుతూ కేంద్ర మాజీ మంత్రులు యశ్వంత్ సిన్హా, అరుణ్ శౌరీ, న్యాయవాది ప్రశాంత్ భూషణ్ సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేశారు. రఫేల్ ఒప్పందంపై కేంద్రం తప్పుడు వివరాలను న్యాయస్థానానికి సమర్పించిందని వీరు తమ పిటిషన్లో పేర్కొన్నారు.

విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం గతేడాది డిసెంబరు 14న తుది తీర్పు వెల్లడించింది. రఫేల్ ఒప్పందం నిర్ణయ ప్రక్రియను సందేహించడానికి ఎలాంటి ప్రాతిపదిక కన్పించలేదని కోర్టు పేర్కొంది. ఈ యుద్ధ విమానాల ఆవశ్యకత, నాణ్యతపై ఎలాంటి అనుమానాలు లేవని, ఒప్పందాన్ని రద్దు చేయాల్సిన అవసరమేమీ లేదని తెలిపింది. ఈ మేరకు ఒప్పందాన్ని సవాల్ చేస్తూ దాఖలైన అన్ని పిటిషన్లను కొట్టివేసింది.

## శబరిమలలో మహిళల ప్రవేశం

- స్వామి దర్శనం చేసుకున్న ఇద్దరు 50 ఏళ్లలోపు స్త్రీలు
- శబరిమలలో తీవ్ర ఉద్రిక్తత
- తిరువనంతపురంలో బీజేపీ ధర్నా, లాఠీచార్జ్
- నేడు కేరళ బంద్‌కు పిలుపునిచ్చిన శబరిమల కర్మ సమితి

**శబరిమల:** సుప్రీంకోర్టు తీర్పు తరువాత మహిళల ప్రవేశంపై అట్టుడుకుతున్న శబరిమలలో సంచలనం చోటుచేసుకుంది. స్వామి సన్నిధానంలో మహిళలు చరిత్ర సృష్టించారు. అనుకున్నది సాధించారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల తర్వాత మొదటిసారి మహిళలు అయ్యప్ప ఆలయ ప్రవేశం చేశారు. ఎన్నో ఒడిదుడుకులు, తిరస్కారాల తర్వాత ఇద్దరు మహిళలు ఆలయంలోకి వెళ్లారు. వీరిద్దరూ 50 సంవత్సరాలలోపు వాళ్లే కావడంతో కోర్టు ఉత్తర్వులను అమలు జరిపినట్లైంది. పోలీసుల సాయంతోనే వాళ్లు ఆలయంలోకి వెళ్లడం విశేషం. బిందు, కనకదుర్గ అనే ఇద్దరు మహిళలు బుధవారం తెల్లవారుజామున 3:45 గంటలకు ఆలయంలోకి వెళ్లారు. ఇటీవల వీళ్లు ఒకసారి విఫలయత్నం చేశారు. అప్పుడు అయ్యప్ప భక్తులు వీరిని అడ్డుకున్నారు.

### సంప్రోక్షణ తరువాత తెరిచిన ఆలయం

కేరళలోని పవిత్ర శబరిమల ఆలయంలోకి 50ఏళ్ల లోపు ఇద్దరు మహిళలు ప్రవేశించడం తీవ్ర దుమారానికి దారితీసింది. మహిళల ప్రవేశంతో ఆలయాన్ని మూసివేసి సంప్రోక్షణ చేపట్టారు. ప్రధాన అర్చకుడి ఆదేశాలతో బుధవారం ఉదయం దాదాపు గంట పాటు ఆలయ (తరువాయి 4లో)



## ఇంటికే ఇంధనం

- ఇకపై డీజిల్ కూడా హోమ్ డెలివరీ



**చెన్నై:** ఇంటి వద్దకే పెట్రోలు, డీజిల్ డెలివరీ ఉంటుందని కొన్ని నెలల క్రితం ప్రముఖ ఆయిల్ సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇంటికే ఇంధనం కాన్సెప్ట్ భారతదేశంలోనే తొలిసారి కావడం విశేషం. ఈ సర్వీసులను తొలుత పూణే నగరంలో ప్రవేశపెట్టింది. అనంతరం ఇతర నగరాలకు కూడా క్రమంగా విస్తరించింది. డోర్ స్టెప్ డెలివరీ ఆఫ ఫ్యూయెల్ పేరుతో ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ సంస్థ ఇంధనం ఇంటిదగ్గరకే డెలివర్ చేస్తోంది. తాజాగా ఈ సర్వీసును చెన్నై నగరంలో ప్రారంభించింది. ఇక సాధారణంగా మనము పెట్రోల్ బంకుల్లో చూసే మెషీనే ఈ ట్రక్కులో ఉంది. పెట్రోల్ బంకుల్లో అప్పటికే ట్యాంకుల్లో నిల్వ ఉంచిన ఇంధనంను పంపు ద్వారా ఎలాగైతే మన వాహనంలోకి నింపుతారో అలానే ఈ ట్యాంకర్ నుంచి ఇంధనం తీసుకుని మన వాహనంలోకి నింపుతారు. ప్రస్తుతం డీజిల్‌ను మాత్రమే హోండెలివరీ చేస్తున్నారు. అధికంగా డీజిల్ వాహనాల వినియోగం ఎక్కువగా ఉన్నందున ఈ ప్రయోగానికి తెరతీశారు. దీనివల్ల పెట్రోలు బంకుకు వెళ్లి క్యూలైన్లో నిలబడే బాధ తప్పుతుందని కొందరు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా (తరువాయి 4లో)

# ఖరీఫ్‌కు సాగునీరు, జనానికి తాగునీరు

- కాళేశ్వరం పనుల్లో మరింత వేగం పెంచాలి..!
- ఖరీఫ్‌కు రైతులకు సాగు నీరు అందించడమే లక్ష్యం..!
- కన్నెపల్లి గ్రావిటీ కెనాల్, అన్నారం, సుందిల్ల బ్యారేజీలను సందర్శించిన సీఎం కేసీఆర్



**విజయక్రాంతి, మంథని/రామగుండం:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కాళేశ్వరం ప్రాజెక్టు పనుల్లో మరింత వేగం పెంచాలని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అధికారులకు దిశా నిర్ధేశం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నీటిని ఖరీఫ్ పంటలకు, కాళేశ్వరం ప్రాజెక్టు నీరు రైతాంగానికి ఇవ్వడమే లక్ష్యమని, మార్చి నెలాఖరు కల్లా పూర్తి చేసి తీరాలని సీఎం కేసీఆర్ అధికారులకు, నిర్మాణ ఏజెన్సీ సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు పనుల సందర్శన బుధవారం రెండో రోజు కొనసాగింది. మంగళవారం రాత్రి కరీంనగర్‌లో బస చేసిన సీఎం కేసీఆర్ బుధవారం ఉదయం ప్రత్యేక హెలిక్యాప్టర్ ద్వారా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం కన్నెపల్లికి చేరుకుని అక్కడ నుంచి రోడ్డు మార్గంలో 13.2 కిలో మీటర్ల మేర అక్కడ జరుగుతున్న గ్రావిటీ కెనాల్ పనులును పరిశీలించారు. నాలుగు చోట్ల ఆగి గ్రావిటీ కాలువ పనులు కేసిఆర్ చూసి, వివరాలు తెలుసుకున్నారు. గ్రావిటీ కెనాల్ పనుల్లో మరింత వేగం పెంచాలని అధికారులకు సీఎం ఆదేశించారు. అక్కడ నుంచి అన్నారం బ్యారేజీ వద్దకు వెళ్లి పనులను పరిశీలించారు. (తరువాయి 4లో)

### పనుల్లో పురోగతిని పెంచండి...

ప్రతి రోజూ మూడు టీఎంసీలకు సామర్థ్యం పెంచేందుకు వీలుగా సివిల్ పనులు చేపట్టాల్సిందిగా అధికారులను తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. మార్చి 31 కల్లా ఈ పంప్‌హౌస్ పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. మోటార్ల బిగింపు పనులను వేగవంతం చేయాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా రామగుండం నియోజకవర్గ పరిధిలోని అంతర్గాం మండలం గోలివాడలో నిర్మిస్తున్న పంప్‌హౌస్ పనులను బుధవారం ముఖ్యమంత్రి కేసీఆర్ పరిశీలించారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా ప్రత్యేక హెలికాప్టర్‌లో గోలివాడలో కేసీఆర్ ఎక్కువ సేపు ఉన్నారు. ఈ పంప్‌హౌస్ పనుల తీరుతెన్నులను సమీక్షించారు. రూ.2022.3 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ పంప్‌హౌస్‌లో ప్రతిరోజు 2 టీఎంసీలు ఎత్తిపోసే సామర్థ్యంగల 9 మోటార్లను బిగించనున్నారు. గోలివాడ పంప్‌హౌస్ నిర్మాణ పనులను చేపడుతున్న సంబంధిత గుత్తెదారులు, ఇంజనీర్లతో చర్చించారు. పక్కా ప్రణాళికను రూపొందించుకుని మార్చి చివరి నాటికి డ్రైరన్ నిర్వహించాలన్నారు. జనవరి చివరి నాటికి 4 మోటార్ల డ్రై రన్ పూర్తి చేయాలన్నారు. ఈ పంప్‌హౌస్ నిర్మాణంతో ఎట్టి పరిస్థితుల్లోనూ ఖరీఫ్‌లో వ్యవసాయానికి సాగునీరు అందించాలని ఆదేశించారు. పనుల్లో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. అవసరమైతే సకాలంలో పనులు పూర్తి చేయడానికి మూడు షిఫ్టులు ఏర్పాటు చేయాలని కార్మికుల, యంత్రాల సంఖ్యను పెంచాలన్నారు. అంతకుముందు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి వెంట ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి ఎస్కె జోషి, సీఎం కార్యదర్శి స్మితా సబర్వాల్, డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీదేవసేన, జేసీ వనజాదేవి ఉండగా, ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన వారిలో రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ, రామగుండం జడ్పీటీసీకందుల సంధ్యారాణి, రామగుండం పోలీసు కమిషనర్ వి.సత్యనారాయణ, పెద్దపల్లి డీసీపీ సుదర్శన్‌గౌడ్, ఆర్‌డీఓ ఉపేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు. కాగా, ముఖ్యమంత్రి క్షేత్రస్థాయి పర్యటన సందర్భంగా పోలీసులు గోలివాడ ప్రాంతంలో పకడ్బంది బందోబస్తును చేపట్టారు.

## ఓటర్ల నమోదు ఉధృతంగా చేపట్టాలి

- కేసీఆర్ ఏది చేసినా చరిత్రే...
- ముందస్తుకు పోయి గెలిచిన ఒకే ఒక సీఎం కేసీఆర్
- 16 ఎంపీ సీట్లు గెలవడమే లక్ష్యం



**విజయాక్రాంతి, హైదరాబాద్ :** మన బాస్ ముఖ్యమంత్రి కేసీఆర్ ఏదీ చేసినా కొత్త చరిత్రే అన్నారు టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎమ్మెల్యే కేటీఆర్. జలవిహార్ లో సనత్ నగర్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.గతం లో ముందస్తు ఎన్నికలకు పోయిన వారికి చేదు అనుభవాలు ఎదురయ్యాయన్నారు. ప్రజల్లో ఉన్న ఆలోచనలను ఆ నాయకులు పసిగట్ట లేక పోయారన్నారు. అసెంబ్లీ రద్దు మొదలు కొన్ని గంటల వ్యవధిలోనే 105 మంది అభ్యర్థులను ప్రకటించి కేసీఆర్ సంచలనం సృష్టించారన్నారు. తెలంగాణ కోసం పార్టీ పెట్టి రాష్ట్రాన్ని సాధించిన అరుదైన నాయకుడు కేసీఆర్ అని... రెండో సారి టీఆర్ఎస్ సాధించిన విజయం దేశంలోనే ఓ రికార్డుగా అభివర్ణించారు.కేసీఆర్ నాయకత్వం తోనే బంగారు తెలంగాణ సాధ్యమని తెలంగాణ ప్రజలు బలంగా నమ్మారు కాబట్టే నేడు ఈ ఘనవిజయం సాధ్యమైందన్నారు. ప్రజలు దేన్నీ చూడలేదని... చంద్రబాబు సహా అగ్ర నేతలందరూ కాలికి బలపం కట్టుకుని తిరిగినా తమకు ఉన్న ఏకైక నాయకుడు కేసీఆర్ అని ప్రజలు తీర్పునిచ్చారన్నారు.గతం లో కన్నా టీఆర్ఎస్ కు 14 శాతం ఓట్లు పెరిగాయని అసెంబ్లీ లో 75 శాతం సీట్లు సాధించామని చెప్పారు.గ్రేటర్ హైదరాబాద్ లో మొత్తం 29 సీట్లుంటే మజ్లీస్ తో కలిసి 25 సీట్లు గెలిచాం అని...గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల లాంటి ఫలితాలు అసెంబ్లీ ఎన్నికల్లో పునరావృతం అయ్యాయన్నారు.శ్రీనివాస్ యాదవ్ ప్రజల మనిషి అనిశ్రీనివాస్ యాదవ్ 65 నుంచి 75 వేల మెజారిటీ తో గెలవాల్సిందని కానీ మెజారిటీ తగ్గినందుకు తనకు వ్యక్తిగతంగా బాధగా ఉందనిఓట్ల గల్లంతు కూడా మెజారిటీ తగ్గడానికి కారణం అని పేర్కొన్నారు కేటీఆర్.ఓటర్ల నమోదు ను ఉధృతంగా చేయించాల్సిన అవసరం టీఆర్ఎస్ కార్యకర్తల మీద ఉందనిఓటర్ల నమోదుకు జనవరి 25 దాకా అవకాశం ఉందనిఈ అవకాశాన్ని డివిజన్ల వారీగా నేతలు పోటీ పడి వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

ఎన్నికల ఫలితాల తర్వాత మహాకూటమి నేతల బుర్రలు పాడయ్యాయని (తరువాయి 4లో)

### దిమాక్ ఖరాబ్




మోదీ 'అయోధ్య' ప్రకటనపై..

## 'పరివార్'లో ప్రకంపనలు

- వేచి చూడలేమన్న వీహెచ్‌పీ
- ఒత్తిడి తెచ్చేందుకు మార్గన్వేషణ
- ఆర్ఎస్ఎస్ ఆశాభావం
- బీజేపీలో చర్చ

**విజయక్రాంతి, హైదరాబాద్:** 'సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన తరువాతే అయోధ్యలో రామమందిర నిర్మాణం అంశంపై ఆర్డినెన్స్ తీసుకొస్తాం.' అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన ప్రకటన సంఘ్ పరివార్‌లో ప్రకంపనలు సృష్టించింది. పరివార్ అనుబంధ సంస్థలు (తరువాయి 4లో)






తొలగించిన ఓట్లపై

## ఏం చర్యలు తీసుకుంటారు

- ఈసీని ఆదేశించిన హైకోర్టు



**విజయక్రాంతి, హైదరాబాద్:** తొలగించిన ఓట్లను తిరిగి జాబితాలో చేర్చేందుకు తీసుకునే చర్యలను వివరించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, ఓట్ల తొలగింపునకు ముందు అభ్యంతరాలు తీసుకోకుండా తొలగించిన (తరువాయి 4లో)

పంచాయతీ ఎన్నికల్లో..

## అభ్యర్థుల కోసం కుస్తీలు

- పోటీకీ ముందుకు రాని అభ్యర్థులు
- ఖర్చుకు భయపడుతున్న ఆశావహులు
- అసెంబ్లీ ఎన్నికల ఖర్చు చూసి బేజారు
- తలలు పట్టుకుంటున్న పార్టీలు



**విజయక్రాంతి, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీలో ఉండే అభ్యర్థులకు ఖర్చు తడిసి మోపెడు కానున్నది. అసెంబ్లీ ఎన్నికలు జరిగి నెల రోజులు కాలేదు. ఈ సారి అసెంబ్లీ ఎన్నికల్లో అంచనాలకు మించి అభ్యర్థులు ఖర్చు చేశారు. ఒక్కో నియోజకవర్గంలో కనీసం రూ.10కోట్ల నుంచి రూ.30కోట్ల వరకూ వెచ్చించినట్లు తెలిసింది. ఈ ఎన్నికల్లో మద్యం, డబ్బు విచ్చల విడిగా పంపిణీ చేశారు. అసెంబ్లీ ఎన్నికలు జరిగిన తీరుపై గ్రామాల్లోని ప్రజలు ఇప్పటికీ చర్చించుకుంటున్నారు. ఈ ఎన్నికల వేడి చల్లారకముందే (తరువాయి 4లో)



# శుభోదయం


ఓం శ్రీ గురుభ్యోనమః

శ్రీ వికారి నామ సంవత్సరం
దక్షిణాయణం
హేమంత ఋతువు
మార్గశిర మాసం

| | | | |
|---|---|---|---|
| సూర్యోదయం | : ఉ. 06:46 | కరణం | : గరజ 14:42 వనిజ 27:20 |
| సూర్యాస్తమయం | : సా. 05:54 | రాహుకాలం | : మ. 01:42, 03:05 |
| పక్షము | : కృష్ణ పక్షం | యమగండం | : ఉ. 06:50, 08:13 |
| తిథి | : త్రయోదశి 27:20 | వర్జ్యం | : సా. 05:05, 06:48 |
| నక్షత్రం | : అనురాధ 11:03 | అమృతకాలం | : తె. 03:25, 05:08 |
| యోగం | : గండ 25:48 | | |







## సూక్తి సుధ

ముక్తి మార్గం అనుసరించటానికి ఇష్టదేవతను ఉపాసన చేయటం, ఆత్మదర్శన జ్ఞానాన్ని సంపాదించుకోవటం.

– కంచి పరమాచార్య



# తిరుప్పావై పాశురం–19

కుత్తు విళక్కెరియక్కోట్టుక్కాల్ కట్టిల్ మేల్
మెత్తెన్ర పఞ్చశయనత్తిన్ మేలేఱి
కొత్తలర్ పూఙ్గుళల్ నప్పిన్నై కొఙ్గైమేల్
వైత్తుక్కిడంద మలర్ మార్పా! వాయ్ తిఱవాయ్
మైత్తడఙ్కణ్ణినాయ్ నీ యున్మణాళనై
ఎత్తనై పోదుం తుయిలెళ ఒట్టాయ్ కాణ్
యెత్తనై యేలుం పిరివాట్ర గిల్లాయాల్
తత్తువ మన్రుత్తగవేలో రెంబావాయ్

'గుత్తి దీపాలు వెలుగుతుండగా దంతపు కోళ్ళు గల మంచంపై, మెత్తనైన అయిదు లక్షణాలు గల పాన్పుపై నధిరోహించి, గుత్తులు గుత్తులుగా వికసించుచున్న పూవులు కేశాలలో ధరించిన నీలాదేవి స్తనాలను ఆనుకొని శయనించి ఉన్న విశాలమైన వక్షస్థలం గల ఓ దేవా! నోరు తెరువు(అనగా) ఒక మాటను పలుకు. కాటుకచే విశాల మగు కన్నులు గలదానా! నీ ప్రియుని ఒక క్షణమైనను నిద్ర నుండి మేల్కొననీయవు కదా! నీవు ఒక్కక్షణమైనను స్వామి విరహాన్ని ఓర్వ లేనిదో అది నీ స్వరూపానికి తగదు. స్వభావానికి తగదు.'

శ్రీమన్నారాయణ తత్త్వం నెరిగించు జ్ఞానమే దీపం.

దీని గుత్తులు – 1.శ్రుతి 2. స్మృతి 3. ఇతిహాసం 4. పురాణం, 5. ఆగమములు

కువలయాపీడ మనగా అహంకారం.

దంతాలు 4, 1. కర్తృత్వాహంకారం, 2. భోక్తృత్వాహంకారం, 3.జ్ఞాతృత్వాహంకారం, 4. శేషత్వాహంకారము.

పడకమన్న అయిదు లక్షణాలు – అర్థపంచకం, కేశపాశం – వ్యామోహ జనకమగు శేషత్వం.

పూలగుత్తులు – అహింసాది అష్ట పుష్పాలు

స్తనాలు – పరభక్తి పరమ భక్తి



కన్ను – జ్ఞానం
కాటుక – భక్తి

– డా|| బాలుశర్మ పన్నాల (వేద పండితులు)

# శివుడు – తిథిపారిజాతం (1737)

## వేద విజ్ఞానం

భాగం-69

శక.1737లో లక్ష్మేశ్వర గ్రామవాసి, విశ్వామిత్ర గోత్రీకుడు, మహా దేవుని కుమారుడైన శివుడనే సంకలనం చేయబడిన గ్రంథం "తిథిపారిజాతం". ఇది గ్రహలాఘవాన్ని అనుసరించిన గ్రంథం. ఈ లక్ష్మేశ్వర గ్రామాన్ని, ధార్వాడ్‌లోని ఇదే పేరు గల గ్రామాన్ని, ఈ రెండు ఒకటేనా అనేది తెలియలేదు.

### దినకరుడు

దినకరుడు సంకలనం చేసిన గ్రంథాలకు పూనా వాస్తవ్యులు మాధవరావు పాండ్యే రాసిన నకళ్లు ఆనందాశ్రమం, పూనాలో లభిస్తున్నాయి. ఇందులో ఒక గ్రంథంలో ఒక ఉదాహరణలో పలభా 4, రేఖాంశాలు పశ్చిమంగా 28యోజనాలని చూపబడింది. ఈ మానాలు పూనాను సూచిస్తున్నాయి. వీటిని బట్టి దినకరుడు పూనావాసి అని తెలుస్తోంది. 'యంత్ర చింతామణి' వ్యాఖ్యానంలో దివాకరుని తండ్రి అనంతుడని, వీరిది శాండిల్య గోత్రమని చెప్పబడింది.

### సంకలనాలు

దినకరుడు సంకలనం చేసిన సిద్ధాంత గ్రంథాలన్నీ కూడ గ్రహలాఘవ పద్ధతిని అనుసరిస్తూ గ్రహగతుల గణితం సులభంగా ఉండేలా కూర్చడం జరిగింది. దినకరుని సంకలనాలు 1. గ్రహ విజ్ఞాన సారణి – స్పష్ట మధ్యగ్రహాలను సాధించడానికి కావలసిన పట్టికలు పొందుపరచబడ్డాయి. ఇందులో శక.1734, 1739, 1744 సంవత్సరాలకు ఉదాహరణలు ఉన్నాయి. 2. మాస ప్రవేశ సారణి – ప్రతిదినం స్పష్ట సూర్యసాధన విధానం, దానిద్వారా, తాజిక పద్ధతిలో దిన, మాస, వర్షసాధన చేసే విధానాలు చెప్పబడ్డాయి. ఇందులో వివరించిన ఉదాహరణలో, సంవత్సరానికి శక.1744ను, పలభా 4, పశ్చిమ 28 యోజనాల రేఖాంశను గ్రహించడం జరిగింది. 3. లగ్నసారణి – లగ్నాలను సాధించుటకు పట్టికలు, 4. క్రాంతిసారణి – క్రాంతిని సాధించుటకు పట్టికలు, ఉదాహరణకు శక.1753 గ్రహించడం జరిగింది. 5. చంద్రోదయాంకజాల శక.1757కు ఉదాహరణలు ఇవ్వబడ్డాయి. 6. దృక్కర్మసారణి – శక.1758కి ఉదాహరణ ఇవ్వబడినది. 7. గ్రహణాంకజాల – శక. 1755 – 1761కు ఉదాహరణలు చూపబడ్డాయి. 8. శక. 1444 గణేశదైవజ్ఞుని 'పాతసారణి'కి వ్యాఖ్యానం. మహాపాత గణితానికి పట్టికలు ఇవ్వబడ్డాయి. ఇందు శక. 1761కు ఉదాహరణలు చూపబడ్డాయి. 9. యంత్ర చింతామణిటీక – చక్రధరుడు రాసిన ఖగోళ పరికరాల గ్రంథంనకు వ్యాఖ్యానం రాశాడు. వీటిని బట్టి దినకరుడు పరిశీలనా పద్ధతులలో నేర్పుకలిగినవాడనియు, ఖగోళ విజ్ఞానంలో మహా మేధావి అని తెలుస్తోంది.

–డా|| రేమెళ్ల అవధానులు

# స్వార్థపరుడైన వాడు మంచిచెడ్డలను గమనింపడు



## చాణక్యం

న పస్యతి చ జన్మాంధః కామాన్ధో నైవ పశ్యతి!
న పశ్యతి మదోన్మత్తో హ్యర్థీ దోషాన్ న పశ్యతి॥

పుట్టుగుడ్డి చూడలేడు. కామాంధుడు కూడా మంచి చెడ్డలను చూడడు. సారాయి మొదలగు మత్తు పదార్థములు సేవించిన వాడు కూడా ముందు వెనుక చూడడు. స్వార్థపరుడైన మనుష్యుడు కూడా చేయు పనిలోని మంచిచెడ్డలను గమనింపడని చాణక్యుల వారు తమ నీతిశాస్త్రంలో తెలియచేస్తున్నారు. అంతేగాక భర్తృహరి కూడా కామప్రాబల్యాన్ని గురించి ఈ విధంగా చెబుతున్నారు.

కృశః కాణః ఖంజః శ్రవణరహితః పుచ్ఛ వికలో
వ్రణీ పూయక్లిన్నః కృమికులశతై రావృతతనుః
క్షుధాక్షామీ జీర్ణః పిఠరక కపాలార్పితగలః
శునీమన్వేతి శ్వా హతమపి నిహన్త్యేవ మదనః!

ఆహారం లేక బక్కచిక్కి ఉన్నను, ఒంటికంటిదైనను, కుంటిదైనను చెవి తెగినదైనను, తోకలేనిదైనను, పుండుపడి చీము కారుచున్ననూ, పురుగులుపడిన శరీరం కలదైనను, ఆహారం లేక ముసలితనంతో ఊగుచున్న శరీరం కలదైనను, పగిలిన కుండమూతిని మెడకు తగిలించుకుని కుక్క సంభోగం కోసం ఆడుకుక్క వెంటబడిపోవుచుండును. ఓహో! ఇన్ని విధాలుగా నష్టపోయి ఉన్ననూ కుక్కను ఇంకను బాధిస్తున్న ఆ కామదేవుడెంతటి వాడో కదా! అని చెబుతున్నారు. కామాంధుని గుణగణాలను గూర్చి వివరిస్తూ అసలే కామ తీవ్రత ఉన్నవాడు, మాదక ద్రవ్యాలు సేవించి ముందు వెనుకలు చూడకుండా స్వార్థపరుడైన మనిషి కూడా చేయని పనులను చేస్తూ మంచి చెడులను గమనించకుండా అతని కామత్వాన్ని గురించి తెలియచేస్తున్నాడు. అతని కామబుద్ధి ఎంతవరకు ప్రకోపిస్తుందంటే కుంటిదైన, అంగాలు సరిగా లేక, పురుగులు పట్టిన శరీరం కలది అయిన, ముసలితనంలో ఆహారం అందని, వణుకుతున్న శరీరంగల దైనను పగిలిన కుండ మూతని తగిలించుకున్న కుక్క సంభోగం కూడా ఆడకుక్క వెంటపడి పోతూ ఉంటుంది. ఇన్ని విధాలుగా కుక్క నష్టపోయిన స్థితిలో ఉన్నా దాని కామకోరికలు ఇంకా తగ్గకపోవడం వెనుక ఆ కామదేవుడు ఎంత దయలేని వాడో ఇక్కడ చెబుతున్నారు. అంటే ఆ కామానికి అంత శక్తి ఉందని నీతిశాస్త్రంలో చాణక్యుల వారు తెలియచేస్తున్నారు.

–యామిజాల సుబ్రహ్మణ్యం

## పురాణ క్విజ్

తెలిసినవేంటో తేల్చుకోండి! తెలియనివన్నీ తెలుసుకోండి..

1. అనసూయ ఎవరి మనమరాలు?
2. అనిలుడు ఎవరు?
3. కుంతి మంత్రశక్తితో ఇంద్రునిచేత జన్మించిందెవరు?
4. గడ్డిపరక కన్నా తేలికైనది?
5. వామనుడు అనగా?
6. సాంఖ్య యోగంను పురాణ రూపంలో సత్యవ్రతునికి విష్ణువు ఏ రూపంలో వినిపించెను?
7. కుక్క రూపంలో ధర్మరాజును వెంబడించినది?
8. విష్ణుపురాణం ప్రకారం సర్వకాల సర్వావస్థలలో పఠించదగు మంత్రం ఏది?
9. రావణుని ఏ అస్త్రంతో రాముడు వధించాడు?
10. బ్రహ్మమానస పుత్రులు?

### సమాధానాలు

1. స్వాయంభువ మనువు
2. అష్టవసువులలో ఒక్కరు
3. అర్జునుడు
4. యాచకుడు
5. చిన్న దేహం గలవాడు
6. మత్స్యం
7. యమధర్మరాజు
8. ఓ నమోనారాయణాయ
9. బ్రహ్మాస్త్రం
10. సనక సనందాదులు..





# చక్రభ్రమణం

కృతయుగం, త్రేతాయుగం, ద్వాపరయుగం, కలియుగం... ఇది 'యుగచక్రం'.

వర్షకాలం, చలికాలం, ఎండకాలం... ఇది 'రుతుచక్రం'.

రోజులు, వారాలు, నెలలు, సంవత్సరాలు.. ఇది 'కాల చక్రం'.

బాల్యం, కౌమారం, యౌవనం, వార్ధక్యం... ఇది 'జీవిత చక్రం'.

సృష్టి, స్థితి, లయ కారకుడైన ఆ పరమేశ్వరుడి నిర్దేశాను సారం 'చక్ర భ్రమణం' నిరంతరంగా సాగిపోతూనే ఉంటుంది. రంగుల రాట్నంలో కింది నుంచి పైకి, పైనించి కిందికి తిరుగుతున్నట్టే మనిషి జీవితంలో సుఖానుభవాలు, దుఃఖానుభవాలు..ఒకదాని వెంట మరొకటిగా కలుగుతూనే ఉంటాయి. ఈ సత్యం తెలిసికూడా మనసును మాయపొర కమ్మేయడంతో రాగబంధాలకు లోనైన మనిషి నిరంతరం బాధపడుతుంటాడు.

జీవిత ప్రయాణం అంటే గమ్యం వైపు గమనం. ఏది గమ్యం అనేదే జటిలమైన ప్రశ్న! గమ్యాన్ని నిర్దేశించేది కోరిక. ఆ కోరికను ప్రేరేపించేవి మూడు ధనం, సుఖం, కీర్తి. ఎంత ధనం కావాలి, ఎంత సుఖాన్ని అనుభవించాలి, ఎంత కీర్తిని మూట కట్టుకోవాలి? ఈ 'ఎంత' అనేదానికి 'అంతు' ఉందా? చాలా మంది విషయంలో లేదు, ఉండదు! మనిషి జీవితంలో బాల్యం అమాయకంగాను, కౌమారం జిజ్ఞాసతోను, యౌవనం ఆశలతోనూ గడిచిపోతాయి. వార్ధక్యం వచ్చేసరికే అసలు సమస్య మొదలవుతుంది. జీవిత చరమాంకంలోనూ కోరిక చావదు. ఇంకా ధనం కావాలి, సుఖాలు కావాలి, కీర్తి ప్రతిష్ఠలు కావాలి. ఇంకా, ఇంకా.. ఈ పరుగును ఎక్కడ ఆపాలో తెలియకపోవడమే దుఃఖానికి హేతువు అవుతుంది. అలాగని కోరికే లేకుండా జీవించడం సాధ్యమే కాదు. ఆ కోరిక ఎంతవరకు అనే విచక్షణే సుఖదుఃఖాలను నిర్ణయిస్తుంది.

ఉరిశిక్ష పడిన ఓ నేరస్థుడికి శిక్ష అమలుపరచేందుకు తలారి సిద్ధమయ్యాడు. ఉరికొయ్యకు అతడి కాళ్లూచేతుల్ని తాళ్లతో ముడివేసి, పరిసరాలు కనిపించకుండా ముఖానికి నల్లటి ముసుగును కప్పేశాడు. ఇష్టదైవ ప్రార్థన చేసుకోవడానికి ఆ జైలు అధికారి అతడికి ఒక నిమిషం వ్యవధి ఇచ్చాడు. ఆఖరి క్షణాల్లో ఉన్న ఆ నేరస్థుడికి కేవలం తన పాదాలు మాత్రమే కనిపిస్తున్నాయి. అప్పుడే ఒక తేలు అతడి పాదానికి అంగుళం దూరంలో కనిపించింది. భయంతో అతడు తన కాలివేళ్లను వెనక్కి తీసుకోవడానికి, తేలుకాటు నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు.. మరికొద్ది క్షణాల్లో ఉరిశిక్షను అనుభవించబోతున్న అతడికీ ప్రాణాలమీద ఆశే!


మరణించేదాకా జీవించాలనే ఆశను కలిగిఉండటం మనిషి నైజం!

అడవిలో ఒక రుషి తపస్సు చేసుకుంటున్నాడు దీక్షగా. రుషిని గురించి విన్న ఆ దేశ రాజు చూడటానికి వెళ్లాడు. కానీ అంతకు ముందు రోజే ఆ రుషి హిమాలయాలకు వెళ్ళిపోయాడని తెలిసి, దర్శన భాగ్యం కలగనందుకు బాధపడిన రాజు, అలౌకిక సంపద కలిగిన రుషి తిరిగి వస్తాడనే నమ్మకంతో అన్ని వసతులతో కూడిన గొప్ప మందిరాన్ని నిర్మించాడు. కొంత కాలం తరవాత తిరిగివచ్చిన ఆ రుషి చెట్టు స్థానంలో వెలసిన మందిరంవైపు చూడగానే అక్కడివాళ్లు రాజుగారు ప్రత్యేకంగా మీ కోసమే కట్టించారు స్వామీ అని సెలవిచ్చారు. విరాగి అయిన రుషి మందిరంవైపు నిర్వికారంగా చూసి దూరంగా ఉన్న మరో చెట్టు కింద కూర్చుని తపస్సు చేసుకోవడం ఆరంభించాడు! బ్రహ్మజ్ఞానం తప్ప మరే కోరికా లేకపోవడం రుషి నైజం.

ప్రాణంకోసం తపించే మామూలు మనిషి స్థితి నుంచి, ఈ ప్రాణమే శాశ్వతం కాదు అనే పరిపక్వ స్థితికి చేరడమే జ్ఞాన దర్శనం అంటే.

చక్ర భ్రమణంలో తనను తాను తెలుసుకుంటూ, జీవన ప్రస్థానంలో అన్ని దశలనూ దాటుకుంటూ మహాప్రస్థానం వైపు అడుగులు వేసేలోగా 'నిగ్రహం, నిర్మోహం, నిరాపేక్షత' అనే త్రిలక్షణాలను త్రికరణ శుద్ధిగా ఆచరించాలి. అలా చేయగలిగితే అంతర్యామిని చేరుకునే అలౌకికమైన ఆనందం సిద్ధిస్తుంది.

# శరీరంతో మోక్షం



దాదాపొకవారం క్రిందట నూతనాగతులొకరు భగవానులను సమీపించి "ఈ శరీరంతో శాశ్వతంగా ఇట్లాగే ఉండి మోక్షం పొందవచ్చునా?" అని ప్రశ్నించారు. "అసలు మోక్షమంటే ఏమిటి? పొందేదెవరు? బంధం ఉంటేగదా మోక్షం? ఆ బంధం ఎవరికీ?" అన్నారు భగవాన్. "నాకే"నన్నారా పృచ్ఛకులు. "నీవంటే ఎవరు? బంధం నీకు ఎట్లా వచ్చింది? ఎందుకొచ్చింది? అది ముందు తెలుసుకుంటే, ఈ శరీరంతో శాశ్వతంగా ఉండి మోక్షం పొందే విషయం ఆలోచిద్దాం" అన్నారు భగవాన్. వారిక మాట్లాడలేక విరమించుకొని కొంచెం సేపు ఉండి లేచిపోయినారు.

వారు వెళ్ళిన వెనుక అనుగ్రహపూరిత దృక్కులతో అందరినీ చూచి "చాలా మందికిదే ప్రశ్న. ఈ శరీరంతో ఇట్లాగే మోక్షం పొందాలని, ఇదొక సంఘం, ఇప్పుడే గాదు. పూర్వం కూడా ఎందరెందరో కాయకల్పవ్రతాలనీ, అవనీ, ఇవనీ, ఏమేమో చెప్పి, ఈ శరీరాన్ని వజ్రతుల్యం చేయవచ్చనీ, ఈ బొందితోనే కైలాసానికి పోవచ్చనీ శిష్యులకు బోధించటమేగాక, ఎన్నెన్నో గ్రంథాలు రాసి పెట్టేవారు. ఇంతా చెప్పి ఇన్నీ చేసి, ఎన్నో రాసి, కడకు ఎప్పుడో ఒకప్పుడు కాలానికి వశమై వారూ పోయేవారు. చెప్పినట్టి చేసినట్టి గురువై పోతే శిష్యులకే ముందిక? ఇప్పుడు చూచింది ఇంకొక క్షణానికేమవుతుందో మనకు తెలియదు. ఈ శరీరం నేను కాదని విచారించి తెలిసి, దాన్ని లక్ష్యం చేయని వైరాగ్యవంతునకు గాని శాంతి కుదరదు. శాంతి కుదురుటే గదా మోక్షం? శరీరం నేనను భ్రాంతి ఉన్నంతవరకు శాంతి కుదరదు. శాంతి కుదురుటే గదా మోక్షం? శరీరం నేనను భ్రాంతి ఉన్నంత వరకు శాంతి కుదరదంటే ఈ శరీరాన్ని ఇట్లాగే ఉంచుకోవాలన్న ప్రయత్నం చేస్తే బంధం ఎక్కువవుతుందేగాని తగ్గటం ఎట్లా సంభవిస్తుంది? ఇదొక భ్రాంతి" అన్నారు భగవాన్.

– సూరి నాగమ్మ
(రమణ మహర్షి లేఖలు)

## ధర్మ సందేహాలకు సమాధానాలు

### 1. గణేశునికి 'ఏకదంతుడ'నే పేరెలా వచ్చింది?



పరమేశ్వరుని శిష్యుడైన పరశురాముడు ఒకసారి కైలాసానికి వెళ్ళి శివుణ్ణి దర్శించాలనుకొన్నాడు. పరశురాముడు వెళ్ళేసరికి శివుడు నిద్రిస్తున్నాడు. గణేశుడు కాపలాగా ఉన్నాడు. పరశురాముడు లోపలికి వెళ్ళబోగా వినాయకుడు అడ్డగించాడు. తన గురువును దర్శించడానికి అడ్డువచ్చిన నీవెవడవని ఆగ్రహించిన పరశురాముడు కోపంతో వినాయకునితో యుద్ధానికి సిద్ధమయ్యాడు. వినాయకుని చేతిలో పరశురాముడు ఓడిపోయే పరిస్థితి ఏర్పడింది. వినాయకుడు తన తొండంతో గిరగిరా తిప్పసాగాడు. అది గమనించిన పరశురాముడు తన పరశువు (గొడ్డలి)ను వినాయకునిపైకి విసిరాడు. పరమేశ్వర వరప్రసాదమైన పరశువును ఎదిరించకుండా ఉండేందుకు వినాయకుడు తన దంతాన్ని అడ్డుపెట్టాడు. దాంతో పరశువు దంతాన్ని భగ్నం చేసింది. ఈ విధంగా వినాయకుడు ఏకదంతుడయ్యాడు. ఈ సంఘటన జరుగక ముందు విఘ్నేశ్వరునికి ద్వి(రెండు) దంతాలుండేవి. ద్విదంత విఘ్నేశుని స్తుతించిన తెలుగుకవి నన్నెచోడుడు. ఆయన రచించిన కుమారసంభవంలో ద్విదంత గణపతిని ప్రార్థించాడు.

### 2. హనుమంతుడు రుద్రాంశ సంభూతుడంటారు. ఎలా?



విష్ణువు మోహినీరూపం ధరించి చాలా అందంగా కన్పించి సురాసురులనే సమ్మోహితుల్ని చేస్తాడు. ఒకసారి పార్వతితోపాటు నంది వాహనమెక్కి ప్రమథాదులతో విష్ణువు వద్దకు వచ్చి, తాను మోహినీ రూపం దర్శింప కోరుతున్నానన్నాడు శివుడు. శివుని కోర్కెను అంగీకరించిన విష్ణువు మోహినీరూపాన్ని ధరించగా శివుని మనస్సు ఒక్క క్షణం చలించింది. శివుడు తన మనోచాంచల్యంతో కలిగిన విశిష్టతేజాన్ని సప్తర్షులకిచ్చాడు. ఋషులు ఒక ఆకును దొన్నె (దొప్ప)గా చేసి ఆ తేజాన్ని గ్రహించారు. తర్వాత శ్రీరామావతార లీలకొరకు పరమేశ్వరుడు ఋషుల్ని ప్రేరేపిస్తే సప్తర్షులు తమ దగ్గరున్న శివతేజస్సును సత్పుత్రునికోసం తపస్సు చేస్తున్న అంజనాదేవిలో ప్రవేశపెట్టారు. తర్వాత ఆమె గర్భవతియై ఆంజనేయునికి జన్మనిచ్చింది. ఇలా హనుమంతుడు శివాంశ సంభూతుడని పురాణకథ తెలియచేస్తుంది.

–డా|| పి. భాస్కరయోగి

## భవాన్స్‌లో జ్యోతిష్యంలో కోర్సులు

విజయక్రాంతి, హైదరాబాద్: బషీర్‌బాగ్‌లోని భారతీయ విద్యాభవన్‌లో జ్యోతిష్య ప్రవీణ, జ్యోతిష్య విశారద కోర్సుల్లో ఒక ఏడాది కోర్సులను ప్రవేశ పెట్టామని డిప్యూటీ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులకు సంబంధించి బోధన ఇంగ్లీష్ మీడియంలో జరుగుతుందని, ప్రతి ఆదివారం తరగతులు ఉంటాయని చెప్పారు. జనవరి 6 నుంచి శిక్షణ మొదలవుతుందని, జ్యోతిష్య ప్రవీణకు అర్హత పదవ తరగతి పాసై ఉండాలని, జ్యోతిష్య విశారదకు జ్యోతిష్య ప్రవీణ పాసై ఉండాలని వివరించారు. వివరాల కోసం కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించవచ్చని లేదా ఫోన్ 040–2323 0755, మొబైల్ 9441207796 తెలుసుకోవచ్చని చెప్పారు.

## ముషీరాబాద్‌లో లక్ష్మణ్ పాదయాత్ర



విజయక్రాంతి, ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గం గాంధీనగర్ డివిజన్ వివేక్ నగర్ బస్తీ, చిక్కడపల్లిలో బుధవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ పాదయాత్ర చేశారు. ఈ పాదయాత్రలో స్థానిక బస్తీ ప్రజలను కలుస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పేద ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ఎంతవరకు అందుతున్నాయో ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపీ నాయకులు రతన్ సాయి చంద్, గోపాల్, శ్రీకాంత్, వినయ్ కుమార్, నర్సింగరావు, ఆకుల సురేందర్, మొహమ్మద్, లావణ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ రిజర్వేషన్ల తగ్గింపుపై
# ఇందిరా పార్కు వద్ద నిరాహార దీక్ష

విజయక్రాంతి, హైదరాబాద్: పంచాయతీ ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు 34శాతం నుంచి 22శాతానికి తగ్గించడం సరికాదని బీసీ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు రిజర్వేషన్ల తగ్గింపుకు వ్యతిరేకంగా బుధవారం ఇందిరాపార్కు వద్ద బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిరాహారదీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లను తగ్గించడం దారుణమని అన్నారు. బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం కలిగిస్తామన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని యూనివర్సిటీల విద్యార్థి సంఘాలను ఒక్కతాటిమీదికి తీసుకువస్తామని, బీసీలకు అన్యాయం జరుగకుండా చూస్తామని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పును అనుకరిస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఆర్డినెన్సును తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లెక్క ప్రకారం అయితే రాష్ట్రంలో ఉన్న 12,751 పంచాయతీలలో బీసీలకు జనాభా శాతం ప్రకారం సగానికి పైగా రావాల్సి ఉన్న అన్యాయంగా బీసీల రిజర్వేషన్లలో కోత పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఖచ్చితంగా బీసీలను రాజకీయంగా ఎదగనీయకుండా ప్రభుత్వాలు చేసే కుట్రగా వివరించారు. ఓయూ జేఏసీ నాయకులు రాజు నేత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం




జారీ చేసిన ఆర్డినెన్స్ ప్రకారం రాష్ట్రంలో దాదాపుగా 1300 పంచాయతీలను బీసీలు కోల్పోతున్నారని తెలిపారు. తమిళనాడు ప్రభుత్వం తరహాలో రిజర్వేషన్లను యాభై శాతానికి మించి కూడా ఇవ్వొచ్చని గతంలో కోర్టులు తీర్పు చెప్పిన ఉదంతాలను గుర్తుచేశారు. తెలంగాణలో కొత్తగా ఏర్పాటైన టీఆర్‌ఎస్ ప్రభుత్వం బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే సుప్రీంకోర్టుకు వెళ్లి బీసీలకు న్యాయం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటులోని సామాజిక అభివృద్ధి ముడిపడి ఉందని, దీనిమీద ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ రాబోయే రోజుల్లో సామాజిక ఉద్యమాలను నడిపిస్తామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆశప్ప, దత్తు, వంశీ, మధు తదితరులు పాల్గొన్నారు.

## హమారా షహర్



వీరి దినచర్యలో ఏ రోజూ మార్పు ఉండదు. ఎందుకంటే పని చేసుకుంటేనే వారికి కడుపు నిండేది. ఇంటింటికి తిరిగి ముగ్గు అమ్మే మహిళలు తార్నాక వద్ద ఉదయాన్నే రిక్షా తొక్కుతూ కనిపించారు.

## అందరూ సుఖసంతోషాలతో ఉండాలి

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



విజయక్రాంతి, ఎల్బీనగర్: డీఎస్‌ఆర్ యాక్షన్ టీం ఆధ్వర్యంలో ఎల్బీనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి చేతుల మీదుగా నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరికీ, కార్యకర్తలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంవత్సరం అందరు సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో రావినూతల రమాకాంత్, తిప్పర్తి విజయభాస్కర్‌రెడ్డి, రాంపల్లి సాయినాథ్‌గౌడ్, నరేందర్, సతీష్, వెంకట్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## జూనియర్ సైన్స్ ఒలింపియాడ్‌లో
# నారాయణ టాప్




విజయక్రాంతి, హైదరాబాద్: హోమిబాబా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జూనియర్ సైన్స్, కెమిస్ట్రీ, అస్ట్రానమీ ఒలింపియాడ్ః మొదటి దశ ఫలితాలలో నారాయణ విద్యార్థులు విజయదుందుభి మోగించారు. స్కూల్ స్థాయి నుంచి జూనియర్ సైన్స్ ఒలింపియాడ్‌లో అత్యధికంగా 23 సెలక్షన్స్‌తో సంచలన విజయం నమోదు చేశారు. విజయం సాధించిన విద్యార్థులందరూ నారాయణ ప్రతిష్టాత్మక ప్రోగ్రామ్స్ అయిన సీవో స్కార్ప్, ఒలింపియాడ్, ఈ టెక్నో, మెడిస్పార్క్ ప్రోగ్రామ్స్‌లో తర్ఫీదు పొందిన వారేనని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ డా. పి. సింధూరు నారాయణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్కూల్ విద్యావిధానంలో తీసుకొచ్చిన మార్పులు నేడు సత్ఫలితాల్ని అందిస్తున్నాయన్నారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ సబ్జక్టుల్లో నూతన ఆవిష్కరళణ దిశగా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విజయకేతనం ఎగురవేసిన విద్యార్థులను నారాయణ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె. పునిత్ ప్రత్యేకంగా అభినందించారు.

# రాజ్యాధికారమే అంతిమ లక్ష్యం

- కొత్త పంథాతో ఉద్యమాలు నిర్మిస్తాం
- సీఎం కేసీఆర్ బీసీలను నమ్మించి మోసం చేశారు
- ఏ సీఎం ఇంత దారుణంగా వ్యవహరించలేదు
- ఆర్ కృష్ణయ్య



విజయక్రాంతి, హైదరాబాద్: వెనకా ముందు ఎవరు లేని సమయంలో ఓ సామాజిక అంశాన్ని పట్టుకొని పోరాడుతూ వచ్చిన ఓ విశ్వవిద్యాలయ విద్యార్థి... ఆ తరువాత రాష్ట్రంలోనే అత్యధిక సామాజిక వర్గమైన బీసీలకు జాతీయ నాయకుడయ్యారు. ఆయన పోరాటాలే ఆయకున్న బలంగా నాలుగు దశాబ్దాలుగా ఉద్యమాలు చేపడుతున్నారు. ఆ క్రమంలో ఎన్నో ఆటంకాలు, ప్రభుత్వాల అణచివేతలు ఎదురవుతున్నా అదరక, బెదరక బీసీ జెండానే అజెండాగా ముందుకు సాగుతున్న ఓ అసాధారణ వ్యక్తే మాజీ ఎమ్మెల్యే ఆర్. కృష్ణయ్య. బీసీలకు పంచాయతీ రిజర్వేషన్ల తగ్గింపుపై మరో సుధీర్ఘ పోరాటానికి సిద్ధమవుతున్నారు. రాజ్యాధికారంలో బీసీలకు వాటా దక్కేంత వరకు విశ్రమించేది లేదంటున్నారు. ఈ నేపథ్యంలో విజయక్రాంతితో తన భవిష్యత్ కార్యాచరణను పంచుకున్నారు.

### మారనున్న ఉద్యమ పంథా
### రాజ్యాధికారం దిశగా పోరాటాలు

బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా కొత్త పంథాలో ఉద్యమాలు చేపడుతాం. రిజర్వేషన్లను జనాభాకు అనుగుణంగా పెంచాల్సిందిపోయి, ఉన్న వాటిని తగ్గించటాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి బీసీలను చైతన్యపరుస్తాం. మేధావులు, వేరువేరు వేదికలతో ఉద్యమాలు చేస్తున్నవారిని ఏకతాటిపైకి తేవటంతో పాటు ఉద్యమాలకు సిద్ధాంత రూపాన్ని తేనున్నాము. బీసీ కులాల్లో ఉన్న పరస్పర వైరుధ్యాల కారణంగా ఏకతాటిపైకి రావటంలో జాప్యం జరుగుతోంది. ఐక్యత ఏర్పడి బలపడుతున్న సమయంలో పాలకులు వారు తిరుగులేని శక్తిగా ఏర్పడుతారన్న భయంతో విడిదీస్తూ ఉద్యమాలను చీల్చుతున్నారని ఆరోపించారు. గతంలో ఎన్నడూ ఏ సీఎం ఇలా వ్యవహరించలేదు.

### బీసీ రిజర్వేషన్ల తగ్గింపుపై
### ప్రజాక్షేత్రంలో నిలదీస్తాం

2014 ఎన్నికల మేనిఫెస్టోలో బీసీ రిజర్వేషన్లను 42 శాతం, 2018 ఎన్నికల మేనిఫెస్టోలో35 శాతం పెంచుతానని హామీ ఇచ్చి, గెలిచిన వెంటనే తగ్గించటంతో బీసీల పట్ల తన నిజస్వరూపం బయటపడింది. ముస్లిం రిజర్వేషన్ల విషయంలో ఒక విధంగా, బీసీల విషయంలో మరో విధంగా వ్యవహరించటం అన్యాయం. సీఎం కేసీఆర్ నమ్మించి మోసం చేశారు. హాస్టళ్లను ఎత్తేయాలని చూశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నిర్వీర్యం చేసేందుకు యత్నించారు. వాటితో బీసీలు ప్రత్యక్షంగా లబ్ధిపొందుతుండటంతో ఎక్కడ వ్యతిరేకత వస్తుందోనని రిజర్వేషన్ల విషయంలో దొంగదెబ్బ కొట్టారు.

### టీఆర్‌ఎస్ బీసీ ఎమ్మెల్యేలు
### సీఎంను ఒప్పించాల్సింది

పంచాయతీరాజ్ ఎన్నికలను వెంటనే జరపకుండా ముందస్తుకు పోయినా సీఎం మరికొంత కాలం రిజర్వేషన్ల సమస్య పరిష్కారం చేయాల్సింది. కానీ చేయలేదంటే బీసీల పట్ల ఆయన పూర్తిగా వ్యతిరేకంగా ఉన్నారన్న విషయం స్పష్టమైంది. దీనిపై బీసీ ఎమ్మెల్యేలు అమాయకంగా సీఎంను సమర్ధించటం మానేసి ఆయనను ఒప్పించి రిజర్వేషన్లను తగ్గించకుండా కృషి చేసి ఉంటే బాగుండేది.

### బీసీ రిజర్వేషన్ల విషయంలో
### కేసీఆర్‌ది నమ్మక ద్రోహమే

కేసీఆర్ బీసీలను నమ్మించి మోసం చేస్తున్నాడురు. బీసీ నేతలు ఈ విషయాన్ని గమనించాలి. బీసీలు రాజకీయంగా బలపడకుండా కుట్ర చేయటంలో భాగమే రిజర్వేషన్ల తగ్గింపు, వాటిని తగ్గించకుండా ఎన్నికలు జరిపేందుకు అవకాశమున్నా అలా చేయలేదు. గతంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేల రద్దు కేసులో ఢిల్లీ నుంచి పేరుమోసిన లాయర్లతో ప్రభుత్వం తరపున వాదించేలా చూశారు.

### సుధీర్ఘ పోరాటాలతో
### ఎన్నో విజయాలు సాధించాం

గతంలో చేసిన పోరాటాలతో 34శాతం రిజర్వేషన్లు సాదించుకున్నాం. 1987లో ఎన్టీఆర్ హయాంలో పంచాయతీరాజ్‌లో రిజర్వేషన్లు సాధించుకున్నాం. మండల్ కమిషన్ అమలు ఉద్యమ ఫలితంగా ఇవి వచ్చాయి. అప్పట్లోనూ పాలకులు మానుంచి కొందరిని విడదీసి, వేరుకుంపటి పెట్టించారు. ఇటీవల టీఆర్‌ఎస్ సర్కారు సైతం కొన్ని సంఘాలను చేరదీసి బీసీ ఉద్యమాలను అణిచే కుట్రలు చేస్తున్నాయి.

### ముందుస్తు ఎన్నికలతోనే
### పార్టీ స్థాపనపై వెనక్కు తగ్గాం

బీసీ అజెండాగా రాజకీయ పార్టీ ఏర్పాటు ఎప్పటికైనా జరిపి తీరుతాం. ఈసారి ముందస్తు ఎన్నికల కారణంగానే వాయిదా వేశాం. సరైన సమయం కోసం వేచి చూస్తున్నాం. ఈలోగా బీసీ సంఘాన్ని గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయిలో బలోపేతం చేసే దిశగా పని చేస్తున్నాం.

### బంద్ ప్రభావంతో
### బీసీలకు ఎక్కువసీట్లు ఇచ్చాయి

తమ బంద్ పిలుపుతోనే మలి జాబితాలో ప్రధాన పార్టీలు బీసీలకు ఎక్కువ సీట్లు ఇచ్చాయి. నాపై ఆరోపణలు చేసేవారు ఆ బంద్‌కు మద్దతు ఇవ్వలేదు. దాంతో వారు ఆ విషయంపై ప్రశ్నించే నైతికతను కోల్పోయారు. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు సాధించటం పైనే ప్రధానంగా దృష్టి పెడతాం.

## గవర్నర్‌కు కేటీఆర్ శుభాకాంక్షలు



విజయక్రాంతి, హైదరాబాద్: టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్‌ను రాజ్‌భవన్‌లో కలిశారు. గవర్నర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారని రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి. కొత్త సంవత్సరం రోజున, కేటీఆర్ గవర్నర్‌ను కలవలేకపోయారు. దీంతో బుధవారం ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులు బాల్క సుమన్, శంభీపూర్ రాజు కూడా కేటీఆర్‌తో పాటు గవర్నర్‌ను కలిసిన వారిలో వున్నారు.

## రామాలయంలో వైభవంగా అయ్యప్ప స్వాముల ఇరుముడి



విజయక్రాంతి, ఉప్పల్: ఉప్పల్ కాప్రా సర్కిల్ పరిధి చర్లపల్లి డిఇజన్‌లోని రామాలయంలో అయ్యప్పస్వాముల ఇరుముడి కార్యక్రమాన్ని నరసింహన్ గురుస్వామి, వెంకటేశంగౌడ్ గురుస్వాములు రామాలయం సన్నిధానంలో వైభవంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామాలయం అయ్యప్ప సేవాసమితిలో 59 మంది స్వాములు 41 రోజులు అయ్యప్ప మాల ధారణ దీక్షతో స్వాములు ఒంటిపూట బిక్షా, కఠిన నియమాలు పాటిస్తూ, దీక్షలు చేసి ఇరుముడి ధరించి శబరిమలకు బయలు దేరటం ఆనందంగా ఉందన్నారు. అనంతరం కె.శశికాంత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్వాములు రాహుల్, నరేష్, శ్రీనివాస్, రాంకోటి, బాబు, శంకర్, సాయి, సూర్య, హరిరాజు, స్థానిక నాయకులు రామచందర్‌గౌడ్, పాండు, ప్రేమ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌ఐసీ చైర్మన్‌గా భార్గవకు అదనపు బాధ్యతలు



విజయక్రాంతి, హైదరాబాద్: ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్‌ఐసీకి చైర్మన్‌గా ప్రస్తుత ఎండీ హేమంత్ భార్గవ అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఎల్‌ఐసీ చైర్మన్‌గా వీకే శర్మ డిసెంబర్ 31న పదవీ విరమణ చేయడంతో తాత్కాలికంగా భార్గవకు ఈ బాధ్యతలు అప్పగించారు. ఆయన 2017 ఫిబ్రవరి నుంచి ఎల్‌ఐసీ ఎండీ బాధ్యతల్లో ఉన్నారు.

### చైర్మన్ పదవికి ఇంటర్వ్యూలు

ఎల్‌ఐసీ చైర్మన్, ఎండీ పోస్టులకు అభ్యర్థుల ఎంపికలో భాగంగా కేంద్ర ప్రభుత్వ సిబ్బంది, శిక్షణ శాఖ సెక్రటిరీ బీపీ శర్మ ఆధ్వర్యంలోని బ్యాంకు బోర్డు బ్యూరో (బీబీబీ) ఈ నెల 4న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఎండీగా ఉషా సంగ్వాన్ పదవీకాలం గతేడాది సెప్టెంబర్‌తో ముగిసిపోవడంతో ఈ పోస్ట్ ఖాళీగా ఉంది. ఎల్‌ఐసీ ఎగ్జిక్యూటివ్ బోర్డులో ఒక చైర్మన్, నలుగురు ఎండీలు ఉంటారు. చైర్మన్, ఎండీ పదవుల కోసం ఎనిమిది మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్టు సంబంధిత వర్గాల కథనం. ఎల్‌ఐసీలోనే అధికారుల స్థాయిలో ఉన్న ఎంఆర్ కుమార్, హెచ్‌ఎస్ శశికుమార్, టీసీ సుశాల్ కుమార్ (హైదరాబాద్ జోనల్ మేనేజర్), ఎల్‌ఐసీ మ్యూచువల్ ఫండ్ సీఈవో రాజ్ కుమార్ తదితరులు రేసులో ఉన్నారు.




అత్యతి టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే ఫిన్‌టెక్ కంపెనీతో సిండికేట్ బ్యాంక్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ కంపెనీ గణసేవ అనే పేరుతో సొంద టెక్నాలజీ ప్లాట్‌ఫామ్‌ను నడుపుతోంది. అంతే కాకుండా, నిర్మాణం, గనులు, ఇతర ఎక్విప్‌మెంట్స్‌లో పేరొందిన ఫైనాన్షియల్ శ్రీ ఎక్విప్‌మెంట్ ఫైనాన్స్ లిమిటెడ్‌తో కూడా ఒప్పందం కుదుర్చుకోవాలని ప్రతిపాదించింది.

## హైదరాబాద్ టీఎన్జీవోల క్రీడా ఉత్సవాలు

విజయక్రాంతి, మెహిదిపట్నం: టిఎన్జీఓ హైదరాబాద్ జిల్లా 4వ స్పోర్ట్స్ మీట్ కార్యక్రమం అధ్యక్షుడు ఎమ్.ఎస్ హుస్సేన్(ముజీబ్) ఆధ్వర్యంలో ఎల్.బి స్టేడియంలో బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మండలి ఛైర్మన్ స్వామిగౌడ్ మాట్లాడుతూ.. ఆటల ద్వారా మానసిక,శారీరక ఒత్తిడి తగ్గుతుందని తెలిపారు.టిఎన్జీఓ కేంద్ర సంఘం అధ్యక్షులు కారం రవిందర్ రెడ్డి టిఎన్జీఓ జెండానుఆవిష్కరించారు.ఉద్యోగులు మార్చ్ ఫాస్టు నిర్వహించారు. పురుషులకు వాలిబాల్, కబడ్డి, మహిళలకు చెస్, క్యారమ్, బ్యాడ్మింటన్ పోటిలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిలుగా శ్రీనివాస్‌గౌడ్, దేవిప్రసాద్, ఎ.వి రెడ్డి, దినాకర్ ఐఎస్, జిల్లా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# మోదీతో ముఖాముఖీకి సై

- రఫేల్‌పై 20 నిమిషాలు కేటాయిస్తే చాలు
- విమానాల ధర పెంపు ఎవరి నిర్ణయం?
- రూ.526 కోట్ల నుంచి రూ.1600 కోట్లకు ఎందుకు పెరిగింది?
- ఈ ఒప్పందానికి ఐఏఎఫ్ ఒప్పుకుందా?
- హెచ్ఏఎల్‌ను పీఎం కాదన్నారన్న హోలెండే మాటల్లో వాస్తవమెంత?
- నా ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలి
- ప్రధానికి ఆ ధైర్యం ఉందా?
- డీల్ పేరుతో రూ.33 వేల కోట్లు కొల్లగొట్టారు
- ఆయన మిత్రుడు అనిల్ అంబానీకి లబ్ధి చేకూర్చారు
- జేపీసీ వేస్తే ఈ ఇద్దరి పేర్లే బయటకు వస్తాయి
- ప్రెస్‌మీట్‌లో రాహుల్ గాంధీ సవాల్




న్యూఢిల్లీ: రఫేల్ డీల్‌పై ప్రధాని మోదీతో వన్ టు వన్ చర్చకు తాను సిద్ధమని, తనకు 20 నిమిషాల సమయం కేటాయిస్తే చాలని రఫేల్‌తో పాటు కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ గురించి కూడా మాట్లాడతానని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సవాల్ విసిరారు. తన ప్రశ్నలకు సమాధానాలు చెప్పే ధైర్యం ప్రధాని మోదీకి ఉందా అని ప్రెస్‌మీట్‌లో ఆయన ప్రశ్నించారు. నాటి రక్షణ మంత్రి, ప్రస్తుత గోవా సీఎం మనోహర్ పారికర్ బెడ్ రూంలో ఏం సమాచారం ఉంది? ఆయన వద్ద ఏలాంటి ఫైల్స్ దాచారు? వీటి వల్ల మోదీపై ఎలాంటి ప్రభవం ఉంది? పారికర్ అంటే మోడీ ఎందుకు భయపడుతున్నారు? అని రాహుల్ ప్రశ్నల వర్షం కురిపించారు.

### రఫేల్ ధర రహస్యమంటూనే బయటపెట్టారు..

రఫేల్ విమానాల ధర రహస్యమని ఓ వైపు కేంద్ర రక్షణమంత్రి నిర్మలా సీతారామన్ చెబుతున్నారని, మరోవైపు ప్రధాని లేదా రక్షణశాఖ వ్యవహారాలతో ఎలాంటి సంబంధం లేని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ రఫేల్ ధరను బుధవారం లోక్‌సభలో బయటపెట్టిన విషయాన్ని వీడియో క్లిప్ ద్వారా రాహుల్ వివరించారు. 36 రఫేల్ విమానాలను రూ.58,000 కోట్లకు కొనుగోలు చేస్తున్నట్లు జైట్లీ చెప్పారని అంటే ఒక్కో విమానం ధర రూ.1600 కోట్లుగా ఆయనే వెల్లడించారని, ఇందులో కాంగ్రెస్ చెప్పిందేమీ లేదన్నారు.

### రఫేల్ కొనుగోలుపై అభ్యంతరం లేదు.. డీల్‌పైనే అనుమానాలు

దేశ రక్షణ అవసరాల రిత్యా రఫేల్ కొనుగోలులో తమకు ఎలాంటి అభ్యంతరాలు లేవన్న రాహుల్, కేవలం డీల్ పైనే అన్ని అనుమానాలన్నారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో ఒక్కో విమానం ధర రూ.526 కోట్లు కాగా ప్రస్తుతం రూ.1600 కోట్లకు ఎలా చేరిందని, నాటి 126 విమానాల సంఖ్య నేడు 36కు ఎందుకు తగ్గిందని ఆయన ప్రశ్నించారు. కొత్త డీల్‌పై నాటి రక్షణ మంత్రి అంగీకరించారా లేదా వ్యతిరేకించారా? ఈ కొత్త డీల్ నిర్ణయం ఎవరి నిర్ణయం.. ప్రధానిదా లేదా ఐఏఎఫ్‌దా? ఐఏఎఫ్‌ది కాకపోతే అభ్యంతరం తెలిపిందా లేదా? విమానాల తయారీలో సుదీర్ఘ అనుభవం ఉన్న హిందూస్థాన్ ఏరోనాటికల్స్ సంస్థను కాదని పది రోజుల అనిల్ అంబాని కంపెనీకి కాంట్రాక్టుకు కట్టబెట్టింది మోడీనా లేదా ఐఏఎఫ్? కాంట్రాక్టు మార్పిడి గురించి ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు ఫ్రాంకోయిస్ హోలెండే చెప్పిన మాటల్లో వాస్తవమెంత? ఈ ప్రశ్నలకు సమాధానాలు ఈ దేశ ప్రజలకు తెలియాలని రాహుల్ డిమాండ్ చేశారు. ప్రధాని మోడీ గత ఒప్పందాన్ని మార్చి కొత్త డీల్ కుదుర్చుకున్నారని తద్వారా ఈ కాంట్రాక్టులో హాల్‌ను పక్కకుపెట్టి ఒక్క విమానం కూడా తయారు చేయని తన మిత్రుడైన అనిల్ అంబానికి కట్టబెట్టి రూ.33 వేల కోట్లు దోచుకున్నారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ డిమాండ్ చేస్తున్నట్లు రఫేల్ డీల్‌పై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేస్తే మోడీ, అంబానీ పేర్లే బయటకు వస్తాయని రాహుల్ ఎద్దేవా చేశారు. ఈ నిజం ఎప్పటికైనా బయటకు వస్తుందన్నారు. రఫేల్ డీల్‌పై దర్యాప్తు తమ పరిధిలోకి రాదని మాత్రమే సుప్రీం కోర్టు చెప్పిందని, జేపీసీపై ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని రాహుల్ స్పష్టం చేశారు.

# శబరిమలలో మహిళల ప్రవేశం



(మొదటి పేజీతరువాయి) ద్వారాలను మూసి శుద్ధి చేశారు. అనంతరం మళ్లీ ఆలయాన్ని తెరిచి భక్తుల దర్శనానికి వీలు కల్పించారు.మహిళలు ఆలయాన్ని దర్శించుకున్న విషయం తెలియగానే శబరిమల ఆలయ నిర్వాహకులు అత్యవసర సమావేశం ఏర్పాటుచేశారు. ఆలయాన్ని శుద్ధి చేయాలని ప్రధాన అర్చకుడు ఆదేశించారు. దీంతో ద్వారాలను మూసివేసి సంప్రోక్షణ చేపట్టారు. తాజా ఘటనపై పండలం రాజకుటుంబీకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కోజికోడ్ జిల్లాకు చెందిన న్యాయవాది బిందు, సామాజిక కార్యకర్త కనకదుర్గ బుధవారం తెల్లవారుజామున 3.45 గంటల ప్రాంతంలో అయ్యప్ప ఆలయాన్ని దర్శించుకున్నారు. వీరిద్దరూ హడావుడిగా ఆలయంలోకి వెళ్తున్న వీడియో ఒకటి సోషల్‌మీడియాలో వైరల్ అయ్యింది. అనంతరం కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. కాగా.. వీరి ప్రవేశంపై బీజేపీ కార్యకర్తలు, అయ్యప్ప భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 2 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా నిరసన చేయనున్నట్లు ప్రకటించారు.

### ధ్రువీకరించిన సీఎం విజయన్..

మహిళలు అయ్యప్ప దర్శనం చేసుకున్నట్లు వస్తున్న వార్తలను కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ధ్రువీకరించారు. '50ఏళ్ల లోపు మహిళలు ఇద్దరు నేడు ఆలయాన్ని దర్శించుకున్నారనేది నిజం. అంతకు ముందు భద్రతా కారణాల వల్ల వారు ఆలయంలోకి వెళ్లలేకపోయారు. అయ్యప్ప దర్శనం చేసుకునేందుకు వచ్చే మహిళలకు మరింత భద్రత కల్పించాలని పోలీసులను ఆదేశించాం' అని పినరయి తెలిపారు.

### గురువారం రాష్ట్ర బంద్

అయ్యప్ప దేవాలయంలోకి ఇద్దరు మహిళలు ప్రవేశించినందుకు నిరసనగా గురువారం రాష్ట్రవ్యాప్తంగా బంద్ నిర్వహించాలని శబరిమల కర్మ సమితి పిలుపునిచ్చింది. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు బంద్ చేయాలని కోరింది.

## డివిజన్‌లో మంచినీటి లోప్రెషర్ సమస్యలు పరిష్కరించాలి



విజయక్రాంతి,ఉప్పల్: డివిజన్‌లో లో ప్రెషర్‌ను పరిష్కరించి అన్నికాలనీలకు మంచినీటి సరఫరా సక్రమంగా సరఫరా చేయాలని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి కోరారు. బుధవారం మల్లాపూర్ వార్డు కార్యాలయంలో హెచ్.ఎమ్.డబ్ల్యు.ఎస్.ఎస్.బి అధికారులు, డిజిఎమ్ కృష్ణ, ఎఇ.వేణుగోపాల్ తో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి హాజరై అధికారులకు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లాపూర్ రిజర్వాయర్ నుండి శివ హోటల్ వరకు, మల్లాపూర్ రిజర్వాయర్ నుండి ఐడిఏ వరకు నూతనంగా వేసిన వాటరు లైను జంక్షన్లు, మల్లాపూర్ డివిజన్‌లో ని పలు ప్రాంతాలలో లోప్రెషర్ మంచినీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. స్పందించిన డిజిఎమ్ త్వరలోనే అధికారులతో చర్చించి, పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు తగ్గించిన రిజర్వేషన్లు యథావిధిగా కొనసాగించాలని బీజేపీ ఓబీసీ మోర్చా డిమాండ్ చేసింది. ఈ మేరకు హైదరాబాద్ కలెక్టర్ రఘునందన్‌రావుకు ఎమ్మెల్యే రాజాసింగ్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కాటం నర్సింహా యాదవ్ తదితరులు వినతిపత్రం ఇచ్చారు.

## విద్యార్థులకు క్రమశిక్షణ ఎంతో అవసరం



- రిటైర్డ్ ఐపీఎస్ హెచ్ జె దొర

విజయక్రాంతి, సికింద్రాబాద్: విద్యార్థులు చదువుతోపాటు క్రమశిక్షణ పాటించాలని మాజీ రిటైర్డ్ పోలీస్ అధికారి హెచ్ జె దొర పేర్కొన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గం తార్నాక వైట్ హౌస్ లోని సాంఘీ విద్యానికేతన్ పాఠశాల నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హెచ్ జె దొర హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఒక చదువుకే పరిమితం కాకుండా ఆటలు, క్రీడలతో రాణించాలని అలానే సామాజిక సేవ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు విద్యార్థులు ముఖ్యంగా తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలని క్రమశిక్షణతో ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు రాజారావు, కార్యదర్శి కవిత గోయల్, ప్రిన్సిపాల్ అర్చన సెహగల్, అడ్మినిస్ట్రేటివ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఈసీ స్వతంత్ర సంస్థనా లేక టీఆర్ఎస్ అనుబంధ విభాగమా?

- నిజాముద్దీన్

విజయక్రాంతి, హైదరాబాద్: ఎన్నికల సంఘం స్వతంత్ర సంస్థనా లేక టీఆర్ఎస్ అనుబంధ విభాగమా అని టీపీసీసీ కార్యదర్శి నిజాముద్దీన్ ప్రశ్నించా రు. గాంధీభవన్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి డాక్టర్ రజత్‌కుమార్, ఎన్నికల కమిషనర్ వి.నాగిరెడ్డిలు రాజ్యాంగానికి విరుద్ధంగా, టీఆర్ఎస్ తొత్తుల్లా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. శాసనసభ ఎన్నికల సమయంలో ఓటర్ల లిస్టులో ఏ తప్పులైతే చేశారో అవే తప్పులతో పంచాయతీ ఎన్నికలకు వెళ్తున్నారన్నారు కేసీఆర్ జనవరిలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని కోరుకోగానే ఓటర్ల లిస్టులో తొలగింపులు, చేర్పులు, నూతన ఓటర్ల నమోదు లాంటివేవి పట్టించుకోకుండా షెడ్యూల్ ప్రకటించారన్నారు.

### అజారుద్దీన్ పార్టీ మారడం లేదు

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ అజారుద్దీన్ టీఆర్ఎస్‌లో చేరుతున్నట్టు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని టీపీసీసీ మైనారిటీ సెల్ ఛైర్మన్ షేక్ అబ్దుల్లా సోహేల్ తెలిపారు. రెండు సార్లు అధికారంలోకి వచ్చినప్పటికీ టీఆర్ఎస్‌లో నాయకుల కొరత ఉందన్నారు.

## తొలగించిన ఓట్లపై ఏం చర్యలు తీసుకుంటారు

(మొదటి పేజీతరువాయి) ఓట్ల విషయంలో ఏం చేయబోతున్నారో తెలియజేయాలని న్యాయమూర్తులు జస్టిస్ రామసుబ్రమణియన్, జస్టిస్ కేశవరావులతో కూడిన డివిజన్ బెంచ్ ఈసీకి నోటీసు ఇచ్చింది. చెప్పాపెట్టకుండా తొలగించేసిన ఓట్లను తిరిగి జాబితాలో ఉంచాలని ఓటర్లు కోరేందుకు ప్రత్యేక అవకాశం ఇవ్వాలని, ఇందుకు ప్రత్యేక దరఖాస్తు ఉండేలా ఈసీకి ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థిస్తూ హైదరాబాద్‌లోని గోషామహల్ నియోజకవర్గానికి చెందిన ప్రతీ అగర్వాల్ సహా 26 మంది దాఖలు చేసిన వ్యాజ్యాన్ని బుధవారం హైకోర్టు విచారించింది. ఎలాంటి నోటీసు ఇవ్వకుండా, అభ్యంతరాలు కూడా తెలుసుకోకుండా ఇటీవల జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఓటర్ల జాబితా నుంచి ఎంతో మంది పేర్లు తొలగించేశారని, ఈసీ తీసుకున్న నిర్ణయం వల్ల పిటిషనర్ల ఓట్లు కూడా లేకుండాపోయాయని వారి తరఫు లాయర్ వాదించారు. తమ ఓట్లు యథాతథంగా జాబితాలో ఉంచాలని కోరేందుకు ప్రత్యేక దరఖాస్తు విధానం ఉండేలా ఈసీకి ఆదేశాలివ్వాలని కోరారు. ఈసీకి నోటీసు ఇచ్చిన హైకోర్టు తదుపరి విచారణను 22కి వాయిదా వేసింది.

## ఖరీఫ్‌కు సాగునీరు, జనానికి తాగునీరు

(మొదటి పేజీతరువాయి) 66 గేట్ల బిగింపుతో పాటు 90 శాతం పనులు పూర్తవ్వడంపై అధికారులను అభినందించారు. మిగిలిన పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

### సుందిల్ల బ్యారేజీ పనులను పరిశీలించిన సీఎం

అనంతరం హెలిక్యాప్టర్ ద్వారా పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గం సిరిపురం గ్రామ శివారులో గోదావరి నదిపై నిర్మిస్తున్న సుందిల్ల బ్యారేజీ పనులను విహంగ వీక్షణం ద్వారా పరిశీలించారు. తరువాత హెలిప్యాడ్‌కు చేరుకోని అక్కడ నుంచి వాహనం ద్వారా నేరుగా సుందిల్ల బ్యారేజీ వ్యూ పాయింట్ వద్దకు వెళ్లి పనులను పరిశీలించారు. ప్రాజెక్టు పనులు ఏయే దశలో ఉన్నాయి, ఎప్పటిలోగా పూర్తవుతాయనే వివరాలపై ఆరా తీశారు. ప్రస్తుతం జరుగుతున్న పనుల వివరాలను, పనుల పురోగతిని అక్కడ ఏర్పాటు చేసిన చిత్రాలు, మ్యాప్‌ల ద్వారా చీఫ్ ఇంజనీర్ నల్ల వెంకటేశ్వర్లు, ఇతర ఇంజనీర్లు సీఎంకు సమగ్రంగా వివరించారు. సుందిల్ల బ్యారేజీ లో 74 గేట్ల బిగింపు పూర్తికావడం జరిగిందని, 17 కిలో మీటర్ల మేర ఫ్లడ్ బ్యాంక్ పనులు వేగంగా సాగుతున్నట్లు అధికారులు జనవరి చివరి నాటికి పూర్తవుతాయని అధికారులు తెలిపారు. సీఎం వెంట సీఎస్ ఎస్కే జోషి, సీఎం కార్యదర్శి స్మితా సబర్వాల్, డీజీపీ మహేందర్‌రెడ్డి, కాళేశ్వరం ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ నల్లా వేంకటేశ్వర్లు, భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లా కలెక్టర్లు వాసం వెంకటేశ్వర్లు, శ్రీదేవసేన, జెసి వనజాదేవి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మాజీ ఎంపి వివేక్, రామగుండం సిపి సత్యనారాయణ, పెద్దపల్లి డీసీపీ సదర్శన్ గౌడ్, నవయుగ కంపెనీ ఛైర్మన్ విశ్వేశ్వర్‌రావు, ప్రాజెక్టు మేనేజర్ ఈశ్వర్ తదితరులు ఉన్నారు.



### కేసీఆర్‌ను సన్మానించిన దేవస్థానం అర్చక స్వాములు..!

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా కన్నేపల్లి పంపుహౌస్ గ్రావిటీ కాలువ పనులను పరిశీలనకు వచ్చిన సీఎం కేసీఆర్‌ను కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం అర్చక స్వాములు సన్మానించారు. ఈ కార్యక్రమంలో అర్చక స్వాములు కృష్ణమూర్తి, లక్ష్మీనారాయణ శర్మ, ప్రశాంత్ శర్మ, రామకృష్ణ, వేద పండితులు భైకుంగా పాండా, ఆలయ ఈవో ఎడవెల్లి మారుతి, ఛైర్మన్ బొమ్మెర వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల నమోదు ఉధృతంగా చేపట్టాలి

(మొదటి పేజీతరువాయి) ఈవీఎంలు కాదు మహాకూటమి నేతల బుర్రలు దొబ్బాయని కేటీఆర్ విమర్శించారు. చంద్రబాబు అమరావతి నుంచి రోజూ మనల్ని తిడుతున్నారని చంద్రబాబు తిట్లే మనకు దీవెనలు అనుకుందామన్నారు.ఎన్నికల సందర్భంగా కేసీఆర్ ఇచ్చిన ప్రతి హామీ ని నేరవెర్చే దిశగా పనిచేస్తున్నారుగులాబీ కార్యకర్త కాలర్ ఎగరేసే విధంగా హామీలు అన్ని నెరవేరుతాయని స్పష్టం చేశారు.కష్టపడి పని చేసిన కార్యకర్తలకు నామినేటెడ్ పోస్టులలో తగు ప్రాధాన్యత ఉంటుందని బరోసానిచ్చారు.పదవుల కోసం నాయకుల చుట్టూ తిరగొద్దు అని ప్రజల చుట్టూ తిరగండని పిలుపునిచ్చారు.మొన్నటి ఎన్నికల్లో పార్టీ కి దూరమయిన వారిని తిరిగు మళ్ళీ దగ్గరికి తెచ్చుకుందాం అని పార్లమెంటు ఎన్నికల్లో కూడా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే పునరావృతం అయ్యేలా కార్యకర్తలు కృషి చేయాలి అని కోరారు.16 పార్లమెంటు సీట్లు గులాబీ పార్టీ కైవసం చేసుకుంటే రాష్ట్రం శాసించే స్థాయి చేరుకుంటుందన్నారు.కేసీఆర్ కు 16 ఎంపీ సీట్లు ఇస్తే కేంద్రం మెడలు వంచి రాష్ట్రానికి రావాల్సిన ప్రయోజనాలు సాధిస్తారని పేర్కొన్నారు.టీడీపీ కథ తెలంగాణలో ముగిసిందని... బీజేపీ వంద సీట్ల లో డిపాజిట్లు కోల్పోయిందని ఇక ఇటు కాంగ్రెస్ మళ్ళీ విశ్వాసం పొందే పరిస్థితి లేదని,నేడు తెలంగాణ ఏది ఆలోచిస్తే రేపు దేశం అది ఆలోచించే స్థితి వచ్చిందని రైతుబంధు పథకం ఇందుకు నిదర్శనం అన్నారు.

రైతు బంధు పథకాన్ని మూడు రాష్ట్రాలు అమలు చేయబోతున్నాయని...పీఎం నరేంద్ర మోడీ కూడా రైతు బంధు పథకాన్ని పేరు మార్చి అమలు చేస్తారని వార్తలు వస్తున్నాయని అన్నారు. కొత్త సంవత్సరం లో 16 ఎంపీ సీట్లు గెలవడం లక్ష్యంగా పెట్టుకోవాలి అని పిలుపునిచ్చారు. పార్టీ మరింత బలోపేతం కావడం మన ముందున్న లక్ష్యం అని తెలిపారు. ఇంత పెద్ద విజయం సాధించామని అహంకారం పనికిరాదని కుల,మతాలకు అతీతంగా ప్రజలు టీఆర్ఎస్ కు ఓట్లు వేశారన్నారు.ప్రజలు ఇచ్చిన బ్రహ్మాండమయిన తీర్పును వమ్ము చేయకుండా వ్యవహరించి ప్రజలకు మరింత చేరువకావలని కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు.

## పంచాయతీ ఎన్నికల్లో..అభ్యర్థుల కోసం కుస్తీలు

(మొదటి పేజీతరువాయి) గ్రామ పంచాయతీలకు ఎన్నికలు రావడంతో గ్రామాల్లో సందడి తగ్గలేదు. పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అయా పార్టీలకు చెందిన అభ్యర్థులు జంకుతున్నట్లు తెలిసింది. పంచాయతీ ఎన్నికలు పార్టీ రహితమైనప్పటికీ రాజకీయ పార్టీలే కీలక పాత్ర పోషిస్తాయి. దీంతో మంగళవారం రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రామ పంచాయతీలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసినప్పటి నుంచి గ్రామాల్లో వాతావరణం మరింత వేడెక్కింది. ఈనెల 30లోగా మూడు విడతల్లో ఎన్నికలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నది. ఈ నెల 7వ తేదీ నుంచి తొలి విడత ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానున్నది. దీంతో అభ్యర్థులను వీలైనంత త్వరగా ప్రకటించేందుకు అయా పార్టీలు అభ్యర్థులను దింపేందుకు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచు, వార్డు మెంబర్లుగా పోటీ చేసే అభ్యర్థుల ఖర్చుపై నిబంధనలు విధించింది. 5వేల జనాభా దాటిన గ్రామ పంచాయతీల్లో పోటీ చేసే అభ్యర్థులు రూ.2.50లక్షలు, వార్డు మెంబర్లు రూ.50వేలు మించి ఖర్చు చేయరాదని, 5వేలు కంటే తక్కువ జనాభా కల్గిన గ్రామ పంచాయతీల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ ఖర్చును రూ.1.50లక్షలు, వార్డు మెంబర్లు రూ.30వేలుగా నిర్ణయించింది. ఈ లెక్కలు తారుమారయ్యే పరిస్థితి నెలకొన్నది. ఎన్నికల సంఘం నిర్ధేశించిన ఖర్చు అయా అభ్యర్థులకు ఒక్క రోజు సరిపోదని విశ్లేషకులు చెబుతున్నారు. 5వేల జనాభా దాటిన పంచాయతీల్లో కనీసం రూ.50లక్షల నుంచి కోటీ రూపాయలు ఖర్చు కానున్నట్లు తెలుస్తుంది. అంతేకాకుండా మూడు విడతల్లో ఎన్నికలు జరుగుతున్నప్పటికీ అయా అభ్యర్థులు తొలి విడత నుంచి ఓటర్లను మెప్పించేందుకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. దీన్నిబట్టి భారీస్థాయిలో పోటీలో ఉన్న అభ్యర్థులు ఖర్చు చేయాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు ముందుకు రావడం లేదని సమాచారం. పైగా ఇంత భారీస్థాయిలో డబ్బులు ఖర్చు పెట్టి గెలిచినప్పటికీ ఆశించిన స్థాయిలో పంచాయతీలకు నిధులు వచ్చే అవకాశం లేదు. పైగా కేంద్ర ప్రభుత్వం నేరుగా పంచాయతీలకు నిధులను విడుదల చేస్తున్నది. కానీ ఐదేళ్లల్లో 5వేల జనాభా దాటిన పంచాయతీలకు ఏడాదికి రూ.5లక్షల నిధులు కూడారావు. దీంట్లో కేంద్ర ఆర్థిక సంఘం నిధులు మాత్రమే పంచాయతీలు నేరుగా ఖర్చు చేసుకునే వెసులుబాటు ఉంది. మిగతా నిధులు అయా శాఖల ద్వారా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాల్సి ఉంటుంది. దీంతో సర్పంచుగా పోటీ చేసేందుకు అభ్యర్థులు పెద్దగా ఆసక్తి చూపడం లేదని తెలిసింది.

## ఇంటికే ఇంధనం

(మొదటి పేజీతరువాయి) సమయం, డబ్బు రెండూ ఆదా అవుతుందని మరికొందరు చెబుతున్నారు. ఇక పట్టణ ప్రాంతంలో నివసిస్తూ వాహనాలకు ఇంటిదగ్గరే ఇంధనం పట్టించుకోవడం వారితో పాటు గ్రామీణ ప్రాంత వాసులు కూడా ఇలాంటి కొత్త తరహా ప్రణాళికతో లబ్ధి పొందుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పెట్రోలు బంకులు ఉండవు. వారు పెట్రోలు కోసం కొన్ని మైళ్ల దూరం వెళ్లాల్సి ఉంటుంది. అలాంటి వారికి ఇంధనం డోర్ డెలివరీతో చాలా లబ్ధి చేకూరుతుంది. ఎమర్జెన్సీ సమయంలో ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు. ఇంధనం డోర్ డెలివరీ కావాలంటే... మొబైలలోని యాప్ ద్వారా ఆర్డర్ ఇస్తే సరిపోతుంది. అయితే మీ ఆర్డర్ కనీసం 200 లీటర్లు అయి ఉండాలి. ఇక కస్టమర్లు 2,500 లీటర్లు అంతకు మించి ఇంధనం కావాలంటే పీఈఎస్ఓ లైసెన్సు కలిగి ఉండాలి. పెట్రోలు, డీజిల్ కంటే ప్రమాదం కనుక ముందుగా డీజిల్‌ను మాత్రమే సరఫరా చేస్తోంది ఈ మొబైల్ పెట్రోల్ ట్యాంక్. ఈ ట్యాంకులో అగ్నిప్రమాదం సంభవించకుండా తగు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. అగ్నిని ఆపేందుకు ఫైర్ ఎక్స్టింగ్విషర్లను ఏర్పాటు చేశారు.

## మోదీ 'అయోధ్య' ప్రకటనపై..
# 'పరివార్'లో ప్రకంపనలు

(మొదటి పేజీతరువాయి) అసహనం వ్యక్తం చేస్తున్నాయి. మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ మాత్రం మోదీ చేసిన ప్రకటనపై అసంతృప్తి కలిగినా.. ఆయన హయాంలోనే రామ మందిర నిర్మాణం జరుగుతుందని ప్రజలు ఆశిస్తున్నారని ప్రకటించింది.

నరేంద్రమోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత 'మన్ కీ బాత్' ద్వారా ప్రజలకు సందేశం ఇవ్వడమే తప్ప.. మీడియాకు ఇంటర్వ్యూలు ఇవ్వలేదు. తొలిసారిగా ప్రముఖ వార్త సంస్థ 'ఏఎన్ఐ'కి ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ ఇంటర్వ్యూ బీజేపీతో పాటు పరివార్ సంస్థల్లో కూడా చర్చకు దారి తీసింది. గత ఎన్నికల సమయంలో ప్రధానమంత్రి అభ్యర్థిగా ఎన్నికైన నరేంద్రమోదీ పట్ల సంఘ్ పరివార్ సంస్థలన్నీ ఏకాభిప్రాయంతో ఉన్నాయి. ఆయన ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపడితే.. అయోధ్యలో రామ మందర నిర్మాణం జరిగి తీరుతుందని భావించాయి. 2014 ఎన్నికల మేనిఫెస్టోలో మాత్రం రామాలయ నిర్మాణానికి సానుకూలమే కానీ రాజ్యాంగం పరిధిలోని అన్ని అంశాలను పరిశీలించడంతో పాటు అవకాశాలను అన్వేషిస్తామని పేర్కొంది. ఆయన ప్రధానిగా బాధ్యతలు చేపట్టి.. నాలుగున్నరేళ్లు గడిచినా.. ఈ అంశంలో పరివార్ సంస్థలు ఆశించినట్టుగా నిర్ణయం తీసుకోలేదు. దీంతో పరివార్ సంస్థలోని ముఖ్యమైన విశ్వహిందూ పరిషత్ మాత్రం రామమందిర నిర్మాణంపై తరచూ దూకుడు ప్రదర్శిస్తోంది. సభలు, సమావేశాలు నిర్వహిస్తూ బీజేపీపై ఒత్తిడి తెస్తోంది.

### మందిర నిర్మాణంపై ఒత్తిడి తెస్తోన్న ఆర్ఎస్ఎస్


ఆర్ఎస్ఎస్ కూడా అదే విధంగా సభలు నిర్వహిస్తోంది. ఆర్ఎస్ఎస్ ఎక్కడ సమావేశాలు నిర్వహించినా.. రామమందిర నిర్మాణం జరిపి తీరాల్సిందేనని సర్ సంఘ్‌ఛాలక్ మోహన్ భగవత్ ప్రకటన చేయడం పరిపాటిగా మారింది. మందిర నిర్మాణంపై చట్టం చేయాల్సిందేనని పలుమార్లు స్పష్టం చేశారు. గతేడాది డిసెంబర్‌లో రామమందిర నిర్మాణంపై సుప్రీంకోర్టు నుంచి సానుకూల తీర్పు వెలువడుతుందని పరివార్ సంస్థలు సహా హిందూ సంస్థలు కూడా భావించాయి. అయితే ఈ అంశంపై తీర్పు ఇవ్వడానికి అంతతొందరమే లేదని గత అక్టోబర్‌లో తేల్చిచెప్పిన సుప్రీంకోర్టు, మందిర అంశాన్ని జనవరిలో పరిశీలిస్తామని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. దీంతో రామ మందిర నిర్మాణపై 'ఆర్డినెన్స్' తేవాలని ఆర్ఎస్ఎస్ సహా పరివార్ సంస్థలు కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి కూడా తెచ్చాయి. ఉత్తర భారతంతో పాటు దక్షిణాది రాష్ట్రాల్లో కూడా సదస్సులు నిర్వహించనుంది. కాగా ఎన్నికలు సమీపిస్తున్నందున కచ్చితంగా మోడీ ప్రభుత్వం ఆర్డినెన్స్ తెస్తుందని ఆర్ఎస్ఎస్‌తో పాటు అనుబంధ సంఘాలతో పాటు బీజేపీలోని అతివాదులు కూడా భావించారు. అయితే వారి భావనకు విరుద్ధంగా రామ మందిర నిర్మాణంపై ప్రధాని నరేంద్రమోదీ ప్రకటన చేశారు. రామమందిర నిర్మాణంపై న్యాయ సంబంధమైన ప్రక్రియ పూర్తయిన తర్వాతే.. ఆర్డినెన్స్ తెస్తామని ప్రకటన చేశారు. ఈ ప్రకటన బీజేపీలో కొంత అలజడి కూడా రేపింది. ఉత్తర భారతంలో మోడీ హవా తగ్గుతోందని, అందుకు ఇటీవల మూడు రాష్ట్రాల్లో బీజేపీ ఓడిపోవడమే నిదర్శనమని ఒక నిర్ణయానికి కూడా వచ్చారు. అదే విధంగా జీఎస్టీ, నోట్లరద్దు నిర్ణయాల కారణంగా పార్టీకి నష్టం జరిగిందని కూడా భావిస్తున్నారు. మరో ఐదు నెలల్లో లోక్‌సభ ఎన్నికలు జరుగనున్న సమయంలో మందిర నిర్మాణంపై ఆర్డినెన్స్ తేవడం ద్వారా రాజకీయంగా కూడా లబ్ది పొందవచ్చని బీజేపీ భావించినా.. ప్రధాని మోదీ అందుకు విరుద్ధంగా ప్రకటన చేశారు. రామ మందిర నిర్మాణం అంశంపై మోదీ చేసిన వ్యాఖ్యలపై బీజేపీలోని అతివాద వర్గం అసంతృప్తిగా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థ విశ్వ హిందూ పరిషత్ తీవ్ర స్థాయిలో అసహనం వ్యక్తం చేసింది.

అయితే మందిర నిర్మాణంపై కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు మార్గాన్వేషణ చేస్తోంది. నరేంద్రమోదీ హయాంలోనే అయోధ్యలో రామమందిర నిర్మాణం జరుగుతుందని ప్రజలు ఆశిస్తున్నారని ఆర్ఎస్ఎస్ పేర్కొంది. ఈ మేరకు ఆర్ఎస్ఎస్ సహ కార్యవాహ దత్తాత్రేయ హోసబొలే ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలయ నిర్మాణంపై ప్రధాని మోదీ చేసిన ప్రకటన సానుకూల దశగా తాము భావిస్తున్నామని పేర్కొన్నారు. 1989లో బీజేపీ చేసిన తీర్మానానికి అనుకూలంగానే మోదీ ప్రకటన ఉందన్నారు.

### వేచి చూడడం సాధ్యం కాదుః వీహెచ్‌పీ

రామమందిర నిర్మాణంపై ప్రధాని మోదీ చేసిన ప్రకటనకు విశ్వహిందూ పరిషత్ ఘాటుగా స్పందించింది. ఇంకా వేచి చూడడం సాధ్యం కాదని, ఇప్పుడే ఆర్డినెన్స్ తేవాలని డిమాండ్ చేసింది. కుంభమేళా సందర్భంగా ఈ నెల 31న ప్రయాగలో జరిగే సాధువుల సమావేశంలో తీసుకున్న నిర్ణయాల ప్రకారం కార్యాచరణ ప్రకటిస్తామని స్పష్టం చేసింది. ఈ మేరకు ఆ సంస్థ కార్య నిర్వాహక అధ్యక్షుడు అలోక్‌కుమార్ మీడియాతో మాట్లాడారు. దశాబ్దాల తరబడిగా రామ జన్మభూమి అంశం తేలడం లేదన్నారు. అందుకే కేంద్ర ప్రభుత్వం చట్టం చేయాలని డిమాండ్ చేశారు. చట్టం చేయడానికి ఇదే సరైన సమయమని ఆయన అన్నారు. " రామాలయ నిర్మాణం కోసం ఇంకా హిందూ సమాజం ఎదురు చూడడం సా ధ్యం కాదు. చట్టం చేసి మందిర నిర్మాణం మార్గం సు గమం చేయడమే పరిష్కారం. " అని ఆయన స్పష్టం చే శారు. లేని పక్షంలో ఈ నెల 31న జరిగే సమావేశంలో కార్యాచరణ రూపొందించుకొని అందుకనుగుణంగా ముందుకు సాగుతామని అలోక్‌కుమార్ ప్రకటించారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి: ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



విజయక్రాంతి, అంబర్‌పేట్: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పకుండా పాటించాలని అంబర్‌పేట్ నియోజకవర్గం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కాంట్రాక్టర్‌లు, అధికారులను ఆదేశించారు. అంబర్‌పేట్ డివిజన్ సీపీఎల్ రోడ్డులో పనులను స్థానిక కార్పొరేటర్ పులిజగన్, బాగ్అంబర్‌పేట్ కార్పొరేటర్ పద్మావతిడి పి రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. అంబర్‌పేట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు ఆర్.కె.బాబు, లింగంగౌడ్, గండికోట జనార్ధన్, ఆర్. రాము, కత్తుల సుధర్శన్, శ్రీనివాస్, నర్సింగ్‌యాదవ్, బుచ్చిరెడ్డి, కృష్ణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలను వణికిస్తున్న చలిపులి..

**విజయక్రాంతి, ఖమ్మంటౌన్:** గతంలో ఎన్నడూ లేని విధంగా చలి తీవ్రత తీవ్రంగా పెరగడంతో జిల్లాలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత మూడు రోజుల నుంచి చలి విపరీతంగా పెరగడంతో ప్రజలు తమతమ ఇండ్లనుంచి బయటికి రావాలంటేనే భయపడుతున్నారు. సోమ, మంగళవారాల్లో వివిధ ప్రాంతాల్లో గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు పూర్తిగా పడిపోయాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జిల్లా కేంద్రం ఖమ్మంలో 15 డిగ్రీల సెంటీగ్రేడ్ కాగా, ఇల్లందు, మణుగూరులో 12 డిగ్రీల సెంటీగ్రేడ్‌గా నమోదైంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చలి తీవ్రత గతంలోకంటే అధికంగా పెరగడంతో ప్రజలు ఉదయం 11 గంటల దాకా బయటకు కూడా రావడం లేదు. సాయంత్రం 4 గంటల నుంచే చలిపులి తీవ్ర ప్రభావం చూపుతుండటంతో రాత్రి పూట కూడ చలి మరింత పెరుగుతోంది. ఇదే విధంగా చలి తీవ్రత పెరిగితే ప్రజలు నానా అగచాట్లు పడక తప్పదు.



## పంచాయతీ ఎన్నికల నిర్వహణకు.. పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ డి.అమయ్ కుమార్

**విజయక్రాంతి, సూర్యాపేట:** జిల్లాలో 475 గ్రామ పంచాయతీలు, 4.322 వార్డులకు త్వరలో నిర్వహించనున్న ఎన్నికలను సజావుగా నిర్వహించుటకు పకడ్బంది ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డి. అమయ్ కుమార్ అన్నారు. కలెక్టర్ చాంబర్‌లో నోడల్ అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో నిర్వహించే గ్రామ పంచాయతీ ఎన్నికలను అధికారులు ప్రణాళికా బద్ధంగా నిర్వహించాలని కోరారు. హెల్ప్‌లైన్‌లో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు సేకరించి వాటిని తహశీల్దార్లకు పంపించి అభ్యంతరాలను పరిష్కరించాలని అన్నారు. చిన్న, పెద్ద గ్రామ పంచాయతీలను గుర్తించి వాటికి అవసరమైన ఎన్నికల సామాగ్రిని వెంటనే పంపిణి చేయాలన్నారు. ఓటర్లకు రాజకీయ పార్టీల వారికి ఎలాంటి సందేహాలు, సమస్యలు ఉంటే కలెక్టర్ కార్యాలయంలోని హెల్ప్‌లైన్ నెం: 9494181920కు ఫిర్యాదులు చేసి పరిష్కరించుకోవాలని కోరారు. ఇందులో భాగంగా పదిమంది అధికారులను నియమించారు, వీరిలో మోడల్ కోడ్ కండక్ట్ ఫర్ లా అండ్ ఆర్డర్, వి.యం అండ్ సెక్యూరిటి ప్లాన్ నోడల్ అధికారిగా జిల్లా రెవెన్యూ అధికారి పి. చంద్రయ్య, బాలెట్ బాక్సుల నిర్వాహణ నోడల్ అధికారిగా మైనార్టీ అధికారి యల్. శ్రీనివాస్‌ను హెల్ప్‌లైన్ ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారాల నోడల్ అధికారిగా జియ పరిశ్రమల శాక అధికారి వి.బాబురావును, ఎన్నికల సిబ్బందికి శిక్షణ నోడల్ అధికారిగా, పశు సంవర్ధక శాఖ డి.జే. వేణు మనోహర్‌ను, ఎన్నికల సామాగ్రి నిర్వాహణ నోడల్ అధికారిగా సిపిఓ టి. అశోక్‌ను, బ్యాలెట్ పేపర్ల ప్రింటింగ్ మరియు ఖర్చుల నోడల్ అధికారిగా జిల్లా ఆడిట్ అధికారి ఏ. వెంకటేశ్వరరావును, ఎన్నికల పరిశీలకుల నోడల్ అధికారులుగా డి.యం. మరియు డి.ఎస్.ఓ సివిల్ సప్లై అధికారులు, రాంపతి మరియు ఉషారాణిలను, ట్రాన్స్‌పోర్టు ఏర్పాట్లును భాస్కర్‌రెడ్డిని మీడియా కమ్యునికేషన్ నోడల్ అధికారిగా సమాచార శాఖ సహాయ సంచాలకులు జి. ప్రసాద్ రావును, మ్యాన్‌పవర్ మేనేజ్మెంట్ నోడల్ అధికారిగా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి జె. క్రిష్ణయ్యను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

## మెజార్టీ పంచాయతీలు గెలిపించుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

**విజయక్రాంతి, ఇల్లందు:** స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ పంచాయతీలు గెలిపించుకోవాలని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే, న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు గుమ్మడి నర్సయ్య పేర్కొన్నారు. బుధవారం టేకులపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలన్నీ అవినీతి, డబ్బు మయంగా మారాయని, ప్రలోభాలకు గురిచేస్తూ అక్రమ మార్గాల్లో గెలుపొందుతున్నారని అన్నారు. తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మద్యం, ధనం ఏరులై పారిందని ఆయన పేర్కొన్నారు. తాము ఓడినా, గెలిచినా నిత్యం ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యల సాధనలో పోరాటాలు సాగిస్తామని ఆయన అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో అలుపులేని ఉద్యమాలు నడిపి, ప్రాణ త్యాగాలు చేసి పోడు భూములు దక్కించుకుని, పేదలకు పంచి పెట్టిన చరిత్ర న్యూడెమెక్రసీ పార్టీదని ఆయన అన్నారు. ప్రజా పోరాటాలే ఊపిరిగా తమ పంథా కొనసాగుందని ఆయన చెప్పారు. పంచాయితీ ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులు పట్టుదలతో, సైనికుల్లా పనిచేసి అత్యధిక సంఖ్యలో సీట్లు గెలుపొందాలని గుమ్మడి కోరారు. ఈ సమావేశంలో నాయకులు గణితి కోటేశ్వరరావు, వెంకట్రాం, పంతులు, కల్తి వెంకటేశ్వర్లు, లాలక్క, మౌలాలి, బంగారక్క, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి జిల్లా చెస్ పోటీలు ప్రారంభం

**విజయక్రాంతి, పెద్దపల్లి:** ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ –17 బాలబాలికల చెస్ పోటీలు సుల్తానాబాద్‌లోని హైస్కూల్ ఆవరణలో బుధవారం ప్రారంభమయ్యాయి. పెద్దపల్లి, కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల నుంచి విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. చాలాకాలం క్రితమే జిల్లా స్థాయిలో ఎస్‌జీఎఫ్ చెస్ పోటీలు జరిగిన చాలాజాప్యంగా ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలను నిర్వహించారు. హడావుడిగా సుల్తానాబాద్‌లో ఉమ్మడి జిల్లా పోటీలను నిర్వహించడం వల్ల చాలా మంది క్రీడాకారులు హాజరుకాలేకపోయారు. జాతీయ స్థాయిలో నిర్వహణ తేదీలు వచ్చినప్పటికీ ఉమ్మడి, రాష్ట్రస్థాయిలో తేదీలు హడావుడిగా చేయడం జరిగింది.

## రాజన్న ఆలయంలో అంతర్గత బదిలీలు..

**విజయక్రాంతి, వేములవాడ:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో అంతర్గత బదిలీలు జరిగాయి. ఆయా విభాగాల్లో పర్యవేక్షకులుగా పని చేస్తున్న వారికి బుధవారం ఆలయ ఈవో దూస రాజేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. హరిహరనాథ్ పరిపాలనా విభాగం నుంచి విచారణ కార్యాలయం మరియు లోకేష్, కే.రాజేశం ప్రధాన ఆలయం నుంచి అనుబంధ దేవాలయాలకు, నవీన్‌కుమార్ గ్యాస్ విభాగం ఇంచార్జ్ నుంచి అకౌంట్స్, స్టేషనరీకు, అల్లి శంకర్ అకౌంట్స్, దత్తత దేవాలయాల నుంచి ప్రధాన దేవాలయం, గోలి శ్రీనివాస్ ప్రధాన దేవాయలం నుంచి పరిపాలన, లీగల్‌కు, శ్రీ రాములు ప్రధాన దేవాలయం నుండి ప్రసాదముల తయారీకి, లక్ష్మణ్‌రావుకు కరీంనగర్ కళ్యాణ మండపం నుండి ఆడిట్, గోశాలకు, జయకుమారికి అనుబంధ ఆలయాల నుంచి దత్తత దేవాలయాలు, వేద, సంస్కృత పాఠశాలలకు, నర్సయ్యను ప్రసాదం తయారి నుంచి సానిటేషన్ హౌస్ కీపింగ్‌కు, గౌరి శంకర్ ఆడిట్, గ్యాస్ నుంచి క్యాంటిన్, గ్యాస్‌కు, శ్రీనివాస్ గోదాం, గోశాల నుండి గోదాంకు, నటరాజ్ నిత్యాన్నదానం, స్టేషనరీ, విఐపీల నుంచి నిత్యాన్నదానం, వీఐపీలకు, తిరుపతిరావు విచారణ కార్యాలయం నుండి ప్రధాన ఆలయంలకు బదిలీ చేసినట్లు పేర్కొన్నారు. వెంటనే వారి స్థానాల్లో జాయిన్ కావాలనీ ఆదేశాలు జారీ చేశారు.



## ఆధునిక యంత్రాలతో.. మట్టి వాటర్ బాటిల్స్ తయారీ శిక్షణ

- నేడు ప్రారంభమై మూడు రోజులపాటు కొనసాగనున్న శిక్షణ

**విజయక్రాంతి, జగిత్యాల:** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చే ఉద్దేశ్యంతో నానాటికీ అంతరించిపోతున్న కులవృత్తులను ప్రోత్సహించే తలంపుతో తెలంగాణ ప్రభుత్వం ఎంబిసీ కార్పొరేషన్ ద్వారా చేపట్టిన "మట్టి వాటర్ బాటిల్స్ తయారీ శిక్షణ" కార్యక్రమం బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్థానిక కోదండ రామాలయ ఆవరణలో ప్రారంభం అయ్యింది. కాగా ఈ కార్యక్రమానికి జగిత్యాల జిల్లా బి.సి సంక్షేమ శాఖ అధికారి రాజలింగంతో పాటు, శాలివాహన కుమ్మరి సంఘ రాష్ట్ర కార్యదర్శి రాజమల్లు హాజరై శిక్షణను ప్రారంభించారు. తెలంగాణ ప్రభుత్వం వెనుకబడిన కులాల సంక్షేమ ప్రోత్సాహానికి అనేక కార్యక్రమాలు రూపొందించడంతో పాటు వారి అభివృద్ధికి రూ.1000కోట్ల నిధులు కేటాయించిందని అన్నారు. ఈ శిక్షణకై ప్రతి జిల్లా నుంచి 5 గురిని ఎంపిక చేసి శిక్షణ ఇచ్చామని, వీరి ద్వారా ప్రతి జిల్లాలో సుమారు 30మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు వారు పేర్కొన్నారు. శిక్షణ మూడు రోజుల పాటు కొనసాగుతుందనీ, చివరి రోజు కలెక్టర్ చేతుల మీదుగా సర్టిఫికెట్ల ప్రదానం జరుగుతుందని బిసి సంక్షేమశాఖ జిల్లా అధికారి రాజలింగం తెలిపారు. బిసి సంక్షేమశాఖ అధికారులు మోహన్‌రెడ్డి, అఫ్జల్, కార్యాలయ సిబ్బందితోపాటు శాలివాహన కుమ్మరి సంక్షేమ సంఘ కుల బాంధవులు, శిక్షకులు, శిక్షణార్థులు పాల్గొన్నారు.

# ముగిసిన కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్ట్ బాట

- జగిత్యాల జిల్లాలో రాజేశ్వర్‌రావు పేట, రాంపూర్ పంప్‌హౌస్‌ల పరిశీలన
- పనుల పురోభివృద్ధిపై అసంతృప్తి
- త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించిన ముఖ్యమంత్రి కేసీఆర్



**విజయక్రాంతి, జగిత్యాల:** బీడు భూములన్నీ సస్యశ్యామలం చేయాలనే తలంపుతో, ప్రతి ఎకరాకు నీరందించాలనే సంకల్పం ఎస్సారెస్పీ పునరుజ్జీవనమే లక్ష్యంగా తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ పనుల స్థితిగతులు తెలుసుకునేందుకు మంగళ, బుధవారాల్లో రెండు రోజులపాటు కాళేశ్వరం బాట పేరుతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటిస్తున్న విషయం విదితమే. దినిలో భాగంగానే రెండవ రోజు పర్యటనలో అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పరిశీలించిన సీఎం కేసీఆర్ సాయంత్రం 4:04 నిమిషాలకు మెట్‌పల్లి డివిజన్ ఇబ్రహీంపట్నం మండలం రాజేశ్వర్‌రావు పేట లిఫ్ట్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులతో పాటు జడ్పీ ఛైర్‌పర్సన్ తుల ఉమ, కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు, జిల్లా కలెక్టర్ డా॥శరత్‌తో పాటు పలువురు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి లిఫ్ట్ పంప్‌హౌస్ పనులను పరిశీలించారు. అనంతరం అధికారులతో సీఎం సమీక్షా సమావేశం నిర్వహించి, పనుల పురోగాభివృద్ధిపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

### త్వరితగతిన పూర్తిచేసి నీరందించాలి..

పనులు త్వరితగతిన పూర్తిచేసి నీరందించేలా అధికారులు ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. సమారు 50నిమిషాలకు పైగా రాజేశ్వర్‌రావు పేట లిఫ్ట్ వద్ద పరిశీలించిన కేసీఆర్ అనంతరం 5:01నిమిషాలకు అక్కడి నుంచి తిరుగు ప్రయాణమై మార్గ మధ్యంలో ఏరియల్ సర్వే ద్వారా మల్యాల మండలం రాంపూర్ పంప్‌హౌజ్ పనులను పరిశీలించారు. సీఎం వెంట ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎస్.కె జోషి, ముఖ్యమంత్రి కార్యదర్శి స్మితా సబర్వాల్, డీజీపీ మహేందర్‌రెడ్డి, ప్రభుత్వ ముఖ్య సలహాదారు గడ్డం వివేకానంద జడ్పీ ఛైర్‌పర్సన్ తులఉమ, కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు, జగిత్యాల ఎమ్మెల్యే డా॥ సంజయ్, చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో పాటు జిల్లా కలెక్టర్ డా॥ శరత్, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు ఉన్నారు.




## కాళేశ్వరం నిర్వాసిత గ్రామాలను.. దత్తత తీసుకోవాలి!

- నిరుద్యోగ యువతకు ఉపాధికల్పన, సింగరేణి భూ నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించాలి..!
- సీఎం కేసీఆర్‌ను కలిసి వినతి పత్రాలను సమర్పించిన మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

**విజయక్రాంతి, మంథని:** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం కోసం తమ భూములు త్యాగం చేసిన కాళేశ్వరం నిర్వాసిత గ్రామాలను దత్తతకు తీసుకొని మౌళిక సదుపాయలు కల్పించాలని సీఎం కేసీఆర్‌ను కోరినట్లు మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. బుధవారం పెద్దపల్లి జిల్లా మంథని నియోజకరవర్గంలోని సుందిల్ల బ్యారేజీ పనుల సందర్శన కోసం వచ్చిన సీఎం కేసీఆర్‌కు మంథని నియోజకవర్గ పలు సమస్యలపై వినతి పత్రాలను సమర్పించిన అనంతరం శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడారు. సింగరేణి బొగ్గు గనుల క్రింద ఇండ్లను కోల్పోయిన భూనిర్వాసిత గ్రామాలైన పెద్దంపేట, మంగళ్‌పల్లి, సింగరెడ్డిపల్లె, రచ్చపల్లి, అడ్యాల, అక్కెపల్లి, లద్నాపూర్, బుధవారం పేట, రామయ్యపల్లి నిర్వాసితులకు ఇంకా ఆర్అండ్ ఆర్ ప్యాకేజీ పెండింగ్‌లో ఉందనీ, 2016లో తెలంగాణ రాష్ట్రం తీసుకువచ్చిన కొత్త చట్టం ప్రకారమైనా ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించాలని, ఇందుకు గానూ 2018ని బేస్ ఈయర్‌గా చేసుకోవాలని సీఎంను కోరినట్లు తెలిపారు. పెద్ద ఎత్తున ప్రభుత్వ పరిశ్రమలు ఉన్న జిల్లా పెద్దపల్లి జిల్లా అని, ఇక్కడి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడం కోసం, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడం కోసం ఎఫ్‌సిఐ, ఎన్‌టీపీసీ, సింగరేణికి అవసరమ్యే ముడి సరుకులకు సంబంధించిన అనుబంధ పరిశ్రమలను ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్‌ను కోరినట్లు శ్రీధర్‌బాబు తెలిపారు. సిరిపురంలో నిర్మిస్తున్న సుందిల్ల బ్యారేజీ పేరును ప్రజల విన్నపం మేరకు లక్ష్మీనృసింహ సిరిపురం బ్యారేజీగా మార్చాలని సీఎంను కోరినట్లు తెలిపారు. తమ విన్నపాలకు సీఎం సానుకూలంగా స్పందించినట్లు మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు ఈ సందర్భంగా తెలిపారు. సమావేశంలో భూ నిర్వాసితుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీరాంభట్ల శ్రీనివాస్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్, మంథని జడ్పీటీసీ మూల సరోజన, ఉప్పట్ల ఎంపిటీసీ శ్రీరాంభట్ల సంతోషిణీ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలోని అన్ని సర్పంచ్ స్థానాలకు సీపీఎం పోటీచేస్తుంది

- సీపీఎం జిల్లా కార్యదర్శి ములకలపల్లి రాములు

**విజయక్రాంతి, తుంగతుర్తి:** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో జిల్లాలోని అన్ని స్థానాలకు సీపీఎం పోటీచేస్తుదని సీపీఎం జిల్లా కార్యదర్శి ములకలపల్లి రాములు అన్నారు. బుధవారం స్థానిక విఎన్ భవనంలో జరిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్థానిక సమస్యలపై నిరంతరం ప్రజలకోసం పోరాడే పార్టీ సీపీఎంను ప్రజలు ఆదరించాలని కోరారు. మద్యం డబ్బుకు ఆశపడి ఆసమర్థులను ఎన్నుకుంటే గ్రామ అభివృద్ధి కుంటుపడుతుందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో స్థానికంగా ప్రజలకోసం, సంక్షేమ పథకాల అమలులో అర్హతకల్గిన వ్యక్తులకు అవకాశం కల్పించాలన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలుకల్పించాలని, పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని పోరాడే సిపిఎంకు ప్రజలు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కోలిశెట్టి యాదగిరిరావు , బుర్ర శ్రీనువాస్ , కందల శంకర్‌రెడ్డి, ఓరిగంటి అంతయ్య, గడ్డం ఎల్లయ్య, బోనాల వెంకన్న, వజ్జె వెంకన్న , నాగ్గయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు కనీస వేతనాలు అమలు చేయాలి

**విజయక్రాంతి, తుంగతుర్తి:** జర్నలిస్టులకు కనీస వేతనాలు అమలు చేయాలని జాతీయ కార్యవర్గ సభ్యులు కల్లూరి సత్యనారయాణ డిమాడ్ చేశారు. బుధవారం మోత్కుర్ మండల కేంద్రంలో స్థానిక శాఖకు విచ్చేసిన సందర్భంగా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జర్నలిస్టులకు హెల్త్ కార్డులను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి జర్నలిస్టులకు డబుల్ బెడ్‌రూం ఇడ్లను కేటాయించాలని అన్నారు. జర్నలిస్టుల పిల్లలకు కేజి టు పిజి వరకు ఉచిత విద్య అందించాలన్నారు. జర్నలిస్టుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తేవాలన్నారు. జర్నలిస్టుల సమస్యలపై యూనియన్ నిరంతరం పోరాటం చేస్తూదని అన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే మండల శాఖ గౌరవ అధ్యక్షులు కె నర్సరెడ్డి, అధ్యక్షులు ఎస్.ఎన్ చారి, అక్రిడేశన్ కమిటీ మెంబర్ జహంగీర్, సభ్యులు నర్సిరెడ్డి, అనిల్, షాకిర్ తదితరులు ఉన్నారు.

## అపరిశుభ్రంగా ఉంటే కఠిన చర్యలు తప్పవు

- ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

**విజయక్రాంతి, నల్లగొండ:** నల్లగొండ పట్టణంలో ఉన్న కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లు తమ పద్ధతి మార్చుకోవాలని ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించి మర్యాద పూర్వకంగా ప్రవర్తించాలని నల్లగొండ శాసనసభ్యుడు కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీచేసి ప్రతి వార్డుల్లో ఉన్న రోగులకు అందుతున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న డాక్టర్లను ఆస్పత్రికి వచ్చే రోగులకు సరైన వైద్యం అందించాలన్నారు.

ఆసుపత్రి సిబ్బంది రోగుల పట్ల అమర్యాదగా ప్రవర్తిస్తున్నారనీ, రోగులకు అందాల్సిన భోజనం సరిగా లేదని ఫిర్యాదు చేయడంతో అక్కడే ఉన్న డాక్టర్స్‌పై ఎమ్మెల్యే మండిపడ్డారు. అనంతరం వాటర్‌ట్యాంక్, డంప్ యార్డ్‌ను పరిశీలించి వీలైనంత త్వరగా ఈ డంప్ యార్డును వేరే చోటికి తరలించాలని ట్యాంకును బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రపరిచి రోగులకు కృష్ణా నీటిని అందించాలని, రోగులకు నాణ్యమైన వైద్యం అందించి వారిపట్ల సిబ్బంది మర్యాదగా మాట్లాడటం అలవర్చుకోవాలని లేని పక్షంలో అస్పత్రి సిబ్బందిపై, డాక్టర్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వైద్యానికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ అధిక నిధులు కేటాయిస్తూ ప్రజలకు ప్రభుత్వ అస్పత్రిపై నమ్మకం కలిగే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంటే డాక్టర్లు దానిని తుంగలో తొక్కే వ్యవహారం చేస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదని హాస్పిటల్ సూపరింటెండెంట్‌ను మందలించారు. ప్రభుత్వ అస్పత్రిలో ఎలాంటి చెత్తా చెదారం లేకుండా చూసేందుకు మున్సిపల్ సిబ్బందిని ప్రభుత్వ ఆస్పత్రిలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండ్ నర్సింగరావు, మున్సిపల్ కమిషనర్ దేవ్‌సింగ్, డాక్టర్ మాతృనాయక్, టీఆర్ఎస్ నాయకులు అబ్బగోని రమేష్, బకరం వెంకన్న, మందడి సైదిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


## సీపీఐ కార్యాలయంలో ఏబీ బర్ధన్ 3వ వర్ధంతి..

**విజయక్రాంతి, దేవరకొండ:** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మాజీ జాతీయ కార్యదర్శి ఏబిబర్ధన్ 3వవర్ధంతిని దేవరకొండ కమ్యూనిస్టు కార్యాలయంలో బుధవారం నిర్వహంచారు. ఈసందర్భంగా సిపిఐపార్టి జిల్లాకార్యదర్శి పల్లా నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ విద్యార్థి సంఘంలో చేరి స్వాతంత్ర్య ఉద్యమంలో చేరి కీలకపాత్ర వహించారు. కార్మిక, కర్షక, వర్గాలకోసం ట్రేడ్ యూనియన్ నాయకునిగా ఉద్యమాలు నిర్వహించి విప్లవాత్మక మార్పుతీసుకు వచ్చారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు, సిపిఐ పట్టణ కార్యదర్శి పగిళ్లబుచ్చయ్య, తూటుపల్లి నగేష్, నీలావెంకటయ్య, ఎండి మొహినొద్దీన్, జూలూరి జ్యోతి బసు,జాజాలశ్రీనివాస్, హరికృష్ణ, శంకర్, నర్సింహ్మారెడ్డి, బక్కయ్య, విజయ తదితరులు పాల్గొన్నారు.

## కాలుష్యం తాండవిస్తున్నా.. కానరాని చట్టాలు..

- అనుమతులు లేకుండా వెలుస్తున్న ఇటుక బట్టీలు..
- మామూళ్ల మత్తులో అధికారులు..

**విజయక్రాంతి, పెద్దపల్లి:** కాలుష్య నియంత్రణ, గ్రామ పంచాతీల అనుమతులు లేకుండా పెద్దపల్లి నియోజకవర్గంలో ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నపటికీ పట్టించుకునేవారు కరువయ్యారు. పెద్దపల్లి మండలంలోని రంగాపూర్, రాఘవపూర్ గ్రామాల శివారులో కొత్తగా మరో మూడు ఇటుకబట్టీలు అవిర్భవించాయి. గ్రామపంచాయితీల పాలకవర్గాలు లేకున్నప్పటికి, అధికారులు ఇచ్చే అనుమతులు లేనప్పటికి బట్టీలను ప్రారంభించడం విషేశం. ఇప్పటికే పెద్దపల్లి నియోజకవర్గంలో నిర్వహిస్తున్న బట్టీల వల్ల కాలుష్యం విస్తరించి పోయింది. ఇరిగేషన్ శాఖ అధికారులు నామమాత్రపు రాయల్టీలు కట్టించుకుని పెద్దెత్తున మట్టిని తరలించుకు పోవడానికి ఇటుక బట్టీల యజమానులకుఅవకాశమిచ్చారని ఆరోపణలు ఉన్నాయి. పెద్దపల్లి మండల పరిదిలో రాఘవపూర్, రంగాపూర్, గౌరెడ్డిపేట, హనుమంతునిపేట, సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి, నీరుకుళ్ల, కదాంబాపూర్, సుద్దాల, కనుకుల, రేగడిమద్దికుంట, భూపతిపూర్‌లతోపాటు ఓదెల, కాల్వ శ్రీరాంపూర్ మండలాల్లో దాదాపు 70ఇటుక బట్టీలు ఉన్నాయి. ఇందులో ఎక్కువ శాతం మట్టిని అక్రమంగా నిల్వ చేసుకున్నారు. ఇటుక బట్టీల య్యజమానులు మాఫియాగా మారి రూ.కోట్ల విలువచేసే మట్టిని కొల్లగొట్టారు. కాలుష్య నియంత్రణ బోర్డునుండి ఎలాంటి అనుమతులు కూడా పొందకుండా బట్టీలను నడిపిస్తున్నారు. మరోవైపు ఇటుక బట్టీల్లో పనిచేసే కార్మికులు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఒరిస్సా, చత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర ప్రాంతాలనుండి వలస వచ్చిన కార్మికులు వెట్టిచాకిరిలో మగ్గుతూ జీవితాలను బుగ్గిపాలు చేసుకుంటున్నారు. కార్మికుల కోసం బట్టీల నిర్వాహకులు బ్రోకర్లను ఆశ్రయిస్తారు. వారు అడ్వాన్సులు ఇచ్చి కార్మికులను బట్టీల్లో నియమిస్తారు. కనీస వేతనాలు, కనీస సదుపాయాలు కూడా వీరికి అందటం లేదు. చాలీచాలని డబ్బులతో రోజూ నూకల బియ్యం వండుకు తినడం జరుగుతోంది. వీరి దయనీయ పరిస్థితికి నిదర్శనం. పిట్టగూడుల్ల నివాసాలుంటాయి. తాగేందుకు సరియైన నీరుండదు. స్నానాలు చేసేందుకు కూడా నీరు దొరకవు. మానవుల మనుగడకు ఇటుక బట్టీలు పెనుముప్పుగా మారాయి. ఈ విషయమై ప్రభుత్వానికి ఎన్ని ఫిర్యాదులు చేసిన పట్టించు కోవడంలేదని పలువురు మానవ హక్కుల కమీషన్‌ను ఆశ్రయించాను. అయినా మళ్లీ బట్టీలను ఏర్పాటు చేసారు.



## అధికారులు సమన్వయంతో పని చేయాలి

- కలెక్టర్ అనితా రామచంద్రన్

**విజయక్రాంతి, యాదాద్రి:** గ్రామ పంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ అనితా రామచంద్రన్ కోరారు. బుధవారం జిల్లా కార్యాలయంలో మండల అభివృద్ధి అధికారులు, నోడల్ అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లడుతూ.. అధికారులకు ఎన్నికల మార్గదర్శకాలపై వివరించారు.. ఓటర్ల బాబితాలలో మార్పు చేర్పులు తొలగింపులు సరి చూసుకోవాలని తెలిపారు.. ఎన్నికల దృష్ట్యా పోలింగ్ కేంద్రాలను పరిశీలించుకుని అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలని మండల అభివృద్ధి అధికారులను ఆమె కోరారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పంచాయతీ రాజ్ చట్టంలోని చిన్న పొరపాట్లకు గాని ఫిర్యాదులకు గాని ఆస్కారం లేకుండా ఎన్నికలు నిబంధనల మేరకు కట్టుదిట్టంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓలు, జిల్లా కో ఆర్డినేటింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు..



## జిల్లా సాధనకు.. సకల జనులు సంఘటితం కావాలి

**విజయక్రాంతి, మిర్యాలగూడ:** జిల్లా సాధనకు సకల జనులు సంఘటితం కావాలని జిల్లా సాధన సమితి సభ్యులు ఎంఎ.సాజిద్‌ఖాన్, వైద్యులు జాడి రాజు పిలుపునిచ్చారు. మిర్యాలగూడను జిల్లాగా గుర్తించాలని చేపడుతున్న రిలే దీక్షలు బుధవారం 12వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలకు భవాని బిల్డింగ్ తాపీ, వడ్డెర వర్కర్స్ యూనియన్ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలను గౌరవించాల్సిన బాధ్యత పాలకులదేనన్నారు. మిర్యాలగూడ జిల్లా ఏర్పాటుకు శాస్త్రీయంగా అన్ని అర్హతలున్నప్పటికీ ప్రభుత్వం ఎందుకు గుర్తించడం లేదని ప్రశ్నించారు. పరిపాలన సౌలభ్యం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ మరో రెండు జిల్లాల ఏర్పాటుకు ముమ్మర చర్యలు చేపట్టారని, అందులో మిర్యాలగూడను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నల్లగుంట్ల సోమయ్య, ప్రసాద్, శ్రీను, సుధాకర్, వెంకట్, సైదులు, ఎల్లయ్య పాల్గొన్నారు.



## ఘనంగా రఘువీర్‌రెడ్డి జన్మదిన వేడుకలు


**విజయక్రాంతి, మిర్యాలగూడ:** కాంగ్రెస్ నాయకులు, మాజీ సీఎల్పీ నేత జానారెడ్డి తనయుడు రఘువీర్‌రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం మండలంలోని బధిరుల ఆశ్రమ పాఠశాల పిల్లల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు ఎంఏ.సలీం మాట్లాడుతూ.. పార్టీకి మూలస్తంభాలు కార్యకర్తలేనన్నారు. ఓటమికి చింతించకుండా పార్టీ పూర్వ వైభవానికి ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలన్నారు. రఘువీర్‌రెడ్డి భవిష్యత్తులో మరిన్ని పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు ఎంఏ.ఆరీఫ్, చంద్రశేఖర్, కుతుబుద్దీన్, హఫీజ్, పర్వేజ్, అబ్దుల్లా, సందీప్, రమేష్ పాల్గొన్నారు.



## పల్లెల్లో స్థానిక సందడి

- సమరానికి 'సై' అంటున్న యువత
- అన్ని జాగ్రత్తలు పాటిస్తున్న టీఆర్ఎస్
- మూడు విడతల్లో ఎన్నికలు..

**విజయక్రాంతి, ఇల్లందు:** పంచాయతీ పోరు, పార్లమెంటు ఎన్నికల సమరం తర్వాతనా... లేక ఎన్నికల కంటే ముందేనా... అంటూ అనుమానాలు, సందేహాల నడుమ కొట్టుమిట్టాడుతున్న తరుణంలో టక్కున ఎన్నికల కమిషన్ 'స్థానిక ఎన్నికల నగారా' మోగించింది. దీంతో రాజకీయ నాయకులు ఎలర్ట్ అయ్యారు. ఏజెన్సీ పల్లెల్లో పంచాయతీ సమరం ఊపందుకుంది. ఏ గ్రామంలో చూసినా స్థానిక పోరుపై చర్చోపచర్చలతో సందడి నెలకొంది. ఆశావహులు టికెట్ కోసం ఆయా పార్టీల నాయకుల చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారు. అయితే ఎన్నికల కమిషనర్ ప్రకటించిన నోటిఫికేషన్ ప్రకారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కూడా మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు జరుగనున్నాయి. 21న జరిగే మొదటి విడతలో అశ్వాపురం, బూర్గంపాడు, చర్ల, దుమ్ముగూడెం, మణుగూరు, పాల్వంచ, ములకలపల్లి మండలాల్లోని 174 పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించబడతాయి. అదేవిధంగా రెండో విడత 25 నాడు అన్నపురెడ్డి పల్లి, చంద్రుగొండ, కరకగూడెం, పినపాక, అశ్వారావుపేట, దమ్మపేట, చుంచుపల్లి మండలాల్లోని 142 పంచాయితీల్లోను, 30వ తేదీన జరుగనున్న మూడో విడతలో లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, జూలూరుపాడు, టేకులపల్లి, ఇల్లందు, ఆళ్లపల్లి, గుండాల మండలాల్లోని 163 పంచాయతీల్లో ఎన్నికలు జరుగుతాయి. రాజకీయ నేతలు, పార్టీలు పల్లె పోరుకు సిద్ధమయ్యారు. స్థానికంగా పట్టున్న లీడర్లను వెతికే పనిలో నిమగ్నమయ్యారు. అభ్యర్థుల ఎంపికలో ఒకటికి పదిసార్లు ఆలోచిస్తూ, అతనికున్న ప్లస్‌లు – మైనస్ లను పరిగణలోకి తీసుకుంటూ లెక్కలేసుకుంటున్నారు. టిఆర్ఎస్ మాత్రం ఒక అడుగు ముందుకేసి, ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ, ఆచుతూచి అడుగులేస్తోంది. తాజాగా జరిగిన శాసన సభ ఎన్నికల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఒక్క సీటు కూడా గెలవలేక పరాజయం పాలైన సంగతి తెలిసిందే. ఐదుకు ఐదు స్థానాల్లోనూ గెలవలేక చతికిల పడింది. దీన్ని గుణపాఠంగా తీసుకుని ఆ పార్టీ నేతలు అభ్యర్థుల ఎంపికలో మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటూ, కఠిన నిర్ణయాలు, నిబంధనలు అమలు చేయాలనే నిశ్చయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ప్రతి పంచాయితీలోను అభ్యర్థుల పేర్ల జాబితా చాంతాడంతా ఉంటోంది. దాంతో నేతలు ఎవరికి 'ఎస్' అనాలో... ఎవరికి ' నో ' చెప్పాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. కాగా తాము కోరుకున్న పార్టీలు టికెట్ ఇచ్చినా.. ఇవ్వకపోయినా.. బరిలోదిగడం మాత్రం ఖాయమంటూ యువకులు తెగేసి చెబుతున్నారు.




## అందరితో ఉంటేనే ఆరోగ్యం

ఇప్పుడున్న పరిస్థితులకు అనుకూలంగా మానువుడు రోజంతా కష్ట పడితే గాని జీవనం గడపటం కష్టంగా ఉంటుంది. దానివల్ల వారు సమయం దొరికినప్పుడల్లా అలసటను తీర్చుకోవాలని ఎవరితో కలవకుండా ఒంటరిగా ఉంటూ, కొన్ని రకాల డ్రింక్‌లను తీసుకుంటే ఇంకా రిలాక్స్‌గా ఉంటుందనే అపోహతో ఆరోగ్యాన్ని నాశనం చేసుకుంటున్నారు. అలా సమయం దొరికినప్పుడల్లా లేదా పండుగలు, గెట్ టుగెదర్ కార్యక్రమాల్లో తరచుగా పాల్గొనేవారు చురుకుగా,ఆరోగ్యంగా ఉంటారని అంటున్నారు నార్వే పరిశోధకులు. పండుగలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల కారణంగా నలుగురితో కలిసే అవకాశముంటుదనీ, అదే వీరిని ఆనందంగా ఆరోగ్యంగా ఉంచడానికి దోహదపడుతుందని వారు చెబుతున్నారు. ఒంటరిగా ఉండే వారిలో కనిపించే ఆరోగ్య సమస్యలు మచ్చుకు కూడా వీరిలో కనిపించవని అంటున్నారు. నలుగురితో కలవడం వలన ఒత్తిడి తగ్గి మెదడు చురుకుగా పనిచేస్తుందని వీరు స్పష్టం చేస్తున్నారు. పండుగలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం వలన రోగ నిరోధకశక్తి పెరిగే అవకాశం కూడా ఉందని వీరు చెబుతున్నారు.

అలాగే ఈ మధ్యకాలంలో ప్రతి ఒక్కరూ శరీరంలో ఏ చిన్న సమస్య వచ్చినా డాక్టర్ సలహా పాటించకుండా మందులు వాడటం, సరైన వ్యాయామం లేక మందులను ఆశ్రయించడంవల్ల అనేక రోగాలకు గురవుతున్నారు. మందులు అనేవి వచ్చిన సమస్యను కంట్రోల్ చేయడానికి తప్ప, కంప్లీట్‌గా రోగం నయం కావడం కోసం కాదు. వాటితో పాటు శారీరక శ్రమ, సంతోషం, నలుగురితో కలిసి ఆనందాన్ని పంచుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండొచ్చు. ఇలా చేయకపోతే రోగాన్ని కంట్రోల్ చేసే మందులు మరో ఇతర రోగాలు రావడానికి అవకాశాన్ని ఏర్పరుస్తాయి. వ్యాయాయం, ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొనటం, అందరితో కలిసి గడపటాన్ని అలవాటు చేసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని నిపుణులు తెలియచేస్తున్నారు.

## హసీనా విజయంతో మనకు మోదం

బంగ్లాదేశ్ ఎన్నికల్లో షేక్ హసీనా వాజెద్ నాయకత్వంలోని అవామీ లీగ్ ఘనవిజయం సాధించడం మన దేశానికి ఎంతో ఊరటనిచ్చే పరిణామం. ఎందుకంటే ఆఫ్ఘనిస్తాన్ నుంచి అమెరికన్ సైన్యాలు వైదొలగుతున్న నేపథ్యంలో అక్కడి తాలిబాన్లు, ఇస్లామిక్ జెహాదీ శక్తులు తమ శస్త్రాలు, సరంజామాతో సహా కశ్మీర్, పంజాబ్‌లలోకి చొరబడి, తెగబడే అవకాశాలు కానవస్తున్నాయి. దీనితో కశ్మీర్ లోయ, పంజాబ్‌లలో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ఈ ఏడాది కశ్మీర్ లోయలో ఉగ్రవాదం మరింత పెచ్చరిల్లబోతోందని నిఘావర్గాలు, రక్షణ రంగ నిపుణులు ఇప్పటికే భవిష్యవాణి చెబుతున్నారు. ఈ సమయంలో ఈశాన్య రాష్ట్రాల్లోనూ ఉగ్రవాదం పెచ్చరిల్లితే భారత్ మరింత ఇబ్బందుల పాలవుతుంది. షేక్ హసీనా వాజెద్ ఓటమి పాలై, ఖాలిదా జియా నేతృత్వంలోని బంగాదేశ్ నేషనలిస్ట్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తే బంగ్లాదేశ్ ఉగ్రవాదులకు మళ్లీ ఆశ్రయ స్థలిగా మారే అవకాశాలున్నాయి. మళ్లీ ఐఎస్ ఐ ప్రోత్సాహంతో ఈ ఉగ్రవాద సంస్థలు అస్సాం సహా ఈశాన్య భారతంలో అలజడి సృష్టించే సూచనలున్నాయి. కాబట్టి అవామీ లీగ్ గెలుపు, హసీనా వాజెద్ మళ్లీ ప్రధాని కావడం మనకు శుభసూచనలు.

నిజానికి 2009 లో హసీనా ప్రధానమంత్రి అయిన తరువాతే చిట్టగాంగ్, కాక్స్ బజార్ వంటి ప్రాంతాల్లో తిష్ఠ వేసుకున్న ఈశాన్య రాష్ట్రాల ఉగ్రవాదుల ఏరివేత ప్రారంభమైంది. పాక్ సమర్థిత జెహాదీలను ఉక్కుపాదంతో అణిచివేయడం మొదలైంది. దీని ఫలితంగానే అస్సాంకి చెందిన ఉగ్రవాద సంస్థ యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అస్సాం (ఉల్ఫా), నేషనల్ డెమాక్రటిక్ ఫ్రంట్ ఆఫ్ బోడోలాండ్ (ఎన్ డీ ఎఫ్ బీ) లు ప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు ముందుకు వచ్చాయి. బంగ్లాదేశ్ ప్రభుత్వం ఉగ్రవాదులను అరెస్టు చేసి భారత్‌కు అప్పగించడం వల్లే, ఆ సంస్థలపై ఒత్తిడి పెరిగింది. అవి దారికి వచ్చాయి. హసీనా ప్రభుత్వం తీసుకున్న కఠిన చర్యల వల్లే ఉల్ఫా సైనిక విభాగం అధినేత పరేశ్ బరువా బంగ్లాదేశ్ ను వీడి మయన్మార్ చైనా సరిహద్దుల్లో తలదాచుకునే పరిస్థితి వచ్చింది. పరేశ్ బరువా బంగ్లాదేశ్ కి వస్తే అతనికి 2004 నాటి చిట్టగాంగ్ ఆయుధాల కేసులో మరణ శిక్ష పడటం ఖాయం. అందుకే ఆయన బంగ్లాదేశ్ ను విడిచిపారిపోయాడు. త్రిపుర, మేఘాలయ వంటి ఈశాన్య రాష్ట్రాల్లోనూ ఉగ్రవాదం దాదాపు ఉడిగిపోయింది. ఇవన్నీ హసీనా దృఢ వైఖరి వల్లే సాధ్యమయ్యాయి. 2001 నుంచి 2006 వరకూ ఖాలిదా జియా పరిపాలనలో ఈశాన్య భారత్ ఉగ్రవాదులను ఇంటి అల్లుళ్ల లాగా పరిగణించి, అడుగులకు మడుగులొత్తడం జరిగేది. హసీనా వచ్చిన తరువాతే వీరి పని పట్టింది. హసీనా సహకారం వల్లే మనకు తూరుపు వాకిట ఉగ్రవాదం చీకట్లు లేవు. ఫలితంగా మన ప్రభుత్వాలు, రక్షణ బలగాలు పడమటి వాకిట్లో ఉన్న పాక్ ఉగ్రవాద సంస్థలను ఎదుర్కోగలుగుతోంది.

ఖాలిదా జియా హయాంలో పాకిస్తానీ గూఢచారి సంస్థ ఐ ఎస్ ఐ కి బంగ్లాదేశ్ లో రాచమర్యాదలు జరిగాయి. జమాతె ఇస్లామీ సహా పలు ఉగ్రవాద సంస్థలకు ఖాలిదా టానిక్కులిచ్చి మరీ పెంచి పోషించింది. ఈ ఉగ్రవాద సంస్థలు మన దేశంలో అల్లకల్లోలాన్ని సృష్టించాయి. హసీనా వచ్చిన తరువాతే ఈ సంస్థలపై ఉక్కుపాదం మోపి, అణచివేయటం జరిగింది. పాకిస్తానీ గూఢచర్య సంస్థ ఐఎస్ ఐ కి నిలువనీడ లేకుండా చేసింది. ఫలితంగానే మన దేశంలో గత నాలుగున్నర ఏళ్లుగా ఎలాంటి ఉగ్రవాద సంఘటనలూ జరగలేదు. ఈ నేపథ్యంలో హసీనా వాజెద్ ఘన విజయం నిజంగా భారత్‌కు ఊరట కలిగించే పరిణామం.

అంతే కాదు. హసీనా మోదీ మైత్రి వల్ల మనకు బంగ్లాదేశ్ నుంచి పాకిస్తాన్ ను తరిమివేయడంతో పాటు, ఇరు దేశాల మధ్య ఆర్థిక, వాణిజ్య సహకారం గణనీయంగా పెరిగింది. బంగ్లాదేశ్ లోని ఓడరేవులను, వారి భూభాగాన్ని తన ఉపరితల రవాణా, జలరవాణా కోసం భారత్ ఉపయోగించుకునే పరిస్థితి ఏర్పడింది. ఈ రవాణా మార్గాల ద్వారా మనకు ఈశాన్య భారత్ లోకి వివిధ ప్రాంతాలకు చేరుకోవడం సులువవుతుంది. యుద్ధ సమయంలో ఈశాన్య భారతాన్ని మిగతా భారతదేశంతో కలిపే అతి సన్నని కోడి మెడ ప్రాంతాన్ని శత్రువు ఆక్రమించుకున్నా మనకు ప్రత్యామ్నాయ మార్గాలు ఉంటాయి.

ఖాలెదా సహాయనిరాకరణ వల్లే మిజోరామ్ వంటి సుదూర ప్రాంతాలకు చేరేందుకు కలడాన్ మల్టి మోడల్ ప్రాజెక్టు ను రూపొందించి, మన సరకులు మయన్మార్‌లోని సిట్వేకు, అక్కడ నుంచి మిజోరంకు చేర్చేందుకు పూనుకోవాల్సి వచ్చింది. హసీనా వచ్చిన తరువాత మనకు నేరుగా బంగ్లాదేశ్ మీదుగా ఉపరితల రవాణా చేసుకునే వీలు కలిగింది. అందుకే హసీనా విజయం భారత్‌కు ఎంతో ప్రయోజనకారి. మన దేశానికి బంగ్లాదేశ్ కి చిరకాల సంబంధం ఉంది. 1971 లో పశ్చిమ పాకిస్తాన్ ఇనుప బూట్ల కిందనుంచి బెంగాలీలను కాపాడి బంగ్లాదేశ్ ఏర్పాటు చేయడంలో భారత్ ది కీలక పాత్ర. ఇటీవల సీఎస్ డీ ఎస్ హిందూ పత్రికలు సంయుక్తంగా నిర్వహించిన జనాభిప్రాయ సర్వేలో బంగ్లాదేశ్ ను భారత్ కు అత్యంత సన్నిహిత మిత్రుడిగా భారతీయులు గుర్తిస్తున్నారని వెల్లడైంది. అదే విధంగా బంగ్లాదేశ్ నిర్మాత షేఖ్ ముజీబుర్ రహమాన్ జీవిత చరిత్రను ఎనిమిది భారతీయ భాషల్లోకి అనువాదం చేశారు. బంగ్లా నాయకత్వం పట్ల భారత్ కు ఉన్న ఆసక్తికి ఇది నిదర్శనం. ఈ మైత్రి హసీనా వాజెద్ ఏలుబడిలో మరింత దృఢతరమౌతుందనే ఆశిద్దాం. ఈ మైత్రి భారతదేశ ప్రయోజనాలకు శ్రీరామరక్ష కావాలని కోరుకుందాం.

## గాలిపటాల సంక్రాంతి ప్రాణాంతకం కారాదు

ముచ్చట్లు

జనవరి నెల రాగానే కొత్త సంవత్సర సంబరాలు జరుపుకోవాలని యువత చాలా ఆరాటంగా ఎదురుచూస్తూ ఉంటుంది. సంబరాలు అనేవి ప్రాణాల మీదకు వచ్చే విధంగా ఉండకుండా తగిన జాగ్రత్తలతో ఉండాలి. రానున్న సంక్రాంతి పండుగకు యువకులు ఇళ్ళ పైకి ఎక్కి గాలిపటాలు ఎగురవేయాలని ఏర్పాట్లు చేసుకుంటుంటారు. ఒక గాలిపటాలే కాకుండా సరదాకోసం ఇంటి పై కప్పులమీదే డెక్‌లను ఏర్పాటు చేసుకొని డాన్స్‌లు చేసుకుంటూ, గాలిపటాల మీద శ్రద్ధ లేకుండా పాటలను వినుకుంటూ ఎదుటివారి గాలి పటాలపై గురిపెడుతూ వెనుకా, ముందు ఏమి చూసుకోకుండా ఇంటిపై నుండి క్రింద పడి ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు. ఇలాంటి సంఘటన న్యూ ఇయర్ వేడుకల్లో సంక్రాంతి రాకమునుపే బీహార్‌లో బర్దహ్ గ్రామంలో చోటుచేసుకుంది. ఉత్సాహంగా గాలిపటాలు ఎగురవేస్తున్న ఇద్దరు చిన్నారులు నీటితో నిండిన గొయ్యిలో పడి మృతి చెందారు. మృతులను బర్హద్ నివాసి ఫిరోజ్ కుమారుడు రెహాన్(7), జాదిమ్ కుమారుడు సనమ్(8) లుగా పోలీసులు గుర్తించారు. మృతుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఈ ఇద్దరు చిన్నారులు తమ స్నేహితులతో పాటు గాలిపటాలు ఎగురవేయడంలో మునిగిపోయారు. గంగా నది ఒడ్డున గాలిపటాలు ఎగురవేస్తూ కొండల మధ్య ఉన్న గొయ్యిలో పడిపోయారు. వీరి స్నేహితుడు ఈ సమాచారాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. వెంటనే అక్కడికి వచ్చిన వారు... గొయ్యిలో పడిన చిన్నారులను బయటకు తీసుకువచ్చి ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు వారిని పరీక్షించి అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. ఇలాంటి సంఘటనలు చాలా జరిగాయి. రానున్న సంక్రాంతికి ఇలాంటి సంఘటనలు జరుగకుండా తల్లి తండ్రులు పిల్లల మీద శ్రద్ధ వహించి వారికోసం సమయం కేటాయించి ఇంటి పై కప్పులమీద, నది ఒడ్డున కాకుండా, విశాలమైన మైదానంలోకి తీసుకెళ్ళి పిల్లలను సంతోషపరిస్తే ఇలాంటి సంఘటనలు జరుగకుండా ఉంటాయి. జరిగే అవకాశం కూడా ఉండదు.

**– జి.మహేశ్, ఎల్బీనగర్**

## మానవతా విలువల ప్రాముఖ్యం పిల్లలకు తెలపాలి

విద్యా-వికాసం 7

**శాంతము:**

శ్రద్ధ, మౌనం, ఏకాగ్రత, నిశ్శబ్దత, క్రమశిక్షణ, సమర్పణ, క్షమ, సమత్వము, నమ్మకము, కృతజ్ఞత, సంతోషము, ఐక్యమత్యత, అణుకువ, విధేయత, ఆశావాదము, ఓర్పు, సంతృప్తి, ఆత్మనిగ్రహం, శరణాగతి, సద్గుణము, ప్రశాంతత, వినయం, విధేయత ఇవన్నీ శాంతి కిందికి వస్తాయి.

మహాత్మాగాంధీ గారి మూడు కోతుల బొమ్మలు చెప్పే సూత్రాలు 'చెడును చూడకు, చెడును వినకు, చెడును మాట్లాడకు' అనగా 'మంచినే చూడు, మంచినే విను, మంచినే మాట్లాడు' శాంతి కిందికి వస్తాయి. గాంధీగారి ఆశ్రమానికి ఓ పెద్దాయన వచ్చి హాలులో కూరలు తరుగుతున్నాయనను 'గాంధీగారున్నారా' అని అడిగితే, ఆయన 'నేనే గాంధీని, చెప్పండి' అని బదులిచ్చారు శాంతంగా. అంతటి అణకువ, ఓర్పు, ప్రశాంతత, వినయం, విధేయత, శ్రద్ధ, ఆత్మ నిగ్రహం, క్రమ శిక్షణ గల వారే శాంతంగా ఉండగలరు. శాంతికి ప్రథమ శత్రువు కోపం. దానిని నిగ్రహించుకోవాలి.

**శాంతము...**

దయగల హృదయమే దైవ మందిరం. మానవసేవే మాధవ సేవ. నరుడే నారాయణుడు. మానవత్వానికి మించిన దైవం లేదు. మంచితనానికి మించిన పూజ లేదు. మంచి స్వభావానికి మించిన ఆభరణం లేదు. నీకు దక్కిన సుఖశాంతులు ఇతరులకు దక్కాలని కోరుకో. నీకు కలిగిన కష్ట నష్టాలు ఇంకెవరికీ కలగరాదని ఆకాంక్షించు. నీ వలన ఇతరులకు మంచి జరిగేటట్లు ప్రవర్తించు, ఇబ్బంది కలిగేటట్లు ప్రవర్తించకు.

**యదార్థ గాథ**

సంత్ ఏకనాథ్ ఎల్లప్పుడూ శాంతంగా, అనందంగా ఉండే వాడు. ఆయన ఎప్పుడూ కోపానికి గురి అయ్యేవాడు కాదు. ఒకసారి, ఆయన నదిలో స్నానం చేసి ఒడ్డున కూర్చుని జపం చేసుకుంటుండగా, ఒక తుంటరి ఆయనకు కోపం తెప్పించాలని, ఆయన మీద ఉమ్మేశాడు. ఏకనాథ్ ప్రశాంతంగా వెళ్ళి స్నానం చేసి వచ్చి, మళ్ళీ జపం చేసుకున్నాడు. ఆ తుంటరి ఎట్లాగైనా ఏకనాథ్‌కు ఈ రోజు కోపం తెప్పించాలని, మళ్ళీ మళ్ళీ ఆయనమీద ఉమ్మేయటం, ఏకనాథ్ వెళ్ళి స్నానం చేసివచ్చి జపం చేసుకోవటం 108 సార్లు జరిగింది. అప్పుడు ఆ తుంటరికి బుద్ధి వచ్చి, ఏకనాథ్ కాళ్ళమీద పడి తాను ఓడిపోయినానని, తనను క్షమించమని వేడుకున్నాడు. ఏకనాథ్ అతనిని లేవనెత్తి, నీ వల్ల నేను 108 సార్లు నదీ స్నానం చేసిన పుణ్యం సంపాదించాను, కనుక నేనే నీకు ఋణపడి ఉన్నాను అన్నాడు.

అంతటి శాంత గుణం మనకు సాధ్యం కాకపోయినా, కనీసం చిన్న చిన్న వాటికి అయినా కోపం తెచ్చుకోకుండా, శాంత లక్షణం అలవరచుకోవాలి. కోపం వల్ల ఎక్కువ నష్టపొయ్యేది ఎదుటివారికన్నా మనమే అని గుర్తుంచుకోవాలి. కోపం వచ్చినపుడు ఆ ప్రదేశం నుంచి పక్కకు వెళ్ళాలి. మంచి నీళ్ళు త్రాగాలి. కోపం వచ్చినపుడు అద్దంలో చూచుకుంటే, తన ముఖం ఎంత అంద వికారంగా తయారయిందో అర్థమౌతుంది.

**ప్రేమ:**

ఆప్యాయత, అంగీకారము, సర్వభూత దయ, సానుభూతి, త్యాగము, భక్తి, క్షమ, స్నేహము, ఔదార్యము, పరోపకారము, మానవత్వము, కనికరము, సేవ, నిస్వార్థము, సానుభూతి, సహనము, విశ్వాసము, ఇవన్నీ ప్రేమ కిందికి వస్తాయి. పరోపకారం–పుణ్యం, పర పీడనం–పాపం. మానవసేవే–మాధవ సేవ. ఇతరులు నీకేమి చేయాలని ఆశిస్తావో అది ఇతరులకు చెయ్యి, తల్లి ప్రేమ, తండ్రి త్యాగం మరువరాదని, తీర్చుకోలేనివి. ఇతరుల కష్టాలను చూసి కరుణతో 'అయ్యో' అని స్పందించే గుణం ఉండాలి. దానినే దయ అంటారు. చేతనైన సహాయం చేయాలి. దానిని దాక్షిణ్యం అంటారు. ఈ రోజుల్లో రోడ్డు మీద మనిషికి ప్రమాదం అయి పడి ఉంటే, మనకెందుకని జనం చూసుకుంటూ వెడతారు గాని, ఆగి సహాయపడరు. అది మానవత్వం కాదు. సేవ చేయటం వలన అహం తగ్గి, నమ్రత పెరుగుతుంది. సేవచేయటం ఇతరులను ఉద్ధరించటానికి కాదు. అది నీ ఉద్ధరణకే. దయ గల హృదయమే మందిరము.

తల్లియే ప్రత్యక్ష దైవం. అమ్మను మించిన త్యాగమూర్తి లేదు. పిల్లలకు దయ, సహనం, శాంతి సత్యము, సానుభూతి ఇత్యాది సద్గుణములును మొట్టమొదట నేర్పునది తల్లియే. మొట్టమొదట ఇంట్లో తల్లి తండ్రులను దైవంగా విశ్వసించాలి. ప్రత్యక్షంగా కనిపించే తల్లి తండ్రులను ప్రేమించి గౌరవించినప్పుడే, పరోక్షమైన దైవత్వం పిల్లలకు సాక్షాత్కరిస్తుంది. తల్లి అనుగ్రహాన్ని పొందినవాడు ధన్యుడు. అందుకే తల్లిని మాతృమూర్తి అని, స్వదేశమును మాతృదేశం అని, స్వభాషను మాతృభాష అని అన్నారు. మాతృభాషను మరిచినవారు, మాతృదేశాన్ని గౌరవించనివారు, మాతృమూర్తి యొక్క ఆలనా పాలనా చూడని వారు కృతఘ్నులు.

**ప్రేమ....**

కథ: ఒక కాలేజీలో ఒక విద్యార్థికి ఆటలలో ప్రథమ బహుమతిగా, బంగారు ఉంగరం ఇచ్చారు. అతనికి తండ్రి గతించాడు. తల్లి కష్టపడి చదివిస్తున్నది. తల్లి మీద మంచి ప్రేమ గలవాడు. ఇంటికి వచ్చి 'అమ్మా ఈ ఉంగరం తీసుకో, నీ ఋణాన్ని తీర్చుకుందామని ఎన్నాళ్ళనుంచో అనుకుంటున్నాను' అన్నాడు. అప్పుడు తల్లి 'నాయనా, నాకు ఉంగరం ఎందుకు, పని చేస్తున్నప్పుడు ఎక్కడో పడిపోతుంది, నాకో సహాయం చెయ్యి, 'ఈ రాత్రి నా మంచం పక్కన మంచం వేసుకొని పడుకో' అంది. 'ఓ దానికేం' అని అలాగా పడుకున్నాడు. రాత్రి 11 గంటలకు తల్లి మంచి నీళ్ళడుగుతే, వంటగదికి వెళ్ళి తెచ్చి ఇచ్చాడు. రాత్రి 12 గంటలకు మళ్ళీ అడిగితే మంచినీళ్ళు తెచ్చి ఇచ్చాడు. మళ్ళీ రాత్రి 2 గంటలకు అడిగితే 'అమ్మా, నా వల్ల కాదని' చెప్పి మంచినీళ్ళకుండ, గ్లాసు తెచ్చి, అమ్మ పక్కన పెట్టి 'నన్ను ఇక లేపక, దప్పిక వేసినపుడు, ఆ కుండలోని నీళ్ళు తాగు' అని చెప్పి పడుకున్నాడు. తెల్లవారిన తర్వాత తల్లి చెప్పింది 'నాయనా, ఒక్క రాత్రి మూడు సార్లు లేపినందుకే నీ వల్ల కాదన్నావు, నీ పసితనంలో నా పక్కన పడుకుని ఎన్ని సార్లు ఏడిస్తే, నేను నిన్ను ఎత్తుకొని సముదాయించాను, ఎన్నిసార్లు పక్క తడిపితే లేచి పక్క మార్చాను, కనుక తల్లి ఋణం ఏ పిల్లలు తీర్చలేరు' అని చెప్పింది. భగవంతుడు తనకు మారుగా తల్లి రూపంలో ఉండి పిల్లలను సంరక్షిస్తాడు. అలాంటి దేవతను 'మమ్మీ'( అంటే 'మృతదేహం') అనటం ఎంత తప్పు. అలానే తండ్రి కష్టపడి ఇంటి భారం మోస్తూ, తనకు చెప్పులు లేకపోయినా పిల్లవాడికి బూట్లు కొంటాడు. తల్లి తండ్రుల ఋణం తీర్చుకోలేనిది. వారిని దైవసమానులుగా భావించి వారికి ఏ లోటు లేకుండా చూడాల్సిన బాధ్యత పిల్లల మీద ఉన్నది. వారిని అమ్మా, నాన్న అని సంబోధించాలి. అందుకే శ్రీ సత్యసాయి బాబా చెప్పారు. 'పే–రెంట్స్' (తల్లి తండ్రులకు అద్దె అనే ఋణం చెల్లించు) చలోక్తి విసిరారు.

**– వ్యాకరణం వేణుధర శాస్త్రి**

## విద్యార్థుల ధర్మయుద్ధానికి అండ

రక్షణలు సక్రమంగా అమలు జరగాలని కోరుతూ వారు, పోచంపాడు ప్రాజెక్టుకు కేటాయింపుల కొరత గురించి ప్రస్తావించగా, 'నిర్మాణం ఆలశ్యమైతేనేంది పునాదులు గట్టిగానే ఉన్నాయి మీరు వెళ్ళండిలెండి' అని తలబిరుసుగా సమాధానం ఇచ్చారు. తెలంగాణ యన్‌జిఓలకు జరుగుతున్న అన్యాయాలపై అసంఖ్యాకులు కోర్టుకు వెళ్తున్న విషయం ముఖ్యమంత్రి దృష్టికి తేగా, 'కోర్టు ఫీజు పెంచితే కోర్టుకు వెళ్ళడం వాళ్ళే మానేస్తారు' అని వ్యంగ్యంగా ఆయన సమాధానం చెప్పారు. ఈ సంఘటన తర్వాత ఈ ప్రతినిధి వర్గంలో వెళ్ళినవారంతా తెలంగాణ ఆంధ్రప్రదేశ్ నుండి విడిపోవడమే సరియైన పరిష్కారంగా కనిపిస్తున్నది అనే స్థిర భావనకు వచ్చారు.

వేర్పాటు ఆలోచన ఉన్న మరికొందరు మిత్రులతో ఈ విషయాలు చర్చించి పటిష్టమైన కార్యక్రమం రూపొందించడం అవసరమన్న తమ ఆలోచనను ఆంధ్రజ్యోతి కార్యాలయంలో నాటి ఆపత్రిక ప్రతినిధి ఆదిరాజు వెంకటేశ్వరరావు, తన స్నేహితులు దేవులపల్లి ప్రభాకరరావు, శ్రీ రఘువీరరావు, దక్కన్ క్రానికల్ ప్రధాన విలేఖరి శ్రీ ప్రతాప్ కిషోర్‌తో ఒకనాడు ప్రస్తావించడం జరిగింది. తనూ అదే ఆలోచనతో కొందరు మిత్రులతో చర్చలు జరుపుతున్నానని వివరించిన శ్రీ కిషోర్ 'తెలంగాణ పార్టీ' ఒకటి ఏర్పడితే బాగుంటుందేమోననే అభిప్రాయంతో ఏకీభవించారు. 'ఆంధ్రజ్యోతి' కార్యాలయం సచివాలయం ఎదురుగా ఉండడం వలన, అక్కడ జరిగే ప్రదర్శనలను రిపోర్ట్ చేసే, చూసే కొందరు విలేఖరులు, ప్రదర్శనలను తిలకించదలచిన సన్నిహితులు ఆ రోజులలో ఆంధ్రజ్యోతి కార్యాలయంలో తిష్టవేయడం ఒక ఆనవాయితీగా ఉండెడిది.

తర్వాత రెండు రోజులలో పైన ఉదహరించిన వారు, మరికొందరు గౌలిగూడలో ఉన్న తెలంగాణ పతందార్ల కార్యాలయంలో సమావేశం జరిపారు. ఈ సమావేశానికి వారితో పాటు వతందార్ల సంఘానికి చెందిన శ్రీ రాయపరాజు వెంకట్రామారావు, శ్రీ కె. నర్సింగరావు, శ్రీ పి.యస్. స్వామి, శ్రీ రమాకాంతరావు హాజరైనారు. రెండు రోజుల అనంతరం వీరు మళ్ళీ సమావేశమైనారు. సమావేశానంతరం ప్రతాప్ కిశోర్ శ్రీ ఏ. మదన్‌మోహన్ ఇంటికి వెళ్ళి ఉద్యమంలో చేరవలసినదిగా కోరగా, తను, తన సీనియర్ శ్రీ నూకల రామచంద్రారెడ్డికి ఒక మాట చెప్పవలసి ఉంటుందని మదన్‌మోహన్ పేర్కొనడం జరిగింది.మరొక రెండు రోజుల అనంతరం జరిగిన మూడవ సమావేశానికి శ్రీ ఎ. మదన్‌మోహన్, డాక్టర్ గోపాలకృష్ణ, శ్రీ మునీర్ జమాల్ కూడా హాజరైనారు. మర్నాడే 'తెలంగాణ పీపుల్స్ కన్వెన్షన్' ఏర్పాటైనట్టు పత్రికలలో వార్త వెల్లడైంది.

వతన్‌దారులు, ప్రభుత్వోద్యోగులు ఎన్ని సంవత్సరాల నుండియో ఆంధ్రప్రదేశ్ సంఘాలతో విలీనమైనప్పటికీ ఈ రెండు సంఘాలు తమ వ్యక్తిత్వాన్ని పరిపోషించుకుంటూనే ఉన్నవి. సమీకృతం పేరుతో క్షౌరం చేసేందుకుగాను ఆంధ్రప్రాంత శాసనాలను అనేకం ఇక్కడ ప్రవేశ పెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నించినప్పుడల్లా వీరు తీవ్రంగా ప్రతిఘటించారు. ఆంధ్రలో వలె ఇక్కడ కూడా వంశపారంపర్య గ్రామాధికార గ్రామ సేవకుల హక్కులను ప్రభుత్వం రద్దు చేసినప్పుడు వతన్‌దార్లు సుప్రీంకోర్టు వరకు వెళ్ళారు. వీరితో పాటు సమాజంలోని అన్ని తరగతులవారు కూడా ఉత్సాహం, పట్టుదలతో స్త్రీ, పురుష భేదం లేకుండా ముందుకు రావడం ఈ ఉద్యమంలో ఒక విశిష్టత.

ఉద్యమ బీజాలు మొలకెత్తిన నాటినుండి ఆంధ్ర పాలకుల పీడ ఎలా విరగడ అవగలదా అని ఆ ప్రాంతం న్యాయవాదులు, వైద్యులు మొదలైనవారు కూడా ఆలోచించడం మొదలు పెట్టారు. అందువల్లనే, విద్యార్థులు ప్రత్యేక రాష్ట్రోద్యమం ప్రారంభించిన వారం రోజులకే సిటీ సివిల్ కోర్టు అడ్వకేట్స్ సమావేశం జరిపి విద్యార్థుల ఉద్యమాన్ని బలపరిచారు. కొందరు అపహాస్యం చేసినప్పటికీ శ్రీ జి.పి. సక్సేనా వంటి యువ న్యాయవాదులు చొరవ తీసుకొని సహచరులను ఏకం చేసి ప్రత్యేక రాష్ట్ర వాదానికి మద్దతునిచ్చారు.

ప్రత్యేక రాష్ట్రవాదుల కార్యాచరణ సమితి ఆవిర్భవించేందుకు సుమారు డజను మంది వ్యక్తులే కారకులైనా, ఇంచుమించు అదే రోజులలో ఇటు నగరంలోను, అటు జిల్లాలలో పలువురు బాధ్యతగల పౌరులు ప్రత్యేక రాష్ట్ర వాదాన్ని బలపరిచేందుకు ఏ విధంగా ముందుకు రావాలా అని యోచిస్తుండిరి. అందువలన, ఎవరైతేనేం, ఏదోవిధంగా మన ఆలోచనకే రూపకల్పన జరిగినది కదా అనే సంతృప్తితో వారు 'తెలంగాణ పీపుల్స్ కన్వెన్షన్' తో సంబంధాలు ఏర్పరచుకున్నారు. ఇలాంటి ప్రముఖులలో హనుమకొండ పంచాయితీ సమితి నాటి అధ్యక్షులు సంగంరెడ్డి సత్యనారాయణ, కాంగ్రెస్ ప్రముఖులు శ్రీ జనార్ధన్ రెడ్డి (హనుమకొండ), రామచంద్రారెడ్డి (జనగామ) చేకూరి కాశయ్య (ఖమ్మం) రామోదరరెడ్డి (దేవరకొండ) పులి వీరన్న (మహబూబ్‌నగర్) మొదలైనవారు ఉన్నారు. అప్పటినుండే ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర వాదులపై దాడి ప్రారంభించినది. తెలంగాణకు జరిగిన అన్యాయాలు ప్రచురించినందుకు ఇంగ్లీషు వారపత్రిక 'లీడర్' సంపాదకుడు, ప్రచురణకర్తయైన శ్రీ మునీర్ జమాల్, ఆ వ్యాస రచయిత శ్రీ ఇ.వి. పద్మనాభన్‌పై క్రిమినల్ కేసులు పెట్టి వారిని అరెస్టు చేశారు. రెండు ప్రాంతాల ప్రజల మధ్య విభేదాలు సృష్టించి వారిని రెచ్చకొట్టేందుకు ప్రయత్నం చేశారని వీరిపై ఆరోపణ చేశారు. అయితే, ఆరోపణ తర్వాత ప్రభుత్వం రుజువు చేసుకొనలేకపోయింది.

ఒకవైపు ప్రభుత్వం మరొకవైపు ఆంధ్రప్రాంతపు పత్రికలు, కొందరు ఆంధ్ర ప్రముఖులు తెలంగాణా ఉద్యమాన్ని అప్రతిష్టపాలు చేసి బయటి ప్రపంచం దాన్ని ఏవగించుకునేట్టు చేయాలన్న పన్నాగంతో ఈ ప్రాంతంలో ఆంధ్రులకు రక్షణ లేదని వారిపై అత్యాచారాలు జరుగుతున్నవనీ, తెలంగాణలోని ఆంధ్ర మహిళలు అత్యాచారాలకు గురవుతున్నారని ఉధృతంగా దుష్ప్రచారం కొనసాగించారు. ఇది ఇక్కడే కాక ఢిల్లీవరకు ప్రాకింది. కాని వాస్తవ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. దుండగులకు, సంఘ విద్రోహులకు కుల మత ప్రాంతీయ భేదాలు ఏమీ ఉండవు. ఉద్యమాన్ని సాకుగా తీసుకొని ఎక్కడైనా ఎవరైనా, ఎప్పుడైనా ఆంధ్రులకు తెలంగాణా వారు కూడా ఏమైనా అనే అవకాశాలు లేవని త్రోసిపుచ్చడానికి కూడా వీలు లేదు. అలాంటి సంఘటనలు ఉద్యమాన్ని నిర్వహిస్తున్న ప్రజా సమితి, విద్యార్థి కార్యాచరణ సంఘం వారి దృష్టికి వచ్చినప్పుడు తక్షణం తగు చర్యలు గైకొనడం జరిగింది. ఒకటి రెండు సందర్భాలలో నిందితులు పోలీసులకు కూడా అప్పగించబడినారు.

మరొక సందర్భంలో నగరంలో ఒక షాపు వద్ద తెలంగాణా ఉద్యమకారులని చెప్పుకొని కొందరు దౌర్జన్యానికి పాల్పడ్డారని తెలిసి ఉద్యమంలోని కొందరు విద్యార్థులు హుటాహుటిన అక్కడకు వెళ్ళారు. వారిని నిర్బంధించి విచారించగా వారు ఆ గూండాలు ముఖ్యమంత్రి ఆశీర్వచనంతో ప్రారంభించిన సమైక్యతా సంఘంలో పనిచేసేందుకు మే మాసంలో జైలునుండి ప్రత్యేకించి విడుదల చేసిన పాత కేడీలని తేలింది. అబిడ్స్‌లో ఒక హోటల్‌లో మకాంపెట్టి వారు 'వీరప్రతాప్‌రెడ్డి' అనే వ్యక్తి నాయకత్వంలో సమగ్రతావాదుల ఉద్యమం నడుపుతున్నారు. సమైక్యతావాదులు ఎంతో కాలం ఆదిలోవలె వారిని 'పోషించ' లేక పోవడంతో, వారు ప్రజలపై విరుచుకుపడి దౌర్జన్యానికి పూనుకొని డబ్బు వసూలు చేసుకోవడమే కాక తాము తెలంగాణా ఉద్యమకారులుగా 'గౌరవం' సంపాదించడానికి ప్రయత్నించారు.

తరువాత రెండు మూడు రోజులలో ప్రత్యేక రాష్ట్ర వాదులైన కొందరు ఆబిడ్స్‌లోని ఒక హోటల్‌లో మకాం చేసిన వారిపై విరుచుకొనిపడగా సమగ్రతావాదులమని చెప్పుకునేవారు, వారి నాయకులు పారిపోయారు. కొందరు గోడదూకి పరుగులంకించుకున్నారు. ఇలా గోడ దూకిన వారిలో అప్పట్లో నర్సరావుపేట నుండి వచ్చిన న్యాయవాది భవనం వెంకట్రామరెడ్డి కూడ ఉన్నారు. ఈ గోడ దూకిన సంఘటనలోనే ఆయన కాలుకు దెబ్బ తగిలి, జీవితాంతం ఆ అంగ వికలత మిగిలిపోయింది. తర్వాత కాలంలో ఈ రచయితకు శ్రీ భవనంగారు సన్నిహిత మిత్రులైనారు. శ్రీ భవనం గారి సతీమణి మాజీ మంత్రి శ్రీమతి జయప్రదగారు కూడ ఈ రచయిత ముఖ్య అభిమానులలో ఒక్కరైనారు. వారిద్దరి పట్ల ఈ రచయితకు ఎనలేని గౌరవం. వాస్తవంగా ప్రజా సమితి విద్యార్థి కార్యాచరణ సమితి నాయకులు పలుసార్లు ప్రకటించినట్టు, తెలంగాణా పోరాటం ఏ ఒక్క ప్రాంతం, తెగ, జాతి, కులం, మతం వారికి ప్రత్యేకించి ఆంధ్ర సోదరులకు వ్యతిరేకంగా ఉద్దేశించబడినది కాదు.

**– ఆదిరాజు వెంకటేశ్వర రావు**

## ఓటర్ల చైతన్యమే.. ప్రజాస్వామ్యానికి రక్షణ

భారతదేశం లాంటి అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికలు ఖర్చుతో కూడినవిగా తయారయ్యాయి. రాజకీయ పార్టీలు అభ్యర్థి ఎంపిక నుంచి ఓటరును పోలింగ్ కేంద్రానికి తీసుకువచ్చి ఓటు వేసే వరకు అన్నింటికీ డబ్బుతో ముడిపెడుతున్నారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజలే నిర్ణేతలు అయినప్పటికీ నాయకుల ఎంపికలో డబ్బు,కుల,మత,వర్గ రాజకీయాల ప్రభావం అధికంగా ఉంటోంది. మందుతో, డబ్బుతో, స్వల్ప కాలిక తాయిలాలతో ఓటర్లను ప్రలోభ పెట్టి ఓట్లు వేయిస్తున్నారు. ఎన్నికలలో కులం,మతం వంటి సున్నిత అంశాలను కూడా రెచ్చగొడుతున్నారు. ఈ తరుణంలో ఓటరు చైతన్యం కావాలి, ప్రజాస్వామ్య పరిరక్షణకు నాంది పలకాలి. ప్రపంచ గతిని మార్చే శక్తి ఓటుకు కలదు. వ్యక్తి ఆస్తిత్వాన్ని ఓటు గుర్తిస్తుంది. వ్యవస్థ మార్పునకు ఓటు నాంది పలుకుతుంది. ఎవరికి అధికారం ఇవ్వాలో ఓటర్లు నిర్ణయించేది ఓటు ఆయుధంతోనే. ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణ ఓటు ద్వారానే. నేతల తలరాతనే కాదు, దేశ తలరాతను మార్చే సత్తా ఓటుకు మాత్రమే కలదు. ఓటరులో చైతన్యం వస్తే ఓటు దేశ గమనాన్ని మార్చేస్తుంది. ఓటు హక్కును సమర్ధంగా వినియోగించుకుంటే దేశాభివృద్ధి సాధ్యం కాగలదు.



ప్రజాస్వామ్య వ్యవస్థ పదిలంగా ఉండాలంటే పద్దెనిమిది సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు తమ ఓటును నమోదు చేసుకోవాలి. తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలి. అయితే ఆ ఓటు విలువ ఎంత మందికి తెలుసు? కేంద్ర ప్రభుత్వం జనవరి 25ను జాతీయ ఓటర్ల దినోత్సవంగా ప్రకటించి ఓటు ఆవశ్యకత, ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటర్ల పాత్ర, యువ ఓటర్ల నమోదు, ఓటర్ల చైతన్యం వంటి కార్యక్రమాలు చేపడుతున్నది. భారత ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నావంతు కర్తవ్యాన్ని గుర్తించి ఉన్నతమైన నాయకుని ఎన్నుకుంటానని ఓటర్ల చేత ప్రమాణం చేయిస్తోంది. నోటుకు, మందుకు,వ్యక్తిగత స్వార్ధ ప్రయోజనాలకు ఓటరు అమ్ముడుపోయి నేరస్తులను, అసమర్ధులను ఎన్నుకొంటుంటే ఓటర్లలో కల్పించిన చైతన్యం ఏమయినట్లు? ఉన్నత విలువలతో కూడిన ప్రజాస్వామ్యాన్ని కాపాడవలసిన నేతలే నేరస్తులు అయి నేరమయ భారతమే నిర్మితమవుతుంటే దాన్ని మార్చగల సత్తా ఓటరు చేతిలోనే ఉంది . ప్రభుత్వం, నాయకుల చేతిలో ఎంతమాత్రం లేదు.

ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా కొనసాగించడంలో పౌర సమాజం పాత్ర కీలకమైనది. వయోజనుడయిన ప్రతి పౌరుడు తన ఓటు హక్కును నిష్పాక్షికంగా, నిర్భయంగా వినియోగించుకోవడం ఎంత అవసరమో, ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించడం కూడా అంతే అవసరం. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలంటే ప్రతి పౌరుడు తన బాధ్యతను గుర్తించాలి. సెక్షన్ 326 ప్రకారం భారత రాజ్యాంగం ఓటు హక్కును కల్పించింది.18 ఏళ్ల వయసు దాటిన వారందరూ భారత లోక్‌సభకు, రాష్ట్ర శాసనసభకు జరిగే ఎన్నికలలో తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. భారత రాజ్యాంగం జాతి,మత,కుల,లింగ వంటి ప్రాతిపదికతో నిమిత్తం లేకుండా ఓటు హక్కు కల్పించింది. ఓటు వేయడానికి హక్కు అంటే తనకు నచ్చిన అభ్యర్థిని ఎన్నికలలో గెలిపించడానికి ఓటు వేయడం. అంటే భారతదేశంలో రాజ్యాంగం ప్రకారం ఏర్పాటయ్యే ప్రభుత్వ వ్యవస్థ ఏ విధంగా ఉండాలి నిర్ణయించుకునే అధికారం ప్రతి పౌరుడికి ఓటు హక్కు ద్వారా సంక్రమించింది. ఓటరు నిర్భయంగా, ప్రశాంతంగా, ఏకాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవచ్చు.1951 ప్రజా ప్రాతినిధ్య చట్టం, భారతీయ శిక్షాస్మృతిలలో ఎన్నో చట్టాలు రూపొందిండంతోపాటు ఎన్నికల ప్రక్రియను నీతివంతంగా, అత్యంత పారదర్శకంగా జరగడానికి చాలా నియమాలు, సూత్రాలు పొందుపరచబడ్డాయి. ఎన్నికలు సజావుగా, శాంతియుతంగా జరగకుండా అడ్డుపడే శక్తులను కఠినంగా శిక్షించడానికి కట్టుదిట్టమైన చట్టాలు ఏర్పరిచారు. ప్రజలు ప్రభుత్వానికి సహకరించి ఎన్నికలు సజావుగా జరిపించుకునే బాధ్యత ప్రజల మీద ఉంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత శక్తివంతమైన ఆయుధం ఓటు మాత్రమేనని అందరూ గుర్తించాలి. ఓటరు తాను ఎన్నుకొనే అభ్యర్థి గుణగణాలను, పూర్వ చరిత్రను పరిగణనలోకి తీసుకుని ఓటు వేయాలి. ఎటువంటి ప్రలోభాలకు ప్రభావితం కాకుండా ఓటర్లు చైతన్యంతో వ్యవహరించాలి. అప్పుడే ప్రజాస్వామ్యం పరిరక్షించబడుతుంది.

**–వాసిలి సురేష్**
**9494615360**

## ఐనవోలు జాతరలో సౌకర్యాలు

విజయక్రాంతి, వరంగల్: ఈ నెల 13 నుంచి ప్రారంభమయ్యే ఐనవోలు మల్లికార్జున స్వామి జాతరకు వచ్చే భక్తులకు తగిన వసతులు సమకూర్చాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జె పాటిల్ ఆదేశించారు. బుధవారం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికంగా చేస్తున్న రోడ్లు, డ్రైనేజీ పనులను పరిశీలించారు. జాతరలోపు పనులు పూర్తి చేయాలన్నారు. వేల సంఖ్యలో వచ్చే భక్తుల కోసం మరుగుదొడ్లు, మంచినీరు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. శివరాత్రి నుంచి ఉగాది వరకు భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని తదనుగుణంగా వసతులు సమకూర్చాలన్నారు. 13న ఉత్సవాలు ప్రారంభమై 15వ తేదీన రాత్రి ప్రభబండ్లు తిరుగుతాయని, 17న మహాసంప్రోక్ష సమారాధన కార్యక్రమం జరుగుతుందన్నారు. 12వ తేదీ నుంచి శానిటేషన్ పనులు ముమ్మరం చేయాలని ఆదేశించారు. 100 బస్సులు నడపాలని, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

## ఎంపీ కవిత సహకారంతో ఇంటికి చేరిన మలేషియా బాధితులు

విజయక్రాంతి, ఆర్మూర్: నకిలీ ఏజెంట్‌ను నమ్మి మోసపోయిన మలేషియాలో చిక్కుకున్న ఐదుగురు బాధితులు నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత సహకారంతో ఇంటికి చేరినట్లు తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శి నవీనాచారి తెలిపారు. నందిపేట్ మండల కేంద్రంలో బుధవారం నాడు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెంట్ మోసం చేయడంతో బాధితులు మలేషియాలో చిక్కుకున్నారని, ఈ విషయాన్ని ఎంపీ కవితకు వివరించినట్లు తెలిపారు. దీంతో ఎంపీ కవిత మలేషియా అధికారులతో మాట్లాడి, వారికి విమాన చార్జీల నిమిత్తం 40వేల రూపాయలు ఒక్కొక్కరికి అందించినట్లు తెలిపారు. బాధితులు మాట్లాడుతూ ఏజెంట్ తమను మోసం చేశాడని తెలిపారు. ఈ విషయాన్ని జాగృతి సభ్యులకు వివరించామని, వారి సహాయంతో తాము స్వదేశానికి రావడానికి అవకాశం ఏర్పడిందని తెలిపారు. ఎంపీ కవితకు రుణపడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నేతలు మనోజ్, భూమేష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నిరాశ్రయులకు ఎమ్మెల్యే ఆరూరి ఆపన్నహస్తం

విజయక్రాంతి, వరంగల్ అర్బన్: వర్ధన్నపేట మండలం అంబేద్కర్ నగర్‌లో గ్యాస్ సిలిండర్లు పేలి రెండు ఇండ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. సమయానికి ఇళ్లల్లో ఎవరూ లేకపోవడంతో త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. అయినప్పటికీ రెండు ఇండ్లు పూర్తిగా దగ్ధమవ్వడంతో బాధితులు నిరాశ్రయులయ్యారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే ఆరూరి రమేష్ ఘటనా స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. ఘటనా వివరాలను తెలుసుకున్నారు. నిరాశ్రయులైన రెండు కుంటుబాలకు కనీస అవసరాల కోసం రూ.5 వేల తక్షణసాయాన్ని అందించారు. బాధిత కుటుంబ సభ్యులు బరిగెల సురేష్, బరిగెల నరేష్ కుటుంబాలకు క్వింటా బియ్యం, రూ.20వేల ఆర్థిక సాయం, దుస్తులు, దుప్పట్లు, నిత్యావసర వస్తువులు అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రభుత్వం తరుపున బాధిత కుటుంబాలను ఆదుకుంటామని అన్నారు. ఆశ్రయం కోల్పోయిన బాధితులకు తక్షణ అవసరాలను కల్పించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.

## పంచాయతీల్లో మెజార్టీ స్థానాలు కైవసం చేసుకోవాలి

- ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

విజయక్రాంతి, నర్సంపేట: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మెజార్టీ సర్పంచ్ స్థానాలు కైవసం చేసుకోవాలని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పిలుపునిచ్చారు. నర్సంపేట పట్టణంలోని సర్వాపురంలోని మున్సిపల్ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్ రెడ్డి ఇంటి వద్ద బుధవారం డివిజన్‌లోని ఆరు మండలాల క్లస్టర్ ఇన్‌చార్జులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 179 గ్రామ పంచాయతీలకు మూడు విడుతల్లో జరుగనున్న ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో టీఆర్ఎస్‌కు చెందిన వారే విజయం సాధించాలని కోరారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మెజార్టీ గ్రామాలకు చెందిన నాయకులపై పెద్ది ఆగ్రహం వ్యక్తం చేశారు. చెన్నారావుపేట మండల కోనాపురం, నర్సంపేట మండలం మాధన్నపేట గ్రామాల్లో మెజార్టీ తగ్గడ ం పట్ల అక్కడి నేతల తీరు మార్చుకొని వచ్చే సర్పంచ్ ఎన్నికల్లో రిజల్ట్ చూపించాలన్నారు. ఆయా యా గ్రామాల సర్పంచ్ అభ్యర్థుల ఎంపిక, గెలిపించే బాధ్యత క్లస్టర్ ఇన్‌చార్జులదేనని అన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ నాయకులు రాయిడి రవీందర్‌రెడ్డి, మునిగాల వెంకట్‌రెడ్డి, డాక్టర్ లెక్కల విద్యాసాగర్ రెడ్డి, నల్లా మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 100 ఫీట్ల రోడ్డు నిర్మాణాన్ని రద్దు చేయాలి

విజయక్రాంతి, నిజామాబాద్ అర్బన్: నిజామాబాద్ నగరంలో 2018లో ప్రతిపాదించిన 100 ఫీట్ల రోడ్డు నిర్మాణాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని అయా ప్రాంతాల్లో ఇండ్లను కట్టుకుని నివాసం ఉంటున్న బాధితుల సంఘం నాయకులు రాంమోహన్‌రావు, గోదావరిలు అవేదన వ్యక్తం చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 1974లో అప్పటి మాస్టర్‌ప్లాన్ ప్రకారం నగరంలోని వినాయక్ నగర్, గాయత్రి నగర్, రెడియోస్టేషన్ పక్కన, ఆనంద్ నగర్, సాయినగర్‌ల గుండా వర్ని రోడ్ వరకు 100 ఫీట్ల రోడ్డు వెయ్యాలని నిర్ణయించారని అన్నారు. దానిని బోధన్ రోడ్‌కు కలుపుతూ ప్రతిపాదనలు తయారు చేసినా దానిని ప్రజలకు ఎవ్వరికీ తెలియజేయలేదని పేర్కొన్నారు. మాస్టర్ ప్లాన్ విషయం తెలియక అయా ప్రాంతాలలో వందలమంది రూపాయి రూపాయి కూడబెట్టి లక్షల రూపాయలతో రియల్టర్‌లను నమ్మి భూములను కొనుక్కుని అక్కడ నివాస భవనాలను కట్టుకుని మోసపోయారని అన్నారు. మాస్టర్‌ప్లాన్‌లో రింగ్‌రోడ్ ఉంటే ఆ ప్రాంతాలలో అప్పటి అధికారులు భూముల రిజిస్ట్రేషన్‌లను బ్లాక్ చెయ్యలేదని, అదే విధంగా మాస్టర్‌ప్లాన్‌ను ప్రజలకు తెలియ చేప్పలేదని వాపోయారు. ఒక వర్గం వారు ఒత్తిడి తెచ్చి బోధన్ రోడ్డును వర్ని రోడ్‌ను కలిపే100 ఫీట్ల రోడ్డును రద్దు చేశారని వాపోయారు. కానీ మరికొందరు రియల్టర్‌ల ఒత్తిడి మేరకు నగరంలో 45 సంవత్సరాల నాటి మాస్టర్‌ప్లాన్ ప్రకారం మెజార్టీ ప్రజలు ఉండే ప్రాంతంలో 100 ఫీట్ల రోడ్డు నిర్మాణాన్ని కొత్తమాస్టర్ ప్లాన్‌లో పెట్టారని, దాని వలన వందలమంది ప్రజలకు ఆస్తి నష్టం సంభవిస్తుందని అన్నారు. నగర జనాభా పెరుగడం, నూడాగా అభివృద్ధి చెందిన నేపథ్యంలో ఔటర్ రింగ్‌రోడ్‌ను నిర్మించాలని, అప్పుడే ప్రజలకు రవాణాకు బాగుంటుందని అన్నారు. అదే కాక మళ్లీ పాత మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్డు నిర్మిస్తే అడ్డుకుంటామని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బాధితులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

విజయక్రాంతి, బోధన్: బోధన్ మండలం మందర్న ఇసుక క్వారీ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 13 ఇసుక ట్రాక్టర్లను బుధవారం నాడు అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. అనుమతులు లేకుండా దొంగతనంగా ఇసుక తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో 40 మంది రెవెన్యూ, పోలీసు బృందంతో దాడి జరిపిన అధికారులు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి రెవిన్యూ కార్యాలయానికి తరలించారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యక్రమాలకు ఉన్న అవసరాల దృష్ట్యా ప్రతి వారంలో రెండు రోజులు అనుమతులు ఇస్తున్నా, అక్రమ డబ్బు సంపాదనకై ఇలాంటి చర్యలకు పాల్పడుతూ అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎంఆర్వో రామకృష్ణ తెలిపారు. ఇక నుంచి ఇసుకను తరలించే ప్రధాన కూడళ్ల వద్ద పికెట్‌లు ఏర్పాటు చేసి ఇలాంటి చర్యలు జరగకుండా చూసి ఇసుక మాఫియాను కట్టడి చేస్తామని రెవిన్యూ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లాను మొదటి స్థానంలో నిలపాలి

విజయక్రాంతి, నాగర్‌కర్నూల్: విద్యాపరంగా రాష్ట్రంలో నాగర్‌కర్నూల్ జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని డీఈవో సహదేవుడు కోరారు. బుధవారం నాడు జిల్లా కేంద్రంలోని ఆయన కార్యాలయంలో సిబ్బందితో కలిసి నూతన సంవత్సర కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలోని ఉపాధ్యాయులకు సంబంధించిన ఎలాంటి ఫైళ్లను పెండింగ్‌లో లేకుండా త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. 10వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం సాధించి జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు అంకితభావంతో పనిచేసి జిల్లాకు మంచిపేరు తీసుకరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, ఖాజాఫకీర్ బేగ్, అకౌంట్ అధికారి వరప్రసాద్, పర్యవేక్షకులు మురళికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## జేసీని కలిసిన జిల్లా రైస్ మిల్లర్స్

విజయక్రాంతి, నర్సంపేట: వరంగల్ రూరల్ జిల్లా జాయింట్ కలెక్టర్ మహేందర్ రెడ్డిని జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శింగిరికొండ మాధవ శంకర్ కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.బుధవారం జేసి కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ మహేందర్ రెడ్డిని కలిసి పుష్ప గుచ్చం అందించిన అనంతరం మిల్లర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను జేసి దృష్టికి తెచ్చారు.

# పల్లెల్లో పేరుకుపోయిన సమస్యలు

- ఎన్నికల్లో ఎదురుకానున్న అడ్డంకులు
- పావులు కదుపుతున్న నాయకులు



విజయక్రాంతి, వరంగల్: పల్లెల్లో తిష్టవేసిన సమస్యలు గ్రామ పంచాయతీ ఎన్నికల వేళ పెద్ద పరీక్షగా నిలువనున్నాయి. ఇటీవల ముగిసిన శాసనసభ ఎన్నికల్లో సంక్షేమ ఫలాలు ఫలితాలిచ్చినప్పటికీ పంచాయతీ ఎన్నికల్లో స్థానికంగా నెలకొన్న సమస్యలు ప్రధానాంశంగా మారనున్నాయనే ఆందోళనలో ఉన్నారు. పార్టీ ఏదైనా ఇంతకాలం గ్రామపంచాయతీ సర్పంచ్‌లుగా బాధ్యతలు నిర్వహించిన వారికి ఈ పరిస్థితి నిద్రపట్టనీయడం లేదు. ప్రస్తుతం గ్రామాల్లో స్పెషల్ ఆఫీసర్ల పాలన కొనసాగుతున్నప్పటికీ దీనికి ముందు అధికారం చెలాయించిన సర్పంచ్‌లు గ్రామాల్లో పెద్దగా చేసిందేమీలేక పోవడం ఈ ఆందోళనకు ప్రధాన కారణంగా చెబుతున్నారు. ఇందులో అధికార టీఆర్ఎస్ పక్షానికి చెందిన సర్పంచ్‌లకు మరింత అడ్డంకిగా మారిన నేపథ్యంలో ఈ సమస్య నుంచి గట్టెంక్కేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. ఆసరా పెన్షన్‌ల లబ్దిదారులు, సంక్షేమ పథకాలపైన్నే మరోసారి అధికార పక్షం ఆశతో ఉండగా విపక్షాలు మాత్రం సమస్యలను లేవనెత్తేందుకు మరోసారి దీన్ని అవకాశంగా భావిస్తున్నారు.

### పల్లెల్లో ప్రాథమిక వసతుల కొరత

ప్రధానంగా గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలతో పాటు పారిశుధ్య సమస్య తీవ్రంగా వేధిస్తోంది. గ్రామ జ్యోతి లాంటి పథకాలు అర్భాటంగా ప్రవేశపెట్టినప్పటికీ తదుపరి తగిన శ్రద్ధ లేక పోవడంతో అమలుకు నోచుకోలేదు. మొన్నటి ఎన్నికల్లో వీటిపై పలు చోట్ల నిలదీసిన సంఘటనలు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. డోర్నకల్, మహబూబాబాద్, జనగామ, పరకాల, వర్ధన్నపేట ప్రాంతాల్లో ఈ సమస్యపై ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రశ్నించారు. తాము అధికారంలోకి వస్తే ఈ సమస్యలు పరిష్కరిస్తామంటూ తాత్కాలికంగా బయటపడినప్పటికీ ఇప్పుడు మరోసారి ఈ సమస్య వారికి ఎదురుకానున్నది. గత ఐదేళ్ళకాలంలో గ్రామాల్లో పెద్దగా అభివృద్ధి సాగలేదని అధికారపక్ష సర్పంచ్‌లే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ స్థితిలో తిరిగి ఎలా పోటీ చేయాలనే ఆందోళనలో ఉన్నారు. ముఖ్యంగా నిధుల కొరత కారణంగా ఏమి చేయలేక పోయామనే ఆవేదనలో ఉన్నారు. మిషన్ భగిరథ పథకం ఇంకా పూర్తికానందున పల్లెల్లో మంచినీటి సమస్య ఇంకా తీవ్రంగానే ఉంది. గతంలో చేపట్టిన అభివృద్ధి పనులు ఇంకా పూర్తికాలేదు. కొన్ని గ్రామాల్లో పనులు కొనసాగుతూనే ఉన్నాయి. అయితే దీని నుంచి బయటపడేందుకు మరోసారి తమ నియోజకవర్గంలో అధికార పక్ష ఎమ్మెల్యే అండగా నిధులు తీసుకొస్తామనే హామీలు ఇప్పటికే ప్రారంభించారు.

### కొత్త ఎమ్మెల్యేలకు పరీక్ష

పైకి పంచాయతీ ఎన్నికలైనప్పటికీ తమ నియోజకవర్గంలో పట్టు సడలకుండా ఉండేందుకు గెలిచిన ఎమ్మెల్యేలు మరోసారి ఎన్నికల కసరత్తును ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏ పంచాయతీ, వార్డు ఏ సామాజిక వర్గానికి కేటాయించారనే రిజర్వేషన్లు ఖరారైనందున ఆశావహులెవరూ... పోటీ లేకుండా విజయం సాధించేందుకు అప్పుడే ప్రణాళికలు రచిస్తున్నారు. ఇందులో అధికార టీఆర్ఎస్ పక్షం ముందు వరుసలో ఉంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలిచిన భూపాల్‌పల్లి, ములుగుల్లో తిరిగి తమ పట్టు నిలబెట్టుకునేందుకు యత్నిస్తున్నారు. ఓడిపోయిన ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గంలో రాజకీయంగా తమ పట్టును కాపాడుకునేందుకు పంచాయతీ ఎన్నికలను ఒక అవకాశంగా భావించి ఇప్పుడిప్పుడే ఓటమి నుంచి కోలుకుని తమ ప్రయత్నాలు ప్రారంభించారు. దీంతో అప్పుడే పల్లెల్లో మరోసారి ఎన్నికల వాతావరణం క్రమంగా పెరుగుతోంది. స్థానిక ఎన్నికలు కావడంతో పార్టీతో పాటు ఆయా వ్యక్తుల పలుకుబడి, స్థానికంగా సామాజిక వర్గాలు, బలాబలాల ఫలితాలపై ప్రభావం కనబరిచే అవకాశం ఉన్నందున ఎవరికి వారు తమ పట్టును పెంచుకునే యత్నాలు సాగుతున్నాయి. అన్ని పక్షాల నాయకులు తమదైన పద్ధతిలో తమ పార్టీతో పాటు సర్పంచ్‌ల సంఖ్య ఎక్కువగా ఉండే విధంగా ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

## ప్రజామోదం ఉన్న వ్యక్తులకు ప్రాధాన్యం

- ఎమ్మెల్యే నిరంజన్‌రెడ్డి



విజయక్రాంతి, వనపర్తి: పంచాయతీ ఎన్నికల్లో ప్రజామోదం ఉన్న వ్యక్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని వనపర్తి ఎమ్మెల్యే సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. బుధవారం వనపర్తి పట్టణంలోని తన నివాసం గృహంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యక్తిగత ప్రతిష్టగా తీసుకుని గ్రామాల్లో వాతావరణాన్ని కలుషితం చేయవద్దన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం అందరినీ కలుపుకుని ముందుకు పోవాలని చెప్పారు. పార్టీల వారీగా గ్రామాలను విడదీసి వర్గాలు పెంచి పోషించే సంస్కృతికి అడ్డుకట్ట వేద్దామన్నారు. గ్రామాల ప్రజలతో చర్చించి ఎక్కువ మంది ప్రజలు చూసించిన వ్యక్తులకు ప్రజా ప్రతినిధులుగా అవకాశం ఇచ్చి వీలైనంత వరకు ఎన్నికలు జరుగకుండా ఏకగ్రీవానికి ప్రయత్నించాలన్నారు. అనివార్య పరిస్థితుల్లో ఎన్నికలకు వెళ్ళాల్సి వస్తే ప్రజలకు సమస్యలను వివరించి వారి మద్దతు పొందే ప్రయత్నం చేయాలన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తారో వారిని సర్పంచ్‌లుగా గెలిపించాలని కోరారు. పార్టీలో ఎవరూ సంస్థాగత ఎన్నికలను వ్యక్తి గతంగా తీసుకోవద్దని ఆయన చూసించారు. ముఖ్య నేతలు గ్రామాల వారీగా ఎక్కువ మంది ప్రజలను కలసి చర్చించాలన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పార్టీలో ఉన్న నేతలు అంతా ఒక తాటి మీద ఉండి ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆయన ముఖ్య నేతలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వనపర్తి నియోజక వర్గ టీఆర్ఎస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఎన్నికల తేదీ మార్చాలి

విజయక్రాంతి, జోగుళాంబ గద్వాల: ఎన్నికల విధుల్లో ఉపాధ్యాయులు పాల్గొంటున్నారని, ఈ నెల 25వ తేదీన ఎన్నికలు జరిగితే 26వ తేదీ రిపబ్లిక్ డేలో ఎలా పాల్గొంటారని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ తిమ్మారెడ్డిలు ప్రశ్నించారు. 25 రాత్రి వరకు ఎన్నికల ముగింపు ఉంటుందని, 26వ తేదీ ఉదయమే జెండా ఏర్పాట్లు చేయడం ఇబ్బందిగా ఉంటుందన్నారు. అందువల్ల 25వ తేదీకి బదులుగా 28వ తేదీకి ఎన్నికలను మార్చాలని సంఘం నాయకులు డిమాండ్ చేశారు.

## ఎలక్టోరల్ జాబితాను సిద్ధం చేసుకోండి

విజయక్రాంతి, జోగుళాంబ గద్వాల: పంచాయతీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ముందుగా ఎలక్టోరల్ జాబితాను గ్రామ పంచాయతీ, వార్డుల వారీగా సిద్ధం చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ సాంకేతిక మేనేజర్ విష్ణుప్రసాద్ పంచాయతీ అధికారులను ఆదేశించారు. బుధవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 30 డిసెంబర్ 2018 వరకు ఓటరు జాబితాను సవరించడం జరిగిందని, ఆ జాబితాను కూడా సిద్ధం చేసుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ నిరంజన్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటికే పంచాయతీ, వార్డుల వారీగా జాబితాను రూపొందించడం జరిగిందన్నారు. మొదటి విడతకు 2310 మంది సిబ్బంది అవసరంగా కాగా ప్రస్తుతం 1805 మంది సిద్ధంగా ఉన్నారన్నారు. మిగతా సిబ్బందిని త్వరలోనే సమకూర్చుకుంటామన్నారు. ముఖ్యంగా మూడు విడతల్లో ఎన్నికలు జరుగుతున్నాయని 21న గద్వాల, ధరూరు, గట్టు, కేటీదొడ్డి మండలాలకు, 25న అయిజ, మల్దకల్, రాజోళి, వడ్డేపల్లి మండలాలకు, 30న అలంపూర్, ఉండవెల్లి, మానవపాడు, ఇటిక్యాల మండలాల్లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

## ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలి

విజయక్రాంతి, జనగామ: తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ (ట్రెస్సా) నాయకులు బుధవారం జిల్లా పరిపాలనాధికారి టి.వినయ్ కృష్ణారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ట్రెస్సా నాయకులు కలెక్టర్‌కు పుష్ప గుచ్చం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు, రైతులకు సేవలందించాలన్నారు. అనంతరం 2019 డైరీ, నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జేసీ మధు, ట్రెస్సా జనగామ అధ్యక్షుడు బాశెట్టి హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## నత్తనడకన ఎస్ఎల్‌బీసీ పనులు



- విశ్రాంత ఇంజనీర్ల బృందం పరిశీలన

విజయక్రాంతి, అచ్చంపేట: అమ్రాబాద్ మండల పరిధిలోని శ్రీశైలం కృష్ణా జలాశయాలను నల్గొండ జిల్లాలోని ఫ్లోరైడ్‌ను రూపుమాపేందుకు సాగు, తాగు నీరు అందించే ఉద్దేశంతో చేపట్టిన శ్రీశైలం లెఫ్ట్ బ్యాక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) పనులు నత్తనడకన సాగుతున్నాయి. స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఈ పథకాన్ని రూపొందించారు. ఫేస్–1 పనులను 2005లో రూపొందించి 2015 కల్లా పూర్తి చేయాలని రూ. 3940 కోట్ల వ్యయంతో ప్రారంభించినప్పటికీ, కొన్ని కారణాల మూలంగా గత నాలుగు సంవత్సరాలుగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ సొరంగం పనులను ప్రస్తుత ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆదేశాల మేరకు విశ్రాంత ఇంజనీర్ల బృందం వ్యాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పరిశీలించారు. కాగా ఇక్కడ పనులను సందర్శించి, పనుల అలసత్వంపై సీఎంకు నివేదిక సమర్పించేందుకు కారణాలను తెలుసుకున్నారు. మొత్తం 43 కి.మీ, మేర అధునాతన మిషన్‌లతో పనులు జరుగుతున్నప్పటికీ, దోమల పెంట నుంచి 13.7కి.మీ మేర పనులు జరిగినట్లు, మన్యవారిపల్లి వద్ద 19 కి.మీ. మేర తవ్వకాలు జరిగినట్లు తెలిపారు. ఇప్పటికే దాదాపు 14 వందల కోట్లు ఖర్చుయినా పనులు జరగకపోవడం కొంత మేర భాధాకరం అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

కాగా ప్రస్తుతం ప్రతి రోజూ పనిలో ఒక నిమిషానికి 9640 లీటర్ల నీటిని సొరంగం నుంచి మోటర్ల ద్వారా తోడుతున్నట్లు కాంట్రాక్టర్లు తెలిపారు. రాబోయే ఐదేళ్ళలోనైనా ఈ ప్రాజెక్టు పనులు పూర్తవుతాయేమో వేచి చూడాలి.

# టిఫిన్ సెంటర్‌లు.. అపరిశుభ్రతకు నిలయాలు

- రోడ్లపైనే టిఫిన్‌లు
- రోగాల బారిన ప్రజలు
- చోద్యం చూస్తున్న మున్సిపాలిటీ అధికారులు



విజయక్రాంతి, నర్సంపేట: ఉదయం వేడి వేడి టిఫిన్ చేయాలనుకుంటున్నారా...అయితే జర జాగ్రత్త...అపరిశుభ్రతకు నిలయాలు గా ఉన్న టిఫిన్ సెంటర్‌ల వద్ద టిఫిన్ తిని లేని రోగాలు తెచ్చుకోకండి. నర్సంపేట పట్టణంలోని టిఫిన్ సెంటర్‌ల పరిస్థితి ఇది. వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని మున్సిపాలిటీ పరిధిలో అనుమతి లేని టిఫిన్ సెంటర్‌లు పుట్టగొడుగుల్లా వందలాది పుట్టుకు వచ్చాయి. సుమారు ముప్పై వేల జనాభా పైచిలుకు ఉన్న నర్సంపేట పట్టణంలో స్థానికులు, ఇతర మండలాల నుంచి వచ్చే ప్రజలు ఉదయం అల్పాహారం తీసుకుంటుంటారు. పట్టణంలో పలు ప్రధాన సెంటర్‌లలో వంద వరకు టిఫిన్ సెంటర్‌లు నడుపుతున్నారు. ఈ వ్యాపారం చేసుకొని నాలుగు రాళ్లు సంపాదించుకునే నిర్వాహకులకు ఇది లాభదాయకంగానే ఉంది. కానీ ఇక్కడ టిఫిన్ తినే ప్రజలకు మాత్రం అనారోగ్యం తప్పడం లేదు. శుభ్రత పాటించక పోవడమే ఇందుకు కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రధాన టిఫిన్ సెంటర్‌ల వద్ద అధ్వాన్నంగా పరిసరాలు ఉన్నాయి. ఈగలు, దోమలు వాలిన టిఫిన్ చేయడం వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ డాక్టర్ భరత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. టిఫిన్ సెంటర్ల పక్కన మురికి కాల్వలు, పందులు తిరుగుతున్నాయని, కనీస శుభ్రత పాటించడం లేదని ఆయన తెలిపారు. రూరల్ జిల్లాలోనే ప్రధాన పట్టణంగా ఉన్న నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలో పరిస్థితి ఇంత అధ్వాన్నంగా ఉన్నా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తనట్లుగా వ్యవహరించడం పట్ల భరత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. టిఫిన్ పది రుపాయలు ఎక్కువగా తీసుకున్నా ఫర్వాలేదు కాని, ప్రజలకు శుభ్రమైన వాతావరణంలో టిఫిన్ పెడితే బాగుంటుందని ఆయన సూచించారు.



## పంచాయతీ రిజర్వేషన్లలో బీసీలకు దక్కేది 18.5 శాతమే

- టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం

విజయక్రాంతి, నిజామాబాద్ అర్బన్: తెలంగాణ ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకున్న బీసీల రిజర్వేషన్ల తగ్గింపు నిర్ణయం సరికాదని, దాని వలన అసలు వారికి దక్కేది 18.5 శాతం మాత్రమేనని తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. బుధవారం నగరంలోని తెజస కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లను అమలు చెయ్యడం వలన గ్రామాల్లో స్వపరిపాలనకు ఆస్కారం ఏర్పడిందని పేర్కొన్నారు. కోర్టు తీర్పును పరిగణలోకి తీసుకుని స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీల రిజర్వేషన్లను 22.9 శాతంగా ఏ విధంగా ప్రకటించారనడానికి సరైన కారణాలు చూపడం లేదన్నారు. రాష్ట్రంలో విద్యా, ఉద్యోగాలలో బీసీలకు ఉన్న రిజర్వేషన్లు 25 శాతమని, కానీ ఎన్నికలకు 22 శాతం ఏవిధంగా ఇచ్చిందని, వాస్తవంగా మొత్తంగా బడుగు బలహీన వర్గాలకు కేటాయించింది 18.5 శాతం మాత్రమే అని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికలలో కోర్టు తీర్పులు ఉన్నప్పటికీ నాటి ప్రభుత్వాలు 34 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తే నేటి కేసీఆర్ సర్కార్ తొందరపాటు చర్యగా ఆర్డినెన్స్ తేవడం వలన బీసీలకు గ్రామపంచాయతీ ఎన్నికలలో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ప్రభుత్వ ఆర్డినెన్స్ వలన గ్రామాలలో బీసీల రిజర్వేషన్లు గతంతో పోలిస్తే సగానికి సగం పడిపోయయన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలలో బీసీల రిజర్వేషన్లను ప్రభుత్వం పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తీరు బీసీల రిజర్వేషన్లను అడ్డుకునే విధంగా ఉన్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో గ్రామ పంచాయతీలు నిర్వీర్యమయ్యాయని, రాష్ట్రప్రభుత్వం నిధులు ఏమీ ఇవ్వలేదని కేవలం కేంద్రం నుంచి వచ్చే ప్రణాళికాపరమైన నిధులు వచ్చాయని అన్నారు. గ్రామపంచాయతీలకు రాజ్యాంగం ప్రకారం ఇచ్చిన విధులను నిర్వహించే విధంగా నిధులను ఇవ్వాలని కోరారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలని కోరారు. గ్రామాల అభివృద్ధికి పాటుపడేవారిని ఎన్నుకుందామని అప్పుడే గ్రామస్వరాజ్యం సాధ్యమౌతుందని కోదండరాం అన్నారు.

### ఈవీఎంలపై ఎన్నికల కమిషన్ స్పందన సరిగ్గా లేదు

ఇటివల రాష్ట్రంలో జరిగిన శాసనసభ ఎన్నికలలో ఈవీఎంలపై ప్రజల్లో అనుమానాలు ఉన్నాయని, వారి సందేహాలను నివృత్తి చెయ్యడంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్పందన బాగాలేదని ఆచార్య కోదండరాం అన్నారు. రాష్ట్రంలో 31 నియోజకవర్గాల్లో జరిగిన పోలింగ్ శాతానికి ఓట్ల లెక్కింపులో తేడాలు ఉండటంతో ప్రజల్లో ఈవీఎంలపై అనుమానాలు ఉన్నాయని అన్నారు. బ్యాలెట్ కంటే మెరుగైన ఎలాక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలతో ఎన్నికలు జరిగినప్పుడు ఒక్క ఓటు కూడా తేడా రావాడానికి వీలు లేదని అన్నారు. ఈ వ్యవహారాన్ని తెలంగాణ జనసమితి పార్టీ తరుపున కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశామన్నారు. ఎక్కడికక్కడ ఎన్నికలలో పోటీచేసిన అభ్యర్థులు కూడా న్యాయపోరాటానికి సిద్ధమయ్యారని అన్నారు. పంచాయతీ ఎన్నికలు పార్టీ రహితంగా జరుగుతాయని అందువలన తెలంగాణ జనసమితి పార్టీ ఒంటరిగానే పోటీచేస్తుందని అన్నారు. ఇప్పటికే చాలామంది సర్పంచ్‌లుగా పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారని, అందుకే జిల్లాల పర్యటనలు చేసి అందరినీ సమన్వయం చేస్తున్నామని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో టీజేఎస్ ప్రధాన కార్యదర్శి గోపాల్‌శర్మ, జిల్లా కన్వీనర్ అంబోజీ ప్రసాద్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ జనసమితి అనుబంధ విభాగాలకు పలువురు కన్వీనర్‌లు, జిల్లా, మండల స్థాయి నాయకులకు నియమాకపత్రాలను అందజేశారు.

## మట్టి పాత్రలు ఉపయోగించి ఆరోగ్యంగా జీవించండి



- కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య
- మట్టి పాత్రల తయారీ నైపుణ్య శిక్షణా తరగతులు

విజయక్రాంతి, మహబూబాబాద్: లోహపు ప్రాతల కంటే మట్టి పాత్రలు మేలని, అందరూ మట్టి పాత్రలను ఉపయోగించుకొని ఆరోగ్యంగా జీవించాలని, కుల వృత్తులకు పూర్వ వైభవం రావాలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య అన్నారు. బుధవారం స్థానిక ముదిరాజ్ భవన్‌లో జిల్లా వెనుకబడిన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని కుమ్మరి, శాలివాహన చేతి వృత్తుల వారికి వివిధ రకాల మట్టి పాత్రల తయారీపై నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణా శిబిరంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వస్తువు యంత్రంతో తయారై, కలుషితమైన వాతావరణం ఏర్పడి ఆరోగ్య సంబంధిత వ్యాధులు సంక్రమిస్తున్నందున ప్రజలు సాంప్రదాయ పద్ధతుల ద్వారా చేయబడిన మట్టి పాత్రలు వాడడం ఉత్తమమని, ఆరోగ్యకరమని తెలిపారు. ఈ శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని వినూత్నంగా ఆలోచించి కొత్తదనంతో మట్టి పాత్రలను తయారు చేయడంతో పాటు మరింత మెళకువలు నేర్చుకొని సరైన మార్కెటింగ్ చేస్తే డిమాండ్ పెరిగి గిట్టుబాటు ధర లభిస్తుందని అన్నారు. ప్లాస్టిక్ రసాయనాల వల్ల కలుగుతున్న వ్యాధులు, సాంప్రదాయక మట్టి, రాగి పాత్రలను వాడుకోవడం వలన అరికట్ట వచ్చని సూచించారు. మూడు రోజుల పాటు 30 మంది శాలివాహనులు శిక్షణ పొంది కొత్తదనంతో మట్టి పాత్రల తయారీకి ముందుకు వస్తే జిల్లా యంత్రాంగం సహకారం అందిస్తుందని కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన అభివృద్ధి శాఖ అధికారి కె.లక్ష్మణాచారి, సహాయ అధికారిణి ఇందిరాదేవి, శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.

## చెక్‌పోస్టులో చేయి తడపందే వాహనం కదలదు

విజయక్రాంతి, జుక్కల్: మద్నూర్ మండలంలోని సరిహద్దు ఆర్‌టీవో చెక్‌పోస్ట్ వద్ద అవినీతి అధికారుల బాగోతం రోజురోజుకూ మరింత పెరిగిపోతోంది. ప్రతి వాహనానికి ఎంతో కొంత మూట ఇవ్వాల్సిందే. ఇక్కడ అవినీతిపై గతంలో జిల్లా అధికారులు తీవ్ర స్థాయిలో స్పందించి సీసీ కెమెరాలు సైతం ఏర్పాటు చేసారు. కానీ అవి ప్రస్తుతం పనిచేయక పోవడం గమనార్హం. ఇక అధికారుల లీలలు అనేకం. ఒకానొక అధికారి తమకు డబ్బులు వసూలు చేసి ఇవ్వడానికి ప్రైవేట్ ఏజెంట్లను నియమించుకోడం విశేషం. ప్రతి రోజూ వేలసంఖ్యలో వాహనాల ఈ రహదారిపై నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో అధికారుల సంపాదన మూడు పువ్వులు ఆరు కాయలుగా మారింది. ఒక్కో రోజు వీరి అక్రమ సంపాదన లక్షల్లో ఉంటుందని అక్కడ పనిచేసే ప్రతి వ్యక్తి చెప్పుకుంటారు. నెల వారీ జీత భత్యాలకు సంబంధం లేకుండా సంపాదన కొనసాగుతున్నది. మరి వీరికి ఇక్కడ పోస్టింగ్ కావాలంటే వీరు కూడా పెద్ద మొత్తంలో ఖర్చులు పెట్టి వస్తారట. అందుకేనేమో వీరు పెట్టిన నగదు తిరిగి రాబట్టుకునేందుకు చెక్‌పోస్టులను ఎంచుకుంటున్నారు. గతంలో అనేక సార్లు ఉన్నతాధికారుల దాడులు జరిగాయి, చర్యలు కూడా జరిగాయి. కానీ ఇక్కడ తీరు మాత్రం మారడం లేదు. తెలంగాణ ప్రభుత్వం సరిహద్దు ప్రాంత చెక్ పోస్ట్‌లపై కూడా శ్రద్ధ కనబరిస్తే ప్రభుత్వ ఆదాయాలకు గండి పడకుండా కాపాడుకోవచ్చు.

## మెరుగైన వైద్య సేవలు అందించాలి

**విజయక్రాంతి, వికారాబాద్:** ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్ మెతుకు ఆనంద్ వైద్యులకు సూచించారు. బుధవారం మోమిన్‌పేట్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడున్న రోగులతో మాట్లాడి, మందుల నిల్వలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఎక్కువ శాతం ఎలాంటి రోగులు ఆసుపత్రికి వస్తారని, మరింత మెరుగైన వైద్యం కోసం రోగులను ఎక్కడకు రిఫర్ చేస్తారని అక్కడున్న వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది వచ్చే పని వేళల పై ఆరా తీశారు. ఆసుపత్రికి కావాల్సిన పరికరాలు, సదుపాయాల కొరత ఉంటే నివేదిక ఇవ్వాలని, త్వరలోనే ప్రభుత్వం నుంచి మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వాసుపత్రికి మంచి పేరు తీసుకురావాలన్నారు.

## కేటీఆర్‌కు శుభాకాంక్షలు



**విజయక్రాంతి,పరిగి:** టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావును బుధవారం పరిగి నియోజకవర్గ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పరిగి నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు. పరిగి నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని కేటీఆర్‌ను కోరారు. దీనికి కేటీఆర్ సానుకూలంగా స్పందించారు.

## రోగి వివరాలు నమోదు చేయాలి

**విజయక్రాంతి, ఉట్నూర్:** పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ అధికారి కృష్ణ ఆదిత్య వైద్యులను ఆదేశించారు. బుధవారం పీవో క్యాంపు సమావేశంలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆదిలాబాద్, ఉట్నూర్ డివిజన్ స్థాయి సమావేశంలో పీహెచ్‌సీ, ఉప కేంద్రాల వారిగా సమీక్షించారు. ఆస్పత్రుల్లోని రోగులకు అందుతున్న వైద్య సేవలపై చర్చించారు. ఖచ్చితంగా ప్రతి రోగికి సంబంధించిన వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఆసుపత్రిలోని ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు పై అధికారులకు తెలియజేయాలన్నారు. దీంతో పాటు ల్యాబ్‌లోని పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కొన్ని ఏరియాలలోని ఆస్పత్రులకు హై రిస్క్ కేసులు వస్తుంటాయని దీనిపై సత్వరమే స్పందించి మెరుగైన వైద్యం అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటి డిఎం అండ్ హెచ్‌వోలు వసంత్‌రావ్, సాధన, సునీల్‌రావ్, సరిత, సూపర్‌వైజర్‌లు, ఎఎన్‌ఎంలు ఉన్నారు.

## ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలు

**విజయక్రాంతి, నిర్మల్:** మార్చి 16 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షలను దృష్టిలో ఉంచుకోని విద్యార్థులు పక్కా ప్రణాళిక ప్రకారం చదివితే మంచి మార్కులు సాధ్యమవుతుందని సబ్జెక్టు నిపుణులు పేర్కొంటున్నారు. పరీక్షలు అనగానే చాలా మంది విద్యార్థుల్లో ఏదో తెలియని గుబులు మొదలవుతుంది. మొదట భయాన్ని వదిలించుకొని ప్రశాంతంగా చదవాలని సూచిస్తున్నారు. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా నాలుగు జిల్లాలోని విద్యాధికారులు ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించారు. ఇందులో భాగంగా డిసెంబర్ నెల రెండో వారం నుండి అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 9.30 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు ఆయా సబ్జెక్టులపైన ఉన్న అనుమానాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు. ప్రధానంగా సీక్రెట్ ఉన్న విద్యార్థులను ప్రత్యేక బృందాలుగా చేసి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆయా సబ్జెక్టులకు ఎలాంటి సిద్ధం కావాలి అనే విషయాలపై విద్యార్థులకు సూచనలు చేస్తున్నారు.

## 20న అంబేడ్కర్ మెమోరియల్ అసోసియేషన్ ఎన్నికలు

**విజయక్రాంతి, ఆదిలాబాద్:** డా.బి.ఆర్ అంబేడ్కర్ మెమోరియల్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ ఎన్నికలను ఈ నెల 20వ తేదీన కైలాస్‌నగర్ అశోకా బుద్ధవిహార్‌లో నిర్వహించనున్నట్లు ఆ సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు బాబు గజ్‌బారే తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సంఘ బాధ్యులతో కలిసి మాట్లాడారు. ప్రస్తుత కార్యవర్గ కాల పరిమితి ముగిసినందున నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నామన్నారు. సభ్యులు ఈ విషయాన్ని గుర్తించి అధికసంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సంఘం నేతలు అనిల్‌సాద్వే, మస్కే రాజు, దయానంద్‌నర్వాడే, రత్నజాడే ప్రజ్ఞాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారులకు శిక్షణ

**విజయక్రాంతి, బోథ్:** గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు విడతలుగా నిర్వహిస్తున్న ఎన్నికలకు సంబంధించిన అధికారులకు మండల ప్రజా పరిషత్ ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. బుధవారం మండలకేంద్రంలోని స్థానిక మార్కెట్ కమిటీ ఆవరణలో ఎన్నికల్లో విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో బి అప్పారావు, విద్యాధికారి గణపతి పాల్గొన్నారు.

## మహిళ ఆత్మహత్య

**విజయక్రాంతి, నిర్మల్:** జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలో గల బాలాజీ అపార్టుమెంట్‌పై నుండి పడి సోనికా రెడ్డి (31) అనే మహిళ మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. అపార్టుమెంట్‌లో నివాసముంటున్న సోనికారెడ్డికి గతంలో వివాహమై విడాకులు తీసుకుంది. కుటుంబ సమస్యల కారణంగా ఆత్మహత్య చేసుకొని ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఏరియా దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

# పంచాయతీలో అతివలకు అందలం

- బ్యాలెట్ పేపర్‌లో నోటా
- జనాభా ప్రాతిపదికన ఎన్నికల ఖర్చు
- మూడు జిల్లాల్లో మొత్తం 1615 పంచాయతీలు




**విజయక్రాంతి, సంగారెడ్డి:** ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ముహూర్తం రానే వచ్చింది. గ్రామ పంచాయితీ ఎన్నికల నోటీఫీకేషన్ జారీ నేపథ్యంలో పల్లెల్లో పంచాయతీ సంబురాలు షురూ అయ్యాయి. మూడు విడతల్లో జరుపనున్న పల్లె పోరులో పోరుబాటలో హేమాహేమీలు రంగంలోకి దిగనున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ కేటగిరీలుగా అన్ని వర్గాల ప్రజలకు ఎవరికి ఎంత శాతమో రిజర్వేషన్లు ముందే ఖరారు కాగా, ఇంకా కొంత వ్యవహారం సద్దుమణిగేది ఉన్నట్లు ఎన్నికల అధికారులు పేర్కొంటున్నారు. రాష్ట్రంలో 12,732 గ్రామ పంచాయితీలు... 1,13,170 వార్డుల్లో ఓటర్లు ఈ ఎన్నికల్లో పాల్గొని తమ ప్రజాప్రతినిధులను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల నిర్వాహణకు రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1,13,190 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగగా... పోలింగ్ అనంతరం అదే రోజు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ముగించి.. ఫలితాలు సైతం వెల్లడవనున్నాయి.

**మూడు విడతలుగా:** తొలి విడతలో 4480 గ్రామ పంచాయితీలకు, రెండో విడతలో 4137 పంచాయితీలకు, మూడో విడతలో 4115 గ్రామ పంచాయితీలకు పోలింగ్ జరుగనుంది. ఇక ఎన్నికల ఖర్చు విషయంలో జనాభాప్రాతిపదికన ఖర్చుకు పరిమితి విధించింది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ 5వేల జనాభా దాటిన పంచాయతీలు అయితే అభ్యర్థులు 2,50,000 మించి ఖర్చు చేయరాదని, 5వేల కంటే తక్కువ జనాభా కలిగిన గ్రామ పంచాయతీలు అయితే అభ్యర్థుల ఖర్చును 1,50,000గా నిర్ణయించింది. పరిమితికి మించి ఖర్చు చేస్తే పదవి కోల్పోవాల్సి వస్తుందని రాష్ట్ర ఎన్నికల కమిషన్ హెచ్చరించింది.

**అందరి 'నోటా':** ఓటు హక్కు ఉందికదా అని ఎవరినో ఒకరిని ఎంచుకోవాలా? పోటి చేసే వారిలో తమకు ఎవరు ఇష్టం లేదు. ఎలా అనుకునే ఓటర్లకు నోటా గుర్తింపు ఇవ్వనున్నట్లు ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. 2018 శాసన సభ ఎన్నికల్లో నోటా గుర్తింపు కేంద్ర ఎన్నికల కమిషన్ ఎలా ఇచ్చిందో... రేపు జరిగే పంచాయతీ ఎన్నికల్లో నోటా గుర్తింపు ఇవ్వనుంది. ఈ ఎన్నికల బ్యాలెట్ పత్రాల్లో నోటా గుర్తు ఉంటుంది.

**మహిళల పాత్ర కీలకం:** రాష్ట్ర, దేశ రాజకీయాల్లో మహిళల పాత్ర ఎలా ఉన్నా పంచాయతీ ఎన్నికల్లో మాత్రం అతివల హవా పెరుగుతోంది. ప్రస్తుతం ఇంతక్రితం లాగా కాకుండా చట్ట బద్ధంగా మహిళలకు స్థానాలు రిజర్వు చేయడంతో ఇక వారి హవా కొనసాగనుంది.

**కుటుంబ సభ్యుల పెత్తనం వద్దు:** పదవుల్లో మహిళలు ఉన్నా.. తెరచాటున కుటుంబ సభ్యుల పెత్తనమే రాజ్యమేలుతున్న సంగతి తెలిసిందే. సతి పగ్గాలు పూర్తిగా పతి చేతుల్లో పెట్టుకొని ప్రత్యక్ష రాజకీయాలలో గిర్రున చక్రం తిప్పడం ప్రస్తుతం జరుగుతున్న తతంగమే. మహిళా రిజర్వేషన్‌ల సంఖ్య పెరగడంతో ప్రస్తుతం పెత్తనంలో మార్పు వస్తుందో? లేదో?ననే మరింత ఎక్కువ కానుందో? వేచి చూడాల్సిందే.

# సిద్దిపేట కల నేరవేరింది: ఎమ్మెల్యే హరీష్‌రావు

**విజయక్రాంతి, సిద్దిపేట:** ఉత్తమమైన విద్యార్థులను రేపటి తరానికి అందించి సిద్దిపేట కేంద్రీయ విద్యాలయం ఆదర్శంగా నిలవాలని మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రమైన సిద్దిపేటలోని ఎల్లంకి కళాశాల లో కేంద్రీయ విద్యాలయాన్ని కలెక్టర్ క్రిష్ణ భాస్కర్‌తో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట ప్రజలలో కేంద్రీయ విద్యాలయంపై అపారమైన నమ్మకముందని, ఆ దిశగా విద్యాబోధన అందించే బాధ్యత అధ్యాపకులదే అన్నారు. సిద్దిపేటకు కేంద్రీయ విద్యాలయం రావాలన్న తన కల నెరవేరిందని దశాబ్ద కాలంగా ప్రయత్నం చేయగా నేడు అది సాకారం అయింది అన్నారు. అందుకు ఎంపీ కొత్త ప్రభాకర్ కృషి మరువలేనిది అన్నారు. కేంద్రీయ విద్యాలయానికి శాశ్వత భవనంను సిద్దిపేట శివారులోని మెడికల్ కళాశాల సమీపంలో నిర్మిస్తామని తెలిపారు. ఈ విద్యాలయంలో చేరేందుకు భారీగా దరఖాస్తులు వచ్చాయని, పారదర్శకమైన అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగిందని తెలిపారు.

### పనులు వేగంగా పూర్తి చేయాలి



ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అసంపూర్తి పనులను తొందరగా పూర్తి చేయాలని హరీష్ రావు వైద్య శాఖ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. బుధవారం ఆయా నిర్మాణాలను ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటికే 70 శాతం పనులు పూర్తయ్యాయని టీఎస్ ఎంఎస్ఐడిసి ఎస్ఈ సురేందర్ రెడ్డి, ఈఈ ప్రకాష్, డీఈఈ విశ్వప్రసాద్‌లు ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ తమిళ అరసు, సూడా చైర్మన్ మారెడ్డి రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టణ ప్రాంత ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఇచ్చేలా ఆర్బన్, ఆక్సిజన్ పార్కులు రూపుదిద్దుకుంటున్నాయని హరీష్ రావు అన్నారు. పార్క్ పనులను ఆయన పరిశీలించారు. అన్ని రకాల ఏర్పాటుతో పార్కులు ఏర్పాటు చేస్తున్నామని ప్రజల జీవన స్థితిగతులు మార్చబోతున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ సిద్దిపేట రేంజ్ అధికారి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ పిలుపునకు అనూహ్య స్పందన



**విజయక్రాంతి, ఆదిలాబాద్:** నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని తనను కలిసేందుకు వచ్చే వారు పుష్పగుచ్ఛాలకు బదులుగా బ్లాంకెట్లు, దుప్పట్లు తీసుకురావాలనే జిల్లా కలెక్టర్ దివ్యదేవరాజన్ పిలుపునకు అనూహ్య స్పందన లభిస్తోంది.

కలెక్టర్ పిలుపు నకు అధికారులతో పాటు కుల, ప్రజా, వ్యాపార సంఘాలు వంటి అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా స్పందిస్తున్నారు. బుధవారం జిల్లా సంయుక్త కలెక్టర్ సంధ్యారాణీ, జిల్లా కలెక్టరేట్ ఉద్యోగులు, డీఎస్‌డీఓ, డీపీఓ, సీపీఓ, జిల్లా పరిశ్రమలశాఖ, గిరిజన సహకారసంస్థ, ఎక్సైజ్, రిమ్స్ ఇంజనీరింగ్, ఆత్మ కార్యాలయాల అధికారులు, ఉద్యోగులు, తాంసి తహసీల్దార్, జిల్లాకేంద్రంలోని శౌర్య, ఆహుజా ఫోటోస్టూడియోల యాజమానులు, అమ్మ భగవాన్ సేవా సమితి సభ్యులు, ఎస్సీ, ఎస్టీ ఆల్ ఆడియా రైట్స్ ప్రోటెక్షన్ సోసైటీ సభ్యు లు, మావల తహసీల్దార్ , రిటైర్ట్ సీనియర్ అసిస్టెంట్ భీంరావు, అగర్వాల్ యువ మంచ్, డ్యాన్స్ టీచర్ కవిత, పట్టణంలోని జిన్నింగ్ యాజమానులు జిల్లా కలెక్టర్‌ను తన కార్యాలయంలో కలిసి బ్లాంకెట్లు, దుప్పట్లను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు. జిల్లాలో చలితీవ్రత అధికంగా ఉన్నందున వాటిని నిరాశ్రయులు పేదలకు పంపిణీ చేయనున్నారు.

## విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

**విజయక్రాంతి, మంచిర్యాల:** విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఐసిడిఎస్ సిడిపివో లక్ష్మీ కళావతి పేర్కొన్నారు. బుధవారం మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట పట్టణంలోని స్థానిక కెజిబివి పాఠశాలలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేసి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అనంతరం విద్యార్థినిల మధ్య కేక్‌కట్‌చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూలే అందరికి విద్య అందించాలనే ఉద్దేశంతో ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేపట్టి ఎంతో మందికి మార్గదర్శకంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కవిత తదితరులు పాల్గొన్నారు.

## దుప్పట్లు పంపిణీ చేసిన యువకులు



**విజయక్రాంతి, పరిగి:** చలితీవ్రత రోజురోజుకు పెరిగిపోతుండటంతో ప్రజలు చలికి గజగజవణికిపోతున్నారు. ఈ క్రమంలోనే పరిగి బస్టాండ్‌లో కొందరు అభాగ్యులను చూసి చలించిపోయిన పోలీస్ కానిస్టేబుల్, మరో యువకుడు కలిసి చలి నుంచి వారిని విముక్తి కల్పించేందుకు నిశ్చయించుకొని దుప్పట్లను పంపిణీ చేశారు. పరిగి మండలం రాపోల్ గ్రామానికి చెందిన సంపత్‌కుమార్ వృత్తిరీత్యా హైదరాబాద్‌లోని మాదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో పోలీస్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన విద్యార్థి నాయకుడు నాగవర్దన్ ఇద్దరు కలిసి మంగళవారం అర్థరాత్రి చలికి వణుకుతూ బస్టాండ్‌లో నిద్రపోతున్న వారికి దుప్పట్లు పంపిణీచేశారు. వీరి సేవను పలువురు అభినందించారు.

## సింగరేణి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



**విజయక్రాంతి, చెన్నూర్ (మంచిర్యాల):** మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గంలో బుధవారం ఎంవీటీసీ మందమర్రిలో సింగరేణి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎం.రాఘవులు జనరల్ మేనేజర్ మందమర్రి విచ్చేసి ప్రసంగిస్తూ అన్ని దానములకన్న రక్తదానం గొప్పదని రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి హృదయ పూర్వక అభినందనలు తెలిపారు. ఈ తలసేమియా వ్యాధిగ్రస్తులకోసం సింగరేణిలోని అన్ని ఏరియాలో రక్తదాన శిబిర కార్యక్రమాలు నిర్వహించి వారిని ఆదుకోవాలని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్‌గా ఈ తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం తమ వంతు సహాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటు.జీఎం. వెంకటేశ్వర్లు, డి.వైజిపి.యం శ్యాంసుందర్, డివైపీఎం తిరుపతి, టీజీబీకెయస్ (వైస్ ప్రెసిడెంట్) యం.సంపత్, ఏఐటీయూసీ (బ్రాంచ్ సెక్రటరీ) ఎస్.సత్యనారాయణ, ట్రైనింగ్ ఆఫీసర్ ఎంవీటీసీ అశోక్, చందూరి మహెందర్, మెడికల్ ఆఫీసర్ విష్ణుమూర్తి, తలసేమియా వెల్ఫేర్ జాయింట్ సెక్రెటరి కాసర్ల రంజిత్ కుమార్, రెడ్ క్రాస్ కోర్ కమిటీ మెంబర్స్, ఎంవీటీసీ ట్రైనింగ్ ఇన్స్‌స్పెక్టర్స్ లక్ష్మీనారాయణ, రాజేశం, గౌసుద్దీన్ పాల్గొన్నారు.

## గిరిజన రిజర్వేషన్లను పెంచండి: సేవాలాల్ సేన

**విజయక్రాంతి, రామగుండం:** స్వతంత్ర తెలంగాణలో గిరిజన వర్గాలకు రిజర్వేషన్లు పెంచాలని సేవాలాల్ సేన డిమాండ్ చేసింది. బుధవారం రామగుండంలోని సంఘ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బూక్య రామునాయక్ మాట్లాడుతూ లంబాడీ తండాలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ పంచాయతీలతో లంబాడీలకు రాజ్యాధికారం కల్పించాలన్నారు. రాజకీయంగా వెనుకబడి వున్న గిరిజనులను చైతన్యపర్చడానికి తగు పరిస్థితులు కల్పించాలన్నారు. అన్ని తండాలకు ఏజెన్సీ హోదా కల్పించాలని, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన రిజర్వేషన్ల విషయంలో రాజకీయాలకు తావులేకుండా చూడాలన్నారు. ఆది నుంచి గిరిజనుల పట్ల కొన్ని పార్టీలు కపట ప్రేమను చూపుతున్నాయని విమర్శించారు. ఇప్పటికైనా ఈపరిస్థితిల్లో మార్పు రావాలని లేకుంటే తమ సత్తా ఏంటో చూపెడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు రమేశ్, సంపత్, సాగర్, రాంబాబు, శివరాం, అజ్మీక కిషన్ తదితరులు ఉన్నారు.

# మళ్ళీ రెచ్చిపోతున్న ఫైనాన్సర్లు



**విజయక్రాంతి, మంచిర్యాల:** మంచిర్యాల జిల్లాలో తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు ఇస్తామంటూ చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు మంచిర్యాల పట్టణంలో తిరుగుతున్నారని గుప్త సమాచారం. వారు అక్కడి నుంచి మంచిర్యాల చిన్న వృత్తులు చేసేందుకు, కూలీలు చేసేందుకు అంటూ వచ్చి పట్టణంలోని నిరుపేద, అమాయక, తాగుబోతులను ఆకర్షించి వారికి మా నివాస గృహాల తరుపున లేక వాళ్ల పరిచయం ఉన్న వారు ఇస్తున్నట్లు తెలిపి మంచిర్యాల ప్రజలకు సుమారు నూటికి 20–30 శాతం వడ్డిపై కేవలం 3–6 నెలలకు మాత్రమే అప్పు ఇస్తామని చెప్పి, నమ్మించి డబ్బులు ఇస్తున్నారు. ఈ డబ్బు ఇచ్చుపుచ్చుకొనుట విషయంలో ఏలాంటి సాక్ష్యాలు, ఆధారాలు లేకుండా కేవలం సంతకాలు, సెల్ నెంబర్లు రాయించుకొని డబ్బులు ఇస్తున్నారు. ముఖ్యంగా మంచిర్యాల పట్టణంలోని ఆటో డ్రైవర్లు, చిన్న చిన్న బండ్ల ఫలాల వ్యాపారస్థులు, లేక తక్షణంగా ఆసుపత్రిలో ఉన్న అనారోగ్యుల కొరకు, ఇండ్లు కట్టడంలో అత్యవసరంగా తక్కువగా పడ్డరుసుమును వీరు చెల్లిస్తున్నారు. ఋణగ్రహీత డబ్బులు చెల్లించలేక బయటికి చెప్పుకోలేక అనేక ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ప్రభుత్వం దృష్టిలో పరిగణిస్తే రుణగ్రహీతలు, రుణదాతలు ఇద్దరు నేరస్థులే. నగదు లావాదేవిలు జరిగినప్పుడు సాక్ష్యాలు కొన్ని నియమ నిబంధనలు పాటించకుంటే వారివురిపై చట్టరీత్యా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. కనుక ఏది ఏమైనా దీనికి సంబంధిత అధికారులు చొరవ తీసుకొని ఇలాంటి లావాదేవిలను పూర్తిగా అరికట్టి చిన్నచిన్న వీధి వ్యాపారులను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

## పకడ్బందీగా ఆపరేషన్ స్మైల్‌ను చేపట్టాలి

**విజయక్రాంతి, నిర్మల్:** జిల్లాలో 1 జనవరి నుంచి 31 వరకు చేపట్టిన ఆపరేషన్ స్మైల్–5 కార్యక్రమం పకడ్బందీగా చేపట్టాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ ప్రశాంతి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో మహిళ, శిశు, దివ్యాంగుల, వయోవృద్దుల సంక్షేమ శాఖ జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో పోలీస్, కార్మిక, విద్యా శాఖ, క్రీడలు, విద్య, స్వచ్ఛంద సంస్థలతో నిర్వహించిన ఆపరేషన్ స్మైల్–5 సమావేశంలో ఆమె పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. బాలలను కార్మికులుగా పెట్టుకున్న యాజమానులపై కేసులు నమోదు చేయాలన్నారు. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో రెస్క్యూ చేసిన వారిని ప్రభుత్వ వసతి గృహాలల్లో ప్రవేశం కల్పించి వారి విద్యాభివృద్ధి విషయంలో పరిశీలించి నెల నెలా నివేదికలు అందివ్వాలన్నారు. అధికారులకు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధికారిణీ విజయలక్ష్మీ, డీఎస్పీ ఉపేంధర్‌రెడ్డి, డీఎంఅండ్‌హెచ్ జలపతినాయక్, కార్మిక శాఖ అధికారినీ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

## చెరకు రైతులను ఆదుకోవడమే లక్ష్యం

**విజయక్రాంతి, పాలేరు:** చెరకు రైతులను ఆదుకోవడమే మా లక్ష్యమని, రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని సీడీసీ చైర్మన్ జూకూరి గోపాల్‌రావు స్పష్టం చేశారు. బుధవారం కూసుమంచి మండల కేంద్రంలోని సీడీసీ కార్యాలయంలో చెరకు రైతులతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018–19 వ్యవసాయ సీజన్ కోసం చెరకు నాట్లు ప్రారంభమైయ్యాయిని అన్నారు. ఈ సందర్భంగా రైతులకు కలుపు నివారణ మందులు పురుగుమందులు సూక్ష్మధాతు లోపాలను సవరించేందుకు ఉపయోగించే లవణాలు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. వీటితో పాటు చెరకు బోదెల మధ్య మట్టి ఎగదోసేందుకు కావాల్సిన పరికరాలు స్ప్రేయిర్‌లు ఆర్‌సీసీ పైపులను సబ్సిడీ ధరకు రైతులకు అందించాలని మండలి అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు. రైతులు సకాలంలో స్పందించి సద్వినియోగం చేసుకోవాలని, కోరారు. ఈ సందర్భంగా రైతు సోదరులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ చింతనిప్పు సైదులు, అసిస్టెంట్ కేన్ కమీషనర్ సీహెచ్ నర్సిరెడ్డి, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ వీ.సుబ్బురత్నం, కేన్ అడ్వయిజర్ బీ.మోహన్‌రెడ్డి, కేన్ సీనియర్ మేనేజర్ పీ.రామరావు, జూనియర్ అసిస్టెంట్ జే.పుల్లారావు, సిబ్బంది రాజశేఖర్ పాల్గొన్నారు.

## పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటుతాం

**విజయక్రాంతి, తాండూరు:** రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటుతామని తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికలలో మెజార్టీ గ్రామ పంచాయతీలను కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. దీంతో తాండూరు నియోజక వర్గంలో టీఆర్ఎస్‌ను క్లీన్‌స్విప్ చేస్తామని పేర్కొన్నారు. తాండూరు పట్టణంలో అభివృద్ధి ఆగిపోయిందని టీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ప్రభుత్వం బిల్లులు చెల్లించడంతో ఆలస్యం అవుతున్నాయని వెంటనే పెండింగ్ పనులను ప్రారంభిస్తామని చెప్పారు. మహబూబ్ నగర్ జిల్లా వనపర్తి వద్ద మిషన్ భగీరథ పైప్‌లైన్ లీక్ వల్ల తాండూరు ప్రాంతానికి మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని త్వరలో పనులు పూర్తి చేస్తున్నారని అన్నారు.రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని తాండూరు పట్టణంలో తాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడినట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న సబ్‌రిజిస్ట్రర్ కార్యాలయం చిన్నదిగా ఉందని ట్రాఫిక్ సమస్య ఉందని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి క్యాంప్ కార్యాలయం నుంచి పనులు చేపడతామని అన్నారు. త్వరలో క్యాంపు కార్యాలయానికి కొత్త ఫోన్ కనెక్షన్ తీసుకుంటున్నామని ఎవ్వరికి సమస్య ఉన్నా వెంటనే సంప్రదించాలని కార్యాలయంలో సిబ్బంది అందుబాటులో ఉంటారని అన్నారు. తాండూరు అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సునీతా సంపత్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మురళి కృష్ణ గౌడ్,పట్టణ పార్టీ అధ్యక్షులు నర్సిములు, మాజీ అధ్యక్షులు శ్రీనివాస్‌చారి, ప్రభాకర్ గౌడ్, సుధాకర్, ఇర్ఫాన్, యంగ్ లీడర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్ ఉన్నారు.

## రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలి

**విజయక్రాంతి, కొడంగల్:** కొడంగల్ నియోజకవర్గంలో కొత్త మండలాలను ఏర్పాటు చేసి రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తు నియోజకవర్గ కేంద్రంతో పాటు పలు మండల కేంద్రాలలో రిలే నిరహార దీక్షలు చేపట్టి తెలంగాణ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో గత వారం రోజులుగా అంబేద్కర్ చౌరస్తాలో అఖిల పక్ష పార్టీల ఆధ్వర్యంలో రిలే నిరహార దీక్షలు చేస్తున్నారు. కోస్గి మండలంలో గుండుమాల్ గ్రామాన్ని మండల కేంద్రంగా చేయాలని, మద్దూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామం, బోంరాస్‌పేట మండలంలో దుద్యాల్ గ్రామం, దౌల్తాబాద్ మండలంలో బాలంపేట గ్రామాలను మండలాలుగా చేసి కొడంగల్‌ను రెవెన్యూ డివిజన్‌గా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కొత్త జిల్లాలతో పాటు కొడంగల్‌ను కూడా రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు అధికార పార్టీ నాయకులు సహకరించాలని డిమాండ్ చేశారు. టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత 5 మండలాలతో ఒకటిగా ఉన్న నియోజకవర్గన్ని రెండు ముక్కలు చేసింది కాకా ప్రస్తుతం మూడు ముక్కలు చేయాలని ప్రయత్నిస్తే రోడ్లపైకి వచ్చి తెలంగాణ ఉద్యమంలో మరో సకల జనుల సమ్మె చేసేందుకు సిద్దంగా ఉన్నామని హెచ్చరించారు. వెంటనే నియోజకవర్గంలో కొత్త మండల కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

## పారదర్శకంగా రెవెన్యూ సేవలు



**విజయక్రాంతి, సంగారెడ్డి:** నూతన సంవత్సర 2019 పురస్కరించుకొని జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకులు శివప్రసాద్, రాములు, ఇతర నాయకులు జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లను తన చాంబర్‌లో కలుసుకొని పుష్పగుచ్ఛాన్ని అందజేసి జిల్లా రెవెన్యూ ఉద్యోగుల తరుపున ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలను అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా నాయకులు శివప్రసాద్ మాట్లాడుతూ ఈ కొత్త సంవత్సరంలో ప్రతీ రెవెన్యూ ఉద్యోగి ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. రెవెన్యూ ఉద్యోగులు తెలంగాణ సర్కార్ ప్రవేశపెట్టే వివిధ సంక్షేమ, పురోగతి పథకాలతో పాటు వివిధ రెవెన్యూ సేవలు అందించేందుకు తమ ఉద్యోగులంతా పారదర్శకంగా ప్రజలకు సేవలందించడమే కాకుండా జవాబుదారితనం కూడా కలిగి ఉంటారని శివప్రసాద్ వివరించారు. ముఖ్యంగా ఈ నూతన సంవత్సరంలో ప్రభుత్వ పథకాల పనితీరును, రెవెన్యూ సేవలను తక్షణమే ప్రజలకు ఉపయోగపడే విధంగా తమ ఉద్యోగులంతా అంకిత భావంతో పనిచేస్తారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు రెవెన్యూ ఉద్యోగులు, వివిధ మండలాల తహసీల్దారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆహా

## బామ్మ చిట్కాలు

ఆహారంలో జీలకర్ర వేయటాన్ని ఇష్టపడతారా? ఆహారానికి మంచి రుచి మరియు సువాసనను ఇచ్చే జీలకర్రను చాలా మంది ఇష్టపడుతుంటారు. కానీ, మితిమీరిన స్థాయిలో వీటి వాడకం వల్ల కూడా సమస్యలు కలుగుతాయి.

**మీకు తెలుసా?**

జీలకర్ర లేకుండా భారతదేశపు వంటగదులను ఊహించుకోలేము అవునా. ఆసియా దేశాలలో వాడే సాధారణ సుగంధ ద్రవ్యంగా పేర్కొనే జీలకర్ర దాదాపు అన్ని రకాల ఆహార పదార్థాలతో తయారీలలో వాడతారు. ఔషద గుణాలను కలిగి ఉండే జీలకర్రను తగిన స్థాయిలో తీసుకుంటే ఎలాంటి సమస్యలు ఉండవు. కానీ మితిమీరిన స్థాయిలో తీసుకోటం వలన ఉహించని సమస్యలు కలుగుతాయి.



# ఘాటెక్కించే రసం

**చలి కాలంలో ఎన్ని కూరలు ఉన్నా ఒక ముద్ద వేడి వేడి రసంతో తింటే ఆ రుచే వేరు. అంతే కాదు ఎప్పటి నుంచో పట్టి పీడిస్తున్న రొంప దెబ్బకు మటు మాయం. గొంతు గరగర తగ్గి సాఫీ అవుతుంది, శరీరం తేలికవుతుంది. రసాలలో ప్రాంతాలను బట్టి రుచులలో వైవిధ్యం ఉంటుంది. ఈ రోజు కొన్ని రకాల రసాల తయారి విధానాన్ని చూద్దాం.**




కళ్యాణి రసం

### కావలసినవి పదార్థాలు

పొడికోసం: కందిపప్పు: టీస్పూను, దనియాలు: టీస్పూను, మిరియాలు: టీస్పూను, జీలకర్ర: ఒకటిన్నర టీస్పూన్లు, ఎండుమిర్చి: రెండు, నూనె: టీస్పూను, రసం తయారీకోసం: కంది పప్పు: 3 టీస్పూన్లు, టొమాటో: ఒకటి. చింతపండు: నిమ్మకాయంత, వెల్లుల్లి రెబ్బలు: 4, మిరియాలు: టీస్పూను, జీలకర్ర: టీస్పూను, పసుపు: టీస్పూను, ఉప్పు: రుచికి సరిపడా, మంచినీళ్లు: తగినన్ని, తాలింపుకోసం: నూనె: ఒకటిన్నర టీస్పూన్లు, ఆవాలు: టీస్పూను, జీలకర్ర:అర టీ స్పూను, కరివేపాకు: 4 రెబ్బలు, ఇంగువ: చిటికెడు, కొత్తిమీర: కట్ట.

### తయారుచేసే విధానం

- అరకప్పు గోరువెచ్చని నీళ్లలో చింత పండు వేసి నానబెట్టాలి.
- విడిగా ఓ పాన్లో టీస్పూను నూనె వేసి పొడి కోసం తీసుకున్నవన్నీ వేసి వేయించాలి. చల్లారాక పొడి చేయాలి.
- టొమాటోను ముక్కలుగా కోసి అర కప్పు నీళ్లు పోసి మెత్తగా మెదిపి రసం పిండాలి. కుక్కర్లో కందిపప్పు, పసుపు వేసి ఉడికించాలి. తరవాత మెత్తగా మెదిపిన టమాటో రసం, చింత పండు రసం, ఉప్పు వేసి కలపాలి.
- వెల్లుల్లి, మిరియాలు, జీలకర్ర మెత్తగా నూరాలి.
- మందపాటి గిన్నెలో టీస్పూను నూనె వేసి వెల్లుల్లి మిశ్రమం వేసి వేగాక పప్పు, టొమాటో, చింత పండు రసం వేసి సిమ్‌లో మరిగించాలి. తరవాత రసం పొడి వేసి ఉండలు కట్టకుండా కలుపుతూ మరికాసేపు మరిగించాలి.
- చిన్న బాణలిలో నూనె వేసి తాలింపు దినుసులన్నీ వేసి రసంలో కలపాలి. చివరగా కొత్తిమీర వేస్తే కళ్యాణిరసం రెడీ. పెళ్లిళ్లలో ఎక్కువగా ఈ పద్ధతి లోనే చేస్తుంటారు.
- చిన్న కళాయిలో నూనె లేదా నెయ్యి వేసి ఆవాలు, కరివేపాకు, చిటికెడు జీలకర్ర వేసి చిటపటమన్నాక రసంలో కలిపి కాస్త కొత్తిమీర వేసి దించితే సరి.



పైనాపిల్ రసం

### కావలసిన పదార్థాలు

మంచినీళ్లు: 4 కప్పులు, పైనాపిల్ (చిన్నది): ఒకటి, పచ్చిమిర్చి: మూడు, కొత్తిమీర: కట్ట, టొమాటో: ఒకటి, రసం పొడి: టీస్పూను, పసుపు: అరటీస్పూను, అల్లం తురుము: చిన్నముక్క, ఉప్పు: రుచికి సరిపడా, బెల్లం తురుము: అరటీస్పూను, కందిపప్పు: అరకప్పు, కొబ్బరిపాలు: అరకప్పు, పోపుకోసం: జీలకర్ర: అరటీస్పూను, మిరియాలు: అరటీస్పూను, నెయ్యి: టీస్పూను, ఆవాలు: టీస్పూను, ఎండు మిర్చి: నాలుగు, ఇంగువ: టీస్పూను, కొత్తిమీర: కట్ట, కరివేపాకు: కట్ట

### తయారు చేసే విధానం

- పైనాపిల్‌ను ముక్కలుగా కోయాలి. వాటిల్లో సగం అలాగే ఉంచి మిగిలిన సగం రసం తీయాలి. కందిపప్పుని ఉడికించి మెత్తగా మెదపాలి. గిన్నె లేదా కుండలో నీళ్ల మరిగించి కొత్తిమీర, పచ్చిమిర్చి ముక్కలు, అల్లం తురుము, పైనాపిల్ ముక్కలు, పైనాపిల్ రసం, టొమాటో ముక్కలు, రసం పొడి, బెల్లం తురుము, ఉప్పు, కొబ్బరిపాలు, కంది పప్పు వేసి సుమారు పావుగంటసేపు మరిగించాలి. తరవాత దనియాలపొడి, మిరియాలపొడి కూడా వేసి మరిగించాలి.
- మరో పాన్లో కొద్దిగా నెయ్యి వేసి కాగాక ఆవాలు, ఎండుమిర్చి, ఇంగువ వేసి తాలింపుచేసి రసంలో కలిపితే సరి. చివరలో ఇష్టమైతే నాలుగు చుక్కల నిమ్మరసం కూడా పిండుకోవచ్చు. బాగా మరిగిన తరవాత తాలింపు వేసి దించాలి.
- తరవాత దించి తాలింపు చేసి కొబ్బరి తురుము చల్లి వడ్డించా.



మైసూర్ రసం

### కావలసినవి పదార్థములు

కందిపప్పు: 3 టీస్పూన్లు, చింతపండు: రెండు మీడియం సైజు నిమ్మకాయలంత, టొమాటోలు: నాలుగు, కొత్తిమీర: కట్ట, కొబ్బరి తురుము: 4 టీస్పూన్లు, ఉప్పు: సరిపడా, పొడికోసం: దనియాలు: 3 టీస్పూన్లు, ఆవాలు: అరటీస్పూను, జీలకర్ర: టీస్పూను, మెంతులు: టీస్పూను, ఎండుమిర్చి: నాలుగు, కరివేపాకు: 6 రెబ్బలు, మిరియాలు: అరటీస్పూను, తాలింపుకోసం, జీలకర్ర, ఆవాలు, ఇంగువ, ఎండు మిర్చి, కరివేపాకు, నూనె: కొద్దికొద్దిగా

### తయారు చేసే విధానం

- ముందుగా బాణలిలో ఆవాలు, జీలకర్ర, మెంతులు వేయించి తీసి చల్లారనివ్వాలి. అదే బాణలిలో టీస్పూను నూనె వేసి ఎండుమిర్చి, మిరియాలు, కరివేపాకు, ఇంగువ వేసి వేగాక చల్లారనివ్వాలి. ఇప్పుడు అన్నీ కలిపి మెత్తగా పొడి చేయాలి.
- కందిపప్పును మెత్తగా ఉడికించి ఉంచాలి.
- చింతపండును నానబెట్టి మొత్తం ఒకటిన్నర లీటర్ల రసం తీయాలి. ఈ రసాన్ని ఓ మందపాటి బాణలిలో పోసి మరిగించాలి.
- అందులో ఉడికించి మెదిపిన కందిపప్పు, సన్నగా కోసిన టొమాటోలు, రసం పొడి, కొత్తిమీర, ఉప్పు వేసి పదినిమిషాలు మరిగించాలి.
- తరవాత దించి తాలింపు చేసి కొబ్బరి తురుము చల్లి వడ్డించా.

# మెడనొప్పితో సతమతమవుతున్నారా..



**ఉన్నట్టుండి మెడ పట్టేయడం, తల అటూ ఇటూ తిప్పలేక నిటారుగా అయిపోవడం కండరాలన్నీ బిగుసుకుపోయినట్టు ఉండడం తరచుగా ఎదుర్కొనే సమస్య. ఇంటా బయట పనులతో ఒత్తిడికి గురయ్యే వాళ్లల్లో ఈ సమస్య ఎక్కువే ఉంటుంది. కానీ పని ఒత్తిడితో పాటు కారణాలు వేరే కూడా ఉన్నాయి.**

మెడనొప్పి అనేది చిన్నా, పెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ ఏదో ఒక సమయంలో అనుభవంలోకి వచ్చే బాధ. మెడనొప్పి, నడుము నొప్పి లాంటివి మనతో కలిసి సహజీవనం చేస్తుంటాయి. ఇవి నిత్యం చేసుకునే పనులకు అసౌకర్యం కలిగిస్తున్నా, పూర్తిగా అడ్డు కావడం లేదనే ఉద్దేశ్యంతో పట్టించుకోం. తరచుగా నొప్పి నివారిణులు వాడడం కంటే రాకుండా చూసుకోవడం నయం కదా! అలాంటి కొన్ని



ఉపాయాలు మీ కోసం..

### నడుమునొప్పికి కారణాలు..

- మెడభాగంలో ఉండే కండరాలు ఎక్కువ ఒత్తిడికి గురికావడం, మెడభాగంలోని జాయింట్‌లలో కలిగే అసౌకర్యం, డిస్క్ దెబ్బతినడం.
- పడుకునే సమయంలో తలకింద పెట్టుకునే మెత్త సరిగ్గా లేకపోవడం, పడుకునేటపుడు మెడను కిందికి వంచి పడుకోవడం.
- కంప్యూటర్ ముందు కూర్చుకున్నపుడు సీటు సరిగా కుదరకపోవడం.
- కంప్యూటర్ ముందు ఎక్కువసేపు లేవకుండా కూర్చోవడం.

ఆఫీసుల్లో కూర్చొని పనిచేసుకునేటప్పుడు ముందుకు వంగినట్లుగా కూర్చోవడం మొదలైన టూ వీలర్స్‌పై ఎక్కువ బయట తిరగాల్సి వచ్చినప్పుడు మెడ కండరాల మీద ఎక్కువ ఒత్తిడి పడి మెడనొప్పికి కారణమవుతుంది.

### భవిష్యత్తులో మెడనొప్పికి జాగ్రత్తలు..


- నడిచేటపుడు, కూర్చునపుడు పడుకునే సమయం శరీరాకృతి సరిగా ఉండేలా చూసుకోవాలి.
- ఒకే భంగిమలో ఎక్కువసేపు కూర్చోకండి. మధ్య మధ్యలో కూర్చున్న భంగిమను మారుస్తుండండి.
- కంప్యూటర్ ముందు కూర్చున్నప్పుడు కంప్యూటర్ కంటికి అనువుగా కంటికెదురుగా ఉండేలా జాగ్రత్త పడండి.
- కంప్యూటర్ పక్కనే ఒక స్టాండును అమర్చుకోవాలి. దీనివల్ల పక్కకు వంగి చూడడం వల్ల కలిగే మెడనొప్పి నుంచి ఉపశమనం పొందవచ్చు.
- కంప్యూటర్ మీద పనిచేసేటప్పుడు కీ బోర్డు చూడకుండా పనిచేస్తే మెడనొప్పిని తగ్గించుకోవచ్చు. కార్లలో ప్రయాణించేటప్పుడు సీట్ల అమరిక సరిగా ఉండేలా చూసుకోండి.
- టూ వీలర్‌పై వెళ్లేటప్పుడు నడుము నిటారుగా ఉండేలా చూసుకోండి. వంగిపోయి, మెడ నరాలు బిగపట్టి తల పైకెత్తి చూడకూడదు.
- మెడనొప్పి నివారణకు చిట్కాలు..
- ఫ్రిజ్‌లో పెట్టిన పచ్చిబఠాణీల ప్యాకెట్లను మెడమీద పదిహేను నిమిషాల సేపు ఉంచుకుంటే మెడనొప్పి తగ్గుతుంది.
- మెడనొప్పికి కాపడం పెట్టడం లాంటి పనులు చేయకండి.
- గోరువెచ్చటి నీటి తొట్టెలో మెడవరకు మునిగి కూర్చోవడం వల్ల మెడ దగ్గర ఉన్న నొప్పి, వాపు తగ్గుతుంది.
- మెడనొప్పి దిండు వల్ల వస్తున్నట్లయితే, అది లేకుండా పడుకోవడం మంచిది.

# హెల్త్

## బీట్ రూట్‌లోని బెనిఫిట్స్..

బీట్‌రూట్‌ని జ్యూస్‌గా, వంటకాల్లో, స్వీట్స్‌లలో చాలానే ఉపయోగిస్తున్నారు. వీటిని నిత్యం ఆహారంలో తప్పనిసరిగా చేర్చుకుంటే మంచిదని అంటున్నారు వైద్యులు. వీటిలోని పోషకాలు ఆరోగ్యాన్ని మెరుగుపరిచి తక్షణ శక్తిని అందిస్తాయి. ఇవి ఆరోగ్యానికి మాత్రమే కాదు అందానికి ప్యాక్‌లా కూడా ఉపయోగించుకోవచ్చు.

దీని శాస్త్రీయ నామము బీటా వల్గరీస్ ఆకులు, దుంప రెండూ తినేయొచ్చు. రక్తహీనతతో బాధపడేవారు రోజూ కప్పు



బీట్‌రూట్ రసం తాగితే త్వరగా కోలుకుంటారు.

### వైద్య పరంగా...

డయాబెటిక్ లివర్‌కు మందులా పనిచేస్తూ, కొలెస్టిరాల్‌ను తగ్గిస్తుంది.

మలబద్ధకాన్ని నివారిస్తుంది.

బీట్ రూటు రసము రక్తపోటును తగ్గించి, కొంత వరకు కాన్సర్ నివారణకు ఉపయోగపడుతుంది. అధిక రక్తపోటుతో బాధపడేవారు బీట్‌రూట్ రసం తాగితే మంచిది. అధిక రక్తపోటును బాగా తగ్గిస్తుందని తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఇందులోని నైట్రేట్లు రక్తంలో కలిశాక నైట్రిక్ ఆక్సైడ్స్‌ను ఉత్పత్తి చేస్తాయి. ఈ వాయువు రక్తనాళాలను విప్పారేలా చేసి రక్తపోటు తగ్గేందుకు దోహదం చేస్తుంది. ఫలితంగా గుండె ఆరోగ్యంగా ఉండటానికీ తోడ్పడుతుంది. కాబట్టి రోజూ 250 మి.గ్రా. పచ్చి బీట్‌రూట్ రసాన్ని తాగితే మేలు జరుగుతుంది. బీట్‌రూట్‌లో కేవలం నైట్రేట్లు మాత్రమే కాదు.. విటమిన్లు, ఖనిజాలు, అమైనో ఆమ్లాలూ దండిగా ఉంటాయి. శరీరం క్యాల్షియాన్ని వినియోగించుకోవటంలో తోడ్పడే సైలీషియా సైతం ఉంది.

బీట్‌రూట్‌కు ఎరుపు రంగుని కలిగించే బీటాసైయాన్‌కు పేద్దపేగుల్లో క్యాన్సర్‌తో పోరాడే లక్షణం ఉంది.

### పోషకాలు..

మాయిశ్చర్ ——87.7 శాతము ,
ప్రోటీన్లు ———1.7 %,
ఖనిజాలు ——0.8%,
పీచు ————0.9%
కార్బోహైడ్రేట్స్ 8.8%,
కాల్షియం ——18 మి.గ్రా. శాతము ,
ఫాస్పరస్ ——55 మి.గా %,
ఇనుము ——1.0 మి.గా%,
జింక్ ————0.2% ,
థయామిన్—0.04%,
రిబోఫ్లేమిన్—0.09%,
నియాసిన్——0.4 మి.గా %,
విటమిన్ సి —10% ,
కాలరీస్ ——43 కేలరీలు ,

సౌందర్యానికి బీట్‌రూట్‌లోని విటమిన్–బి చర్మం, గోళ్లు, వెంట్రుకల ఆరోగ్యానికి బాగా ఉపయోగపడుతుంది. అంతేకాదు పెదవులు పొడారకుండానూ చూస్తుంది. వీటిల్లోని బీటేన్ రక్తనాళాలు పెళుసుబారకుండా కాపాడుతాయి. రోజుకి ఓ చిన్న గ్లాసుడు బీట్రూట్ రసం తాగితే రక్తపోటు తగ్గటానికి దోహదం చేస్తుంది. నాడుల ఆరోగ్యం, జ్ఞాపకశక్తి, కాలేయం పనితీరు మెరుగుపడటానికీ బీట్‌రూట్ తోడ్పడుతుంది. గర్భిణుల్లో ఆరోగ్యకరమైన కణజాలం వృద్ధి చెందేలా చేస్తుంది కూడా. హార్ట్ బీట్ క్రమబద్ధం చేయడానికి సహజంగా లభించే పండ్లూ కాయగూరలూ తినడం మంచిదని సూచిస్తారు పోషకాహార నిపుణులు. అలాంటి వాటిలో బీట్రూట్ ఒకటి.

బీట్‌రూట్ ప్రయోజనాలు

బీట్‌రూట్‌లో నైట్రేట్ల నిల్వలు అధికం. ఇవి నైట్రేట్ ఆక్సైడ్లుగా మారి రక్తప్రసరణ వేగాన్ని పెంచుతాయి. ఫలితంగా రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టడాన్ని నివారిస్తాయి.

బీట్‌రూట్ రసం తాగిన మూడు గంటలకు రక్తపోటులో తగ్గుదల ఉంటుందనీ, దీనివల్ల అనవసర ఆందోళనను దూరం చేసుకోవచ్చనీ ఇటీవల ఓ పరిశోధనలో తేలింది.

క్రీడాకారులు బీట్‌రూట్ జ్యూస్ తాగి పరిగెత్తినపుడు తక్కువ ఆక్సిజన్ తీసుకుంటారు. అందువల్ల త్వరగా అలసిపోరు.

ఓ తాజా పరిశోధన ప్రకారం రోజుకి 400మి.లీ. చొప్పున రెండ్రోజులు బీట్‌రూట్ జ్యూస్ తాగిన వృద్ధుల్లో మెదడు భాగంలో రక్త ప్రసరణ వేగం పెరిగి ఆలోచనల్లో చురుకుదనం కనిపించింది.


విజయక్రాంతి
గురువారం 03
జనవరి 2019
హైదరాబాద్


## బూడిద గుమ్మడిలోని ఔషధాలు...

చలికాలంలో పిందె తొడిగి, వేసవి వరకూ పెద్దపెద్ద కాయలు కాసే ఈ గుమ్మడితో పసందైన వంటకాలెన్నో చేసుకోవచ్చు. బూడిద గుమ్మడి కాయ విత్తనాల్లో, తీగలో కూడా ఔషధ గుణాలున్నాయి. కడుపులో మంట, ఉబ్బరంగా ఉండటం, దాహం ఎక్కువగా ఉన్నప్పుడు బూడిద గుమ్మడి చక్కటి ఔషధంలా పనిచేస్తుంది. మలబద్ధకంతో బాధపడే వాళ్ళు రోజూ బూడిద గుమ్మడికాయను ఆహారంలో భాగంగా తీసుకుంటుంటే సమస్య తగ్గుతుంది.

అంతేకాక ఈ విత్తనాల నుంచి తీసిన నూనెని చర్మవ్యాధుల నివారణలోనూ ఉపయోగిస్తారు. బూడిద గుమ్మడి తీగ రసాన్ని హై బీపీ, నిద్రలేమితో బాధపడే వారికి ఇస్తే మంచి ఫలితం ఉంటుందని ఆయుర్వేదం చెప్తోంది. బరువు కూడా తగ్గే అవకాశం ఉంది. నీరు ఎక్కువుండే బూడిదగుమ్మడిలో కార్బొహైడ్రేట్లు, కొవ్వు అతి తక్కువ శాతం ఉండటంతో డైటింగ్ చేసే వారికి మంచి ఆహారము. బూడిద గుమ్మడి కాయ తొక్క, గింజలు కొబ్బరి నూనెలో మరిగించి ఆ మిశ్రమాన్ని తలవెంట్రుకులకు రాస్తే జుట్టు మృదువుగా మారి, వెంట్రుకలు బాగా పెరుగుతాయి.

# కామాంధుల ఆకృత్యాలు..
# పోక్సో నిలువరిస్తుందా?




**బేటీ పడావో... బేటీ బచావో నినాదం ప్రచారానికే పరిమితమై ఆచరణకు వచ్చేసరికి అందనంత దూరంలో ఉన్నదన్న విషయం వొప్పకొని తీరాలి. ఇటీవల లైంగిక దాడుల నుంచి బాలలకు రక్షణ (పోక్సో)చట్టం 2012లోని సెక్షన్ 4,5,6,9,14,15,42లకు కేంద్ర మంత్రివర్గం సవరణలను ప్రతిపాదించింది. పన్నెండు సంవత్సరాలలోపు పిల్లలపై హేయమైన రాక్షసంగా లైంగిక దాడికి పాల్పడినా అత్యాచారానికి పూనుకున్నా నిందితులకు మరణ శిక్షతో సహా కఠినమైన శిక్షలు విధించేలా సెక్షన్ 4,5,6 లకు సవరణ చేసింది. చట్టాలు చేసిన, తీవ్రతను బట్టి సవరణలు చేసినా పిల్లలపై లైంగిక దాడులు అంతకంతకూ ఎక్కువే అవుతున్నాయి కానీ తగ్గుముఖం పట్టడంలేదు. నేర ప్రవృత్తి ఏయేటికాయేడు పెరిగిపోతున్నదనడానికి జరిగిన దారుణమైన సంఘటనలెన్నో మనముందుకు వస్తాయి. గత ఏడాది సరిగ్గా యిదే సమయంలో చోటుచేసుకున్న జమ్మూ కాశ్మీర్ ఉమ్మడి రాష్ట్రాలకు చెందిన కథువా దారుణ సంఘటన ఒక మరచిపోలేని పీడకల లాంటి వాస్తవం. చిన్నారి ఆసిఫాను గుర్తు చేసుకునే క్రమంలో ఓసారి గతంలోకి వెళ్తే...**

ఎప్పటిలాగే హుషారుగా నిద్ర లేచింది ఆసిఫా... ఆసిఫాతో పాటు ఆవు, గుర్రాలు, మేక కూడా మేతకై ఎదురు చూస్తూ అటు ఇటు తచ్చాడుతున్నాయి. గుర్రాలు తమ పిల్లలను ముద్దు చేస్తున్నాయి. అసిఫాకు అవంటే ప్రాణం. అసిఫా అంటే అమ్మకు ప్రాణం. అసిఫా అందంగా ఉంటుందని, పెద్ద పెద్ద కళ్ళను చక్రాల్లా తిప్పుతూ కబుర్లు చెబుతుందని, చలాకీగా చురుగ్గా ఉంటుందని, తెలివైన అమ్మాయని అమ్మకు అసిఫా అంటే ప్రాణం. ఆసిఫా కళ్ళల్లోని మెరుపు నిర్మమైన ఆ కళ్ళు ఆ అమ్మకు ఊపిరి. గుర్రాలను అడవిలో మేపుకొని రమ్మంటే ధైర్యంగా ఒక్కతే అడవంతా చుడుతుందని అమ్మకు అసిఫాపై బోలెడు నమ్మకం. ఆటంటే ఆసిఫా.. గుర్రంపై కూర్చుని స్వారీ చేసే సాహసి చిన్నారి ఆసిఫా.. ఆ రోజు కూడా అమ్మ పెట్టిన నాష్టా తిన్నట్టు చేసి వాకిట్లోకి చెంగుచెంగున పరుగెత్తింది. రసన గ్రామానికి అనుకునే వున్న ఖతువా అడవులలో తనకు అలవాటైన పచ్చిక బయళ్లలో తన నేస్తం గుర్రాన్ని మేపడానికి వెళ్ళింది ఆసిఫా. అమ్మ ఓ పక్క జాగ్రత్తలు చెబుతూనే వుంది. అయినా ఆసిఫాపై అమ్మకు దిగుల్లేదు. లల్లాయి పాటలు పాడుకుంటూ చెంగు చెంగున ఎగురుతూ మధ్య మధ్య గుర్రాన్ని అదిలిస్తూ... బాట ఎంబడి పరచుకున్న గడ్డి పూలను పలకరిస్తూ తన అడవిని చాపలా చుట్టేస్తుందని సంబరపడిపోతుంది. అసిఫాను అడవికి పంపి అమ్మ యింటి పని ముగించుకొని పశువుల మేతకు వెళ్ళింది.

### ఆవు... మేకలు ఇంటికి చేరే

ఎప్పటిలాగే సాయంకాలం అయింది. పశువులను మేపుకొని అలసటతో ఇంటి ముఖం పట్టింది అమ్మ. వచ్చీ రాగానే తన ముద్దుల కూతురు ఎప్పటిలాగే ఎదురొస్తుందని చూసింది. అమ్మ చూపులో నిరాశ... ఇంటి లోపలికి తొంగి చూసింది... లోపల కనిపించ లేదు... గుర్రాలూ ఇంటికి వచ్చాయి. పశువులు కొట్టం చేరుకున్నాయి. కానీ ఆసిఫా రాలేదు. చీకటి పడేవరకు ఎదురు చూసింది. ఆసిఫా జాడలేదు. ఏమయి ఉంటుంది. అమ్మలో క్షణం పాటు ఆందోళన. ఇల్లు తిరిగింది. అంతటా వెతికింది. అసిఫా కనిపించలేదు. అమ్మకు ఏడుపు ఆగడం లేదు. ఏం చేయాలో తోచక ఈ విషయం ఆసిఫా నాన్నకు చెప్పింది. వెంటనే ఇరుగుపొరుగును వెంటేసుకొని ఆసిఫా కోసం వెతికారు. టార్చ్ లైట్లు.. కందిళ్ళ పట్టుకొని చీకట్లో అడవి అంతా గాలించారు. రాత్రి అంతా చెట్టు కొకరు, పుట్టకొకరు అసిఫా జాడ కోసం వెళ్లారు. ఆసిఫా కనిపించలేదు. అమ్మ కన్నీళ్లు ఆగడం లేదు. "ఎక్కడికి వెళ్లి ఉంటుంది? ఏమయి ఉంటుంది? భయపడిందా... అహ... అంత పిరికిది కాదు నా చిన్నారి... ఆకలి కావడం లేదా... అయ్యో..." అమ్మను ప్రశ్నలు వేధిస్తున్నాయి... రాత్రి అంతా బిడ్డ వస్తుందని... అమ్మా అని ఒడిలో వచ్చి పడుకుంటుందని అమ్మకు ఎక్కడో ఆశ.






### ఎప్పటిలాగే తెల్లారింది

అంతా ఎప్పటిలాగే వుంది... కానీ ఆసిఫా లేదు... అమ్మ కళ్ళు అసిఫా కోసం వెతుకుతూనే వున్నాయి... ఆసిఫా లేకుండా మరునాడు కూడా గడిచిపోయింది. గొర్రెలు, మేక, ఆవు అమ్మ చుట్టూనే తిరుగుతున్నాయి. అసిఫా మచ్చిక చేసుకున్న కుక్కపిల్లలు గొలుసును విప్పుకోవాలని గింజుకుంటున్నాయి. గుర్రాలు తమ పిల్లలను ముఖాలతో నిమురుతున్నాయి. ఆసిఫా అచ్చం అమ్మలాగే ఉంటుంది. పదే పదే అసిఫా తన పెద్ద పెద్ద చక్రాల్లాంటి కళ్ళే ఆమె కళ్ళల్లో పెట్టి చూస్తున్నట్టు... అసిఫా స్పర్శ.... అమ్మను ఆవేదనకు గురి చేస్తున్నాయి. అమ్మ కథువా పర్వతాలను ప్రశ్నిస్తున్నది... నా బిడ్డ జాడ చెప్పమని... అక్కడి మంచు శ్రేణును అర్థిస్తున్నది... నిర్మమయిన నా పసిబిడ్డ ఎక్కడని... ఏడు రోజు తరువాత... అమ్మ తన యింటి ముందు ఆసిఫా కోసం ఎదురు చూస్తూ కూర్చుంది. పక్కింటి వ్యక్తి పరుగెత్తుకుంటూ అమ్మ దగ్గరికి వచ్చాడు. ఆయాసపడుతూ పిడుగులాంటి వార్త చెప్పాడు... అమ్మ కుప్ప కూలిపోయింది. ఆసిఫా అడవిలో శవమై కనిపించిందని... గొంతు తడారి పోతున్నది... మాటలు రావడం లేదు... ఎలాగో ఓపిక తెచ్చుకొని అడవి బాటలో అసిఫా కోసం భారమైన అడుగు... అక్కడ అన్నెం పున్నెం ఎరుగని చిన్నారి అచేతనంగా... ఎంతో ఇష్టంగా కొనుక్కుని పెట్టుకున్న హెయిర్ బ్యాండ్, మెరుపు కాలి జోళ్ళు అమ్మ వైపు జాలిగా చూస్తున్నాయి. నాభి నుంచి తన్నుకొస్తున్న దుఃఖం. అది ఏడుపు కాదు... సముద్ర ఘోష... అసలేం జరిగిందో విన్న తరువాత కళ్ళకు చీకట్లు కమ్ముకున్నాయి... వారం రోజుల నుంచి బిడ్డ జాడ తెలియక నరకయాతన... పోలీసులకు ఫిర్యాదు చేసినా, కంచే చేను మేస్తే.... దుఃఖం ఒక్కసారిగా కట్టలు తెంచుకుంది. "ముక్కుపచ్చలారని చిన్నారి... చీమకు కూడా హాని చేయని వయసు... ఎవరికి ఏం ద్రోహం చేసిందని ఇంతటి శిక్ష. అసిఫా మళ్ళీ మళ్ళీ కనిపించదు... ఈ నిజం నా ప్రాణాన్ని తోడేస్తున్నది. అంతా శూన్యం... అతి క్రూరంగా... పైశాచికంగా అమానవీయంగా... రాక్షసంగా... పసిదాని ప్రాణం తీసుకున్న ఉన్మాదులు... నా అసిఫాను చంపేశారు... ఇది నిజం...

జమ్మూ కాశ్మీర్లోని కథువాకు దూరంలో ఉంటుంది రసన గ్రామం. అసిఫా తల్లితండ్రులది ఆ వూళ్ళో సంచార తెగకు చెందిన ముస్లిం కుటుంబం. హిందువుల ప్రాబల్యం అధికంగా వుండే ఆ వూళ్ళో జాతి విద్వేషాలు ఎప్పటి నుంచో రాజుకుంటున్నాయి. అవకాశం కోసం చూస్తున్న బలవంతులకు చిన్నారి ఆసిఫా పావుగా దొరికింది. సభ్య సమాజం సిగ్గుపడే రీతిలో పసిదానిపై పంజా విసిరారు ఉన్మాదులు. పసి మొగ్గను నులిపేశారు. ఆసిఫాపై జరిగిన ఘాతుకం చెప్పడానికి కూడా మాట రాని పరిస్థితి. ఎనిమిదేళ్ల చిన్నారిపై దాడి చేసి బంధించి అత్యాచారం... హత్యకు ప్పాడిన దుర్మార్గులకు ఏ శిక్ష వేస్తే ఆసిఫాకు న్యాయం జరుగుతుంది. "మాకు పత్రికలు ఎట్లుంటయో తెలియదు.. టీవీ అసలు తెలియదు... మా పక్కన ఏం జరుగుతుందో తెలియదు.. మాకు తెలిసిందల్లా ఒక్కటే... పశువులను కాస్తు గుర్రాలను మేపుకుంటూ ఊరూరా తిరిగి పొట్టపోసుకోవడం..." అంటున్నది ఆసిఫా వాళ్ళ అమ్మ నసీమా బీబీ.



**ఆ రోజు కూడా అమ్మ పెట్టిన నాష్టా తిన్నట్టు చేసి వాకిట్లోకి చెంగుచెంగున పరుగెత్తింది అసిఫా. రసన గ్రామానికి అనుకునే వున్న ఖతువా అడవులో తనకు అవాటైన పచ్చిక బయళ్లలో తన నేస్తం గుర్రాన్ని మేపడానికి వెళ్ళింది... చివరి సారిగా బైట ఆడుకున్న ఫుట్ బాల్..**

నిజమే పక్కన ఏం జరుగుతుందో తెలియకుండా విసిరేసినట్టు వున్న గ్రామాలు మన చుట్టూ చాలానే వున్నాయి. ఇటువంటి సమాజాన్ని, ఊళ్లను, మనుషులను చైతన్య పరచడానికి స్వచ్ఛంద సంస్థలు, సహాయక కేంద్రాలు కూడా తమవంతు కృషి చేస్తున్నాయి. ఆసిఫాకు న్యాయం చేయడానికి నేరస్తులకు సరైన శిక్ష పడడానికి దేశవ్యాప్తంగా అలజడులు, ఆందోళనలు చోటుచేసుకున్నాయి. మంచికి న్యాయం జరిగి చెడుకు శిక్ష పడుతుందని నమ్ముదాం.

## 2018బిల్లును తిరగరాయాలి..

బాధితులకు స్వాంతన కలిగించే దాని కన్నా ప్రమాదమే ఎక్కువ. ఇంకా ఇంకా కఠినమైన చట్టాల రూపకల్పన కన్నా కూడా, వున్న చట్టాలని శక్తివంతంగా అమలు చేసే వ్యవస్థలను రూపొందించ గలిగితే ఫలితాలు ఎక్కువ వుంటాయనే విషయం అనేక సార్లు అనేక అంశాలలో నిరూపించబడింది. బాధిత సమూహాల అనుభవాలను, సమస్యను పరిష్కరించటంలో దీర్ఘ కాలంగా పనిచేస్తున్న వారి అనుభవాలను, సమస్యతో ముడిపడి వున్న అనేక రంగాలకు చెందిన వారి అనుభవాలను పరిగణనలోకి తీసుకోకుండానే ఈ బిల్లును తయారు చేశారన్నది ప్రధానమైన సమస్య. ఇప్పటికే మానవ అక్రమ రవాణాని అరికట్టటానికి, బాధితులు లైంగిక దోపిడీకి, వ్యవస్థీకృత వ్యభిచారానికి గురవకుండా ఆపటానికి మన భారత నేరస్మృతిలో సెక్షన్ 370, 370ఏ వున్నాయి. మరి కొత్తగా తీసుకు రాబోతున్న చట్టానికి, అంతకుముందు నుంచి అమలులో వున్న చట్టాలకు, అందులోని సెక్షన్లకు కార్యాచరణ సంబంధం ఏ విధంగా వుండబోతుంది? ఇప్పటి వరకూ వున్న చట్టాలలో వెట్టి చాకిరీ నిరోధక కార్మిక చట్టం, రాష్ట్రాల మధ్య, దేశాల మధ్య వుండే వలస కార్మికులు, కార్మిక చట్టాలు, పిల్లలకు న్యాయ మందించే చట్టాలు, అనైతిక మానవ అక్రమ రవాణా నియంత్రణ చట్టం... ఇలా వున్న చట్టాలు అమలులో వుంటాయా లేక ఏమవుతాయనేది ఎక్కడా స్పష్టత లేదు. పైగా వంచనకు గురయి, మానవ అక్రమ రవాణాకు గురయ్యే మనుషులను కాపాడటం అనే పేరుతో అంతులేని నిర్బంధ అధికారా లను పోలీసులకు కట్టబెట్టే ప్రయత్నం చాలా ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఈ బిల్లు చట్ట రూపంలో బయటకు వస్తే పోలీసుల నిర్బ ంధం సామాన్య ప్రజల మీద, అణగారిన సమూహాల మీద మరింత పెరుగుతుంది. వారి జీవితాలు మరింత ప్రమాదంలో పడను న్నాయి.

అనేక సంవత్సరాల నుంచీ ఈ అంశాల గురించి మాట్లాడుతున్నా కానీ, ఆచరించి తీరాల్సిన విధానాల గురించి ఎంతో మంది మాట్లాడుతున్నా గానీ అవి ప్రభుత్వాల ఆచరణలోకి రావటం లేదు. ఏ మాత్రం శిక్షా పరిధిలోకి తీసుకు రాకుండా బాధితులనే నేరస్థులుగా మార్చి, పునరావాసం పేరుతో వారిని సంవత్సరాల పాటు సామాజిక జీవనానికి దూరం చేసేలాంటి శిక్షలను ప్రతి పాదించే ఇలాంటి బిల్లులను ఈ సమూహాలన్నీ నిర్ద్వందంగా వ్యతిరేకిస్తున్నాయి. రాజ్యాంగ పరంగా ప్రజాసమూహాలతో, ముఖ్యంగా బాధిత సమూహాలతో ఒక సమగ్రమైన చర్చ జరిపి, మార్పులను తీసుకున్న తర్వాతే వాటిని ఆమోదించాలని అన్ని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేస్తున్నాయి. తమకు మద్ధతుగా పౌర సమాజం స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నాయి. ప్రస్తుత చలికాలం పార్లమెంటు సమావేశాలలో అనేక ప్రతిపక్ష రాజకీయ పార్టీలు ఈ రెండు బిల్లుల సంపూర్ణమైన చర్చ జరగాలని, అందు కోసం పార్లమెంటు స్టాండింగ్ కమిటీకి పంపించి తీరాలని ప్రతిపాదించాయి. కేంద్రంలో వున్న అధికార పార్టీ ఈ విజ్ఞప్తిని మన్నిస్తుందా లేక రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా, బాధితులకే అత్యంత క్రూరమైన శిక్షలను ప్రతిపాదించే ఇలాంటి నేరపూరిత చట్టాలకి ఆమోద ముద్ర వేస్తుందా? కాలమే చెప్పాలి.

**కె. సజయ, సామాజిక విశ్లేషకులు, స్వతంత్ర జర్నలిస్ట్**
**ప్రజాతంత్ర సౌజన్యంతో...**

## చట్టం క్షేత్రస్థాయిలో అమలు కావాలి..

**పోక్సో చట్టాన్ని కఠినతరం చేసిన కేంద్ర కాబినెట్**

పిల్లల ను లైంగిక వేధింపుల నుండి రక్షించే చట్టం పిఓసీఎస్ఓను మరింత కఠిన తరం చేస్తూ నరేంద్ర మోడీ కాబినెట్ నిర్ణయం తీసుకుందని కేంద్రన్యాయ శాఖ మంత్రి తెలిపారు. ఈ చట్టం సవరణ ప్రకారం పన్నెండు సంవత్సరాల లోపు బాలికల పై లైంగిక దాడికి పాల్పడితే మరణశిక్ష, 21 సంవత్సరాల లోపు బాలికల పై లైంగిక దాడి చేస్తే 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష పడేలా సవరించారు, దీనికి పార్లమెంటు ఆమోదం తెలపాల్సి వుంది.

కేంద్ర ప్రభుత్వం కేవలం చట్టాలను సవరిస్తూ ఆ సవరణలను పుస్తకాలకు పరిమితం చేస్తూ పిల్లల కు తాను అండగా నిలిచినట్లు చెబుతున్నది కానీ కింద స్థాయి లో చట్టాల అమలు గానీ,బాధితులను ఆర్థికంగా ఆదుకోవడం కానీ, పిల్లల ను పరిరక్షించాల్సిన పోలీసులు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ,బాలల రక్షణ యూనిట్ అధికారులకు, న్యాయ వ్యవస్థ కు అవగాహన కల్పించనంత వరకు ఈ సవరణలు అర్థం లేకుండా పోతాయని, క్షేత్ర స్థాయిలో అమలు, అవగాహన కల్పించాలని బాలల హక్కుల సంఘం డిమాండ్ చేస్తున్నది.

పోక్సొ ( ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అబ్యూజ్ ) 2012 భారత రాజ్యాంగ సవరణ ద్వారా పిల్లల పై లైంగిక అత్యాచారాల కు పాల్పడే వారిని పదేళ్ల కఠిన కారాగార శిక్ష పడేటట్లు చట్టం చేశారు.


ఈ చట్టం ద్వారా అమ్మాయి లను కానీ అబ్బాయి లను కానీ లైంగిక వేధింపుల కు గురి చేస్తే ఈ చట్టం ప్రకారం కేసు నమోదు చేస్తారు బాధితుల వయసు 18 లోపు వుండాలి అలిగే 18 సంవత్సరాల లోపు వయసు కలిగిన వారితో వారి అనుమతి వున్నా లేకున్నా శృంగారం జరిపితే అదినేరమోతుంది, బాల్య వివాహం జరిగి ఇద్దరి మధ్య లైంగిక సంబంధం ఏర్పడినా పోక్సొ చట్టం కిందకు వస్తుంది.

ఈ చట్టానికి ఇటీవల సవరణ చేస్తూ చట్టాన్ని కఠినతరం చేసింది పన్నెండు సంవత్సరాల లోపు పిల్లల పై లైంగిక దాడికి పాల్పడితే మరణశిక్ష విధించేలా,21 సంవత్సరాల అమ్మాయి లో పై లైంగిక వేధింపుల కు పాల్పడితే ఇరువై సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించే లా చట్టం సవరణ కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది కానీ ఈ సవరణ పార్లమెంటు ఆమోదం తెలపాల్సి వుంది.

ఈ చట్టం ప్రకారం బాధితుల పేరు చిరునామా రహస్యంగా వుంచాలి, పోలీసులు బాధితులను స్టేషన్ వద్దికి రమ్మని పిలవకుండా బాధితులకు అనువైన చోటికి మహిళా పోలీసులు మాత్రమే వెళ్లి బాధితుల వాంగ్మూలం నమోదు చేయాలి బాధితులకు ఇబ్బంది కర ప్రశ్నలు వేయకూడదు అలాగే ప్రభుత్వమే న్యాయవాది ని ఏర్పాటు చేయడం,మానసికనిపుణుల ద్వారా కౌన్సెలింగ్ ఇప్పించడం లక్ష రూపాయల తక్షణ ఆర్థిక సహాయం అందించాలి, పోలీసులు కానీ, మాధ్యమాలు కానీ బాధితుల పేర్లు కానీ చిరునామా కానీ ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించకూడదు.

**పి. అచ్యుత రావు**
**బాలల హక్కుల సంఘం.**

## 'చిటికె'లో సాధ్యం..!



- రెండు వంతుల ఆలివ్ నూనెలో ఒక వంతు నిమ్మరసం కలిపి ఫర్నిచర్‌ని తుడిస్తే మరకలు పోయి కొత్తవాటిలా తళతళా మెరుస్తాయి.
- ఆలివ్‌నూనెలో దూది ముంచి దాంతో ముత్యాలు, నగలను తుడిస్తే మురికి తొలగిపోతుంది.
- ఉప్పు అద్దిన నిమ్మకాయతో బట్టలపై ఉండే నూనె మరకలను తుడిస్తే మరకలు మాయమవుతాయి.

## ముంగిట్లో ముగ్గు



## మన్మోహన్ బయోపిక్ ట్రైలర్ మాయం



బాలీవుడ్ దిగ్గజ నటుడు అనుపమ్ ఖేర్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్'. భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ జీవితం ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. ఇటీవల విడుదలైన ఈ చిత్రం ట్రైలర్ యూట్యూబ్ లో కనిపించడంలేదు. మొన్నటి వరకు యూట్యూబ్ లో ట్రెండింగ్ లో కొనసాగిన ఈ ట్రైలర్ ఇప్పుడు చూస్తే కనీసం 50వ స్థానంలో కూడా లేకపోవడంతో ఈ పరిణామం పై అనుపమ్ ఖేర్ అసంతృప్తిని వ్యక్తం చేశారు. మన్మోహన్ సింగ్ ప్రధాని గా వున్నప్పుడు ఆయన దగ్గర మీడియా సలహాదారుడిగా పని చేసిన సంజయ్ బారు రాసిన మన్మోహన్ బయోపిక్ పుస్తకం ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఇక ట్రైలర్ విడుదలైయ్యాక ఈ చిత్రం పై కాంగ్రెస్ పార్టీ అభ్యతరం వ్యక్తం చేసింది. విజయ్ రత్నాకర్ తెరకెక్కించిన ఈ చిత్రం ఈనెల 11న విడుదలకానుంది. రకరకాల రాజకీయ కారణాలతో ఈ ట్రైలర్‌ని తొలగించే దుర్మార్గం చేశారా? అంటూ ఆసక్తికర చర్చ సాగుతోంది.

## ఆ పెళ్లిలో వీళ్ల పెళ్లిపై?!






దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి తనయుడు కార్తికేయ వివాహ మహోత్సవం జైపూర్ లో జరిగిన సంగతి తెలిసిందే. ఈ మూడురోజుల పెళ్లి వేడుకలో టాలీవుడ్ నుంచి ప్రముఖ స్టార్లు సందడి చేశారు. అందులో డార్లింగ్ ప్రభాస్ సందడి హైలైట్. అసలే డార్లింగ్.. పైగా స్వీటీతో కలిసి ఈ పెళ్లికి రావడంతో ఒకటే ఆసక్తికర చర్చ సాగింది. మీడియా అటెన్షన్ మొత్తం ఈ జంటపైనే. దీంతో కార్తికేయ– పూజా ప్రసాద్ పెళ్లి గురించి కంటే ప్రభాస్ రాజు అనుష్క శెట్టి పెళ్లెప్పుడు? అన్న ఆసక్తికర చర్చ వెన్యూ దగ్గర సాగిందట. పెళ్లికని వచ్చి ఇలా బుక్కయ్యారేంటో! అంటూ అభిమానుల్లో ఒకటే ఆసక్తికర చర్చ సాగుతోంది. డార్లింగ్ అభిమానుల్లో, ఫిలింసర్కిల్స్ లో వేడి పెంచుతోంది ఈ ప్రచారం. అటు ఉత్తరాది మీడియా సైతం చూడ ముచ్చటైన జంట అంటూ ప్రభాస్ అనుష్కనే ఎక్కువ ఫోకస్ చేసేసింది. ఆ పెళ్ళిలో ప్రభాస్ స్వీటీ ఇద్దరు అందరి దృష్టిని ఆకర్షించారు. జంటగానే అక్కడికి వచ్చిన అతిథుల్ని రిసీవ్ చేసుకోవడం.. పెళ్లి పనుల్లో రాజమౌళికి సహాయం చేస్తుండటం జనం కంట పడింది. పనిలో పనిగా మధ్య మధ్యలో ఆ ఇద్దరూ కబుర్లాడుకోవటం పలు అనుమానాలకు తావిచ్చిందట. రాజస్థానీ స్టైల్ లో సంగీత్ కార్యక్రమంలో సంగీతానికి ఈ జోడీ డ్యాన్సులు చేయడంపైనా ఆసక్తికర చర్చ సాగుతోంది. మొన్ననే కాఫీ విత్ కరణ్ షోలో అసలు పెళ్లి ఇప్పట్లో లేనేలేదని కరాఖండిగా చెప్పేసిన డార్లింగ్ ఈలోగానే ఇలా చేస్తున్నాడేం? ఇంతలోనే మనసు మార్చుకున్నాడా? అసలేం జరుగుతోంది? అంటూ ఫిలింనగర్లో మరోసారి గుసగుసలు మొదలయ్యాయి.

సోగ్గాడే చిన్ని నాయనా, నవాబ్, సర్కార్ వంటి చిత్రాల్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా రిలీజ్ చేసి విజయాలు అందుకున్నారు అశోక్ వల్లభనేని. తమిళ హీరో విజయ్‌కి తెలుగులో మార్కెట్ రేంజు పెంచిన నిర్మాతగా పేరు మార్మోగిపోతోంది. ఆయన రిలీజ్ చేస్తున్నవన్నీ భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన క్రేజీ సినిమాలే. అగ్ర కథానాయకుల సినిమాల్ని తెలుగులో అనువదించి రిలీజ్ చేసి హిట్లు కొడుతున్నారు. ప్రస్తుతం సూపర్‌స్టార్ రజనీకాంత్ కథానాయకుడుగా కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వం వహించిన పేట (పేట్ట) చిత్రాన్ని సంక్రాంతి కానుకగా తెలుగు రాష్ట్రాల్లో ఈనెల 10న రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ ఫిలించాంబర్ లో ఆయన పాత్రికేయులతో ముచ్చటించారు. అశోక్ వల్లభనేని చెప్పిన ఆసక్తికర సంగతులివి..

## ఫోన్ పెట్టెయ్ .. పేట సూపర్‌హిట్ అన్నారు!


అశోక్ వల్లభనేని

రజనీకాంత్ ఒక స్ఫూర్తి. ఆయన ఒక బస్ కండక్టర్‌గా మొదలై, దక్షిణాదితో పాటు ఆల్ ఇండియా సూపర్‌స్టార్ ఆయన. కాబోయే సీఎం అని కూడా అంటున్నారు. ఆయన స్ఫూర్తితోనే నేను ఆయన సినిమా తీసుకున్నా. అలాగే రజనీ కాంత్ సేవా గుణం నాకు ఇష్టం. ఆయన తమిళంలోనే కాదు.. తెలుగు వారికి ఏం చేశారు? అనే దానికి నేను కొంత సామాజిక సేవ చేయబోతున్నా. నా సినిమా తరపునుంచి.. నా వైపు నుంచి రజనీ చేతులమీదుగా కొన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేయాలనుకుంటున్నా.. అనాధాశ్రమాలు అవసరార్థులకు సాయం చేయబోతున్నా. ఈ నెల 6న జరగబోయే పేట ప్రీ రిలీజ్ వేడుకలో రెండు, మూడు అనాథ శరణాలయాలకు రజనీ చేతుల మీదుగా నగదును చెక్స్ రూపంలో అందించబోతున్నాం.

**రజనీ పాతికేళ్లు వెనక్కి:** ఈ సినిమా దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు రజనీకి వీర భక్తుడు. హిట్టు కొట్టకపోతే ఆత్మహత్య చేసుకుంటానని అన్నారని విన్నాను. ఆయన అంత కాన్ఫిడెంట్‌గా అన్నారంటే ఎంతో నమ్మకంతోనే కదా? ట్రైలర్‌ను చూస్తే రజనీకాంత్ పాతికేళ్లు వెనక్కి వెళ్లిపోయారనిపించేంత గొప్పగా ఉంది. రజనీ గత చిత్రాలతో పోల్చితే తర్వాతి లెవల్ లో ఉండే సినిమా ఇది. అలాగే అనిరుధ్ అద్భుతమైన సంగీతం అందించారు. పాటలకు చాలా చక్కని స్ప ందన వచ్చింది. జనవరి 6న హైదరాబాద్ జేఆర్‌సీ సెంటర్ లో పేట ప్రీరిలీజ్ వేడుక చేయనున్నాం. రజనీ సహా టీమ్ హాజరయ్యే అవకాశం ఉంది.

**విజయ్ మార్కెట్ పెరిగింది:** మణిరత్నం నవాబ్, మురుగదాస్ సర్కార్ చిత్రాల్ని నేను రిలీజ్ చేశాను. ఈ చిత్రాలకు ఎవరూ ఇవ్వని ఆఫర్ ఇచ్చి నేను రైట్స్ తీసుకున్నా. విజయ్ సినిమాలు ఇన్ టైమ్ లో రిలీజ్ కాలేదు. సర్కార్ చిత్రాన్ని సాఫీగా రిలీజ్ చేసి, విజయ్ కి మంచి మార్కెట్ ని క్రియేట్ చేయగలిగానని గర్వంగా చెప్పుకోగలిగాను. నా గత చిత్రాలు బాగా రిలీజ్ చేసాను కాబట్టి నాపై నమ్మకంతో సన్ టీవీ వాళ్లు ఏ హక్కులు ఇచ్చినా సగం ధరకే ఇస్తారు.

**పేట అంటే అర్థం:** పేట అంటే ఒక ఏరియా.. లేదా ప్రాంతం. చిలకలూరి పేట, నరసారావు పేట తరహాలో ఇదో పేట. ఈ పేటలో రజనీ ఏం చేస్తారో తెరపైనే చూడండి. బావుంటే థియేటర్లు పెరుగుతాయి సంక్రాంతికి తెలుగులో మూడు సినిమాలు రిలీజవుతున్నాయి. అందువల్ల థియేటర్ల పరంగా పోటీ నెలకొంది. అయినా ఎన్ని తక్కువ థియేటర్లు అయినా సినిమా రిలీజ్ చేస్తాం. ఎంత పోటీ ఉన్నా సంక్రాంతి సినిమాలన్నిటికీ ఆదరణ దక్కుతుందన్న నమ్మకం ఉంది. సినిమా బావుంటే ఆటోమేటిగ్గా థియేటర్లు పెరుగుతాయి. 50శాతం బిజినెస్ ఇప్పటికే పూర్తయింది. కొన్నిచోట్ల మేమే రిలీజ్ చేసేందుకు అవకాశం ఉంది.

**నాపై అంత నమ్మకం:** పేట హక్కుల్ని ఎవరూ ధైర్యం చేయనంత పెద్ద ధరకు రైట్స్ ను కొనుక్కున్నా. అలాగే నాపై నమ్మకంతో సన్ నెట్ వర్క్ వాళ్లు సగం ధరకే సినిమా హక్కుల్ని ఇస్తున్నారు. హీరో విజయ్ కి ఇక్కడ మార్కెట్ క్రియేటవ్వడంలో నేను చేసిన హార్డ్ వర్క్ సన్ నెట్ వర్క్ వాళ్లకు తెలుసు. సర్కార్ చిత్రం వేరొక నిర్మాత వదులుకున్నా.. మేం తీసుకుని రిలీజ్ చేసి హిట్ కొట్టాం. పేట సినిమాని రిలీజ్ చేస్తున్న ఒక పంపిణీదారు నాతో మాట్లాడుతూ .. ఫోన్ పెట్టెయ్ .. సినిమా సూపర్‌హిట్టు అన్నారు

**స్ట్రెయిట్ సినిమా చేస్తాను:** తెలుగులో స్ట్రెయిట్ సినిమాను ఈ ఏడాది ప్లాన్ చేస్తున్నాం. కథలు వింటున్నాను. మంచి కథ, హీరో దొరకగానే ప్రకటిస్తాం. చిన్న బడ్జెట్ చిత్రాలు చేయబోతున్నాం. నేను ఏ సినిమా చేసినా చివరి వరకూ ఎఫర్ట్ పెట్టి పని చేస్తాను. విజయం అందుకుంటున్నాను.

**సేవ జీవితంలో భాగం:** నాన్నగారు హైదరాబాద్ లో మరణించారు. ఆయనకు బ్రెయిన్ ట్యూమర్.. ఆ తర్వాత గుండె నొప్పి వచ్చి చనిపోయారు. దాని నుంచి రియలైజ్ కావడానికి కొంత సమయం పట్టింది. సేవలో భాగంగా నాన్న గారి రెండు కళ్లను డొనేట్ చేశాం. ఎల్.వి.ప్రసాద్ కంటి ఆసుపత్రిలో ఓ ఇద్దరికి కళ్లను పెట్టారు. నా వంతుగా నేను రజనీ స్ఫూర్తిగా ఏదో ఒక సేవా కార్యక్రమం చేస్తున్నా.

## బాలీవుడ్‌లో విలన్‌గా..





ఎస్.ఎస్.రాజమౌళి 'బాహుబలి' చిత్రంలో భళ్లాలదేవ పాత్రతో రానా పేరు అన్నిచోట్లా మార్మోగిపోతోంది. తాజాగా బాలీవుడ్‌లో 'హౌస్ ఫుల్ 4' చిత్రంలో అవకాశం అందుకున్నాడు. ఆ చిత్రం నుంచి నానా పటేకర్ తప్పుకోకపోతే పరిస్థితేంటి? ఆ సన్నివేశం క్రియేటవ్వడం అన్నది తనకి కలిసొచ్చిందన్న మాటా వినిపిస్తోంది. అక్టోబర్ లో జరిగిన కొన్ని పరిణామాలతో సీనియర్ నటుడు నానా పటేకర్ ఈ చిత్రం నుంచి తప్పుకున్నాడు. అంత పెద్ద స్టార్ కోసం రాసుకున్న పాత్రకు దర్శకరచయిత ఫర్హాద్ సామ్జీ రానానే ఏరికోరి ఎంపిక చేసుకున్నాడంటే అది ఓ రకంగా ఆయాచితంగా కలిసొచ్చిన అదృష్టం అనే భావించాలి. తనూశ్రీ దత్తా వేదింపుల వ్యవహారంలో నానా పటేకర్ ఆరోపణలు ఎదుర్కోవడం ప్రాజెక్టు నుంచి తప్పుకోవాల్సొచ్చింది. అలాగే ఈ చిత్రానికి దర్శకత్వం వహించాల్సిన సాజిద్ ఖాన్ అదే తరహాలో లైంగిక ఆరోపణల వల్లనే తప్పుకున్నాడు. అలా ఫర్హాద్ సామ్జీ తెరపైకి వచ్చాక .. రానాకు ఛాన్సొచ్చింది. 'హౌస్ ఫుల్ 4' చిత్రంలో కిలాడీ అక్షయ్ కుమార్, రితేష్ దేశ్‌ముఖ్, బాబి డియోల్ లాంటి బెస్ట్ స్టార్లు ఉండగా, రానా పాత్ర ప్రాధాన్యత ఎంత? అంటే దానికి సమాధానం దర్శకుడు రివీల్ చేశారు. ఈ చిత్రంలో రానా పాత్ర ఒక 'థ్రెట్' అని సీక్రెట్ ని ఓపెన్ చేసేశారు. ఈ పాత్ర గురించి ఇప్పుడే చెప్పేయడం సరికాదు.. అయితే రానా పాత్ర సినిమాలో ఎంతో కీలకమైనది అని తెలిపారు. రానా థ్రెట్ అంటే అతడే విలన్ అని అర్థమవుతోంది.

## పెళ్లికి గ్రీన్‌సిగ్నల్



2.0 చిత్రంలో లేడీ రోబోట్‌గా నటించి మైమరిపించింది ఎమీజాక్సన్. ఇండియాస్ బెస్ట్ హిట్ చిత్రంలో నటించిన ఈ బ్యూటీ సక్సెస్ సెలబ్రేషన్స్ లో కనిపించకపోవడం ఆశ్చర్యపరిచింది. అయితే ఆ టైమ్లోనే ఈ అమ్మడు అటు లండన్ ప్రియుడు జార్జి పనాయటౌతో షికార్లు చేస్తూ దర్శనమిచ్చింది. ఈ భామ నిరంతరం ప్రయాణాలతోనే బిజీబిజీగా గడిపేస్తుం టుంది. ఇండియా నుంచి లండన్, లండన్ నుంచి ఎగ్జోటిక్ లొకేషన్లకు పయనమవుతుంటుంది. ప్రతి ఎగ్జోటిక్ జర్నీలో బోయ్‌ఫ్రెండ్ జార్జి తప్పనిసరి. తాజాగా న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ ని ఈ జంట జాంబియాలో చిలౌట్ చేశారు. అక్కడ అసలు సౌండ్ అనేదే వినిపించే నిశ్శబ్ద ప్రాంతంలో ఈ జంట ప్రణయంలో మునిగి తేలింది. ప్రస్తుతం ఇదో హాట్ టాపిక్. ఎగ్జోటిక్ లొకేషన్ సెలబ్రేషన్స్ ని ఫోటోల రూపంలో ఎమీజాక్సన్ అభిమానులకు షేర్ చేసింది. "లైఫ్‌లో కొత్త సాహసాలు స్టార్టెడ్... ఐ లవ్ యు... ప్రపంచంలోనే బెస్ట్ హ్యాపీ గాళ్‌ని అయినందుకు ఎగ్జయిటింగ్" అంటూ ప్రియుడితో సెలబ్రేషన్స్ మూడ్ లో కి వెళ్లిపోయింది. ఎమీజాక్సన్ ఈ ఉత్సాహంలోనే ఓ కీలకమైన హింట్ ని ఇచ్చింది. ఈ ఏడాది మా పెళ్లి ఉంటుంది అని అర్థం వచ్చేలా నిశ్చితార్థ ఉంగరం ఈమోజీని ఇన్స్టాలో షేర్ చేసింది. మొత్తానికి కొత్త సంవత్సరంలో ఈ అమ్మడు పెళ్లి చేసుకుని ఓ ఇంటిది కాబోతోందన్నమాట.

## వర్జినిటీ నిధి కాదు



బాలీవుడ్ నటి కల్కి కొచ్లిన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేసింది. కన్యత్వమనేది నిధి కాదని కొచ్లిన్ తెలిపింది. పెళ్లి అయ్యేంత వరకు కన్యగా వుండి.. భర్తకు మాత్రమే అంకితం చేయడానికి వర్జినిటీ అనేది నిధి కాదని కల్కి బోల్డ్ కామెంట్స్ చేసింది. పెళ్లయ్యే వరకు సెక్స్‌కు దూరంగా వుండాలని అనడం ఏమిటి? అంటూ ప్రశ్నించింది. అది పూర్తిగా వారి వ్యక్తిగత విషయమని కల్కి చెప్పుకొచ్చింది. బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ వివాహం చేసుకున్న కల్కి కొంత కాలానికి తర్వాత అతడి నుంచి విడాకులు పొందింది. మీటూ ఉద్యమంలో భాగంగా శృంగారం ప్రస్తావన సాగడంతో.. ఆడవాళ్లకు సెక్స్ విషయంలో నో అనేందుకు ఎంత హక్కు వుంటుందో.. అంతే హక్కు.. ఎస్ అని చెప్పే విషయంలోనూ వుంటుందని కల్కి తెలిపింది. ప్రస్తుతం కల్కి వ్యాఖ్యలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.



## వజ్ర కవచధర గోవింద

స్టార్ కమెడియన్ రాణిస్తూ సప్తగిరి ఎక్స్‌ప్రెస్, సప్తగిరి ఎల్ఎల్‌బీ చిత్రాలతో హీరోగా తనకంటూ ఓ రూట్‌ని ఏర్పరుచుకున్నారు సప్తగిరి. ఆయన హీరోగా 'సప్తగిరి ఎక్స్‌ప్రెస్' తెరకెక్కించిన దర్శకుడు అరుణ్ పవార్ దర్శకత్వంలో శివ శివమ్ ఫిలింస్ పతాకంపై నరేంద్ర యెడల, జీవీఎన్ రెడ్డి ఓ చిత్రాన్నినిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'వజ్ర కవచధర గోవింద' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. దర్శకుడు అరుణ్ పవార్ మాట్లాడుతూ.. "ఈ కథకు కరెక్ట్ టైటిల్ ఇది. ఇందులో సప్తగిరి పాత్ర పేరు గోవిందు. ఇతనొక ఫన్నీ దొంగ. ఇతనికో లక్ష్యం ఉంటుంది. ఆ లక్ష్య సాధన కోసం అతనేం చేశాడన్నదే ఈ సినిమా ప్రధాన కథాంశం. కడుపుబ్బా నవ్వించే అంశాలతోపాటు, మంచి యాక్షన్, ఎమోషన్, ఇతర వాణిజ్య అంశాలు కూడా ఇందులో బాగా కుదిరాయి. సప్తగిరి బాడీ లాంగ్వేజ్కి పర్ఫెక్టా సూటయ్యే కథ ఇది" అని చెప్పారు. నిర్మాతలు నరేంద్ర యెడల , జీవీఎన్ రెడ్డి మాట్లాడుతూ.. 'సప్తగిరి ఎక్స్‌ప్రెస్' లాంటి సూపర్ హిట్ తర్వాత సప్తగిరి, అరుణ్ పవార్ కాంబినేషన్లో సినిమా చేసే అవకాశం మాకు దక్కడం చాలా హ్యాపీగా ఉంది. ఇదొక హిలేరియస్ యాక్షన్ ఎంటర్‌టైనర్. ఇప్పటికి 60 శాతం చిత్రం పూర్తయింది. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం" అని తెలిపారు.

## ఉన్మాది వీరంగం



ప్రవీణ క్రియేషన్స్ పతాకంపై ప్రొడక్షన్ నెం.2గా ఎన్.కరణ్ రెడ్డి సమర్పణలో రూపొందుతోన్న చిత్రం 'ఉన్మాది'. ఎన్.ఆర్.రెడ్డి కీలక పాత్రలో నటిస్తూ దర్శకత్వం వహించారు. ఎన్.రామారావు నిర్మాత. డేవిడ్ సంగీతం అందించిన ఈ సినిమా పాటలను రాజ్‌కందూరి ఆవిష్కరించారు. ట్రైలర్‌ను ఎన్.శంకర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ...డైరెక్టర్ ఎన్.శంకర్ మాట్లాడుతూ –"ఈ సినిమాకు కథ, స్క్రీన్ ప్లే, డైలాగ్స్, డైరెక్షన్ చేయడానికి చాలా ధైర్యం కావాలి. ఎన్.ఆర్.రెడ్డి ధైర్యంగానే తీశారు. ట్రైలర్ చాలా బాగుంది. తమిళ్‌లో రాజ్ కుమార్ కూడా ఇదే ఏజ్‌లో హీరోగా పరిచయం అయ్యారు. ఎన్.ఆర్.రెడ్డి పవర్ఫుల్ పోలీస్ ఆఫీసర్ రోల్లో అద్భుతంగా నటించారు. హీరోయిజం, విలనిజం రెండూ చూపించదగిన క్యారెక్టర్. టీం అందరికి ఆల్ ధి బెస్ట్" అన్నారు. నిర్మాత రాజ్ కందుకూరి మాట్లాడుతూ –చిన్న సినిమా పెద్ద హిట్ కొట్టాలి అన్నారు.

## ఏవీఎస్ లేని లోటు తెలుస్తోంది!

యాక్టివ్ స్టూడియోస్ బ్యానర్ పై ఎ.జి.ఆర్.కౌశిక్ సమర్పిస్తున్న చిత్రం 'వైదేహి'. ఎ.జనని ప్రదీప్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సీనియర్ నటుడు కమెడియన్, క్యారెక్టర్ ఆర్టిస్ట్ కీ.శే.ఎవిఎస్ కుమారుడు ఎ.రాఘవేంద్రప్రదీప్ దర్శకత్వం వహిస్తున్నారు. జనవరి 2న ఏవీఎస్ జయంతి సందర్భంగా రామానాయుడు స్టూడియోలో ట్రైలర్ వేడుక నిర్వహించారు. ఎన్.శంకర్ ట్రైలర్ ఆవిష్కరించారు. సీనియర్ పాత్రికేయులు రామారావుతో బర్త్ డే కేక్ కట్ చేశారు. రామారావు మాట్లాడుతూ–"ఏవీఎస్‌తో నాకు చాలా అనుబంధం ఉంది. జర్నలిస్ట్ గా ప్రయాణం మొదలుపెట్టిన ఆయన బాపు–రమణలు అంటే ఆయనకు చాలా ఇష్టం. హైదరాబాద్‌లో ఒక ఇల్లుని నిర్మించి ఆ ఇంటికి బాపు–రమణల పేరును పెట్టారు. ఆయన కుమారుడు దర్శకుడవ్వడం ఆనందంగా ఉంది. ఆయనకి మంచి పేరు రావాలి" అన్నారు. ఎన్.శంకర్ మాట్లాడుతూ... ఎవిఎస్ నాకు మంచి మిత్రులు చాలా మందితో మంచి అనుబంధం ఉన్నా నాతో ఒక ప్రత్యేకమైన అనుబంధం ఉంది. అందరితో చక్కగా కలిసిపోతారు. ఆయనకు ఉన్న సినిమా, సాహిత్యం అన్నీ ఓ పట్టుపట్టారు. తెలుగు ఇండస్ట్రీలో ఎవిఎస్ లేని లోటు తెలుస్తోంది. ఆయన మంచితనం, ఆయన స్నేహం మరపురానికి ఎప్పుడూ గుర్తుకువస్తూనే ఉంటాయి. 90శాతం ఇలాంటి హారర్ చిత్రాలు సక్సెస్ సాధ్యమే. ప్రదీప్ తొలి అడుగే ఇలాంటి జోనర్‌తో వస్తున్నాడంటే కచ్చితంగా సక్సెస్ సాధిస్తారు. ట్రైలర్ బావుంది" అన్నారు. దర్శకుడు ప్రదీప్ మాట్లాడుతూ–"నాన్నగారి పుట్టినరోజు థియేట్రికల్ ట్రైలర్ లాంచ్ అవుతుందని ముందుగా నేను అనుకోలేదు. సడెన్‌గా అలా కుదిరింది. నేను కథ ఎంచుకుని వేచి చూస్తున్న టైంలో నా వెంటే వుండి నన్ను వెను తట్టి నడిపింది నా స్నేహితులే. కలిసికట్టుగా పని చేశాం. పెద్దల ఆశీస్సులతో విజయం అందుకుంటాం" అన్నారు. మహేష్, ప్రణతి, సందీప్, అఖిల, లావణ్య, ప్రవీణ్, వెంకటేష్, ఎ.వి.హాసిని, ఎ. రాఘవేంద్రప్రదీప్, శ్రీహర్ష, క్రిష్ణ, తేజ, రమేష్, చంద్రకాంత్ తదితరులు నటిస్తున్నారు. కెమెరా: దేవేంద్రసూరి, కథ–కథనం– దర్శకత్వం, డైలాగ్స్ ఎ.రాఘవేంద్రప్రదీప్.



**కోడిగుడ్లు** రిటైల్ ధర (100కు)

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 439 | విజయవాడ | 453 |
| ముంబయి | 494 | ఢిల్లీ | 460 |
| చెన్నై | 445 | బెంగళూరు | 445 |



**బ్రాయిలర్ చికెన్** ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 120 | ఢిల్లీ | 130 |
| కరీంనగర్ | 115 | ముంబయి | 125 |
| వరంగల్ | 110 | చెన్నై | 132 |



**సెన్సెక్స్** –363.05
**35,891**



**నిఫ్టీ** –117.60
**10,792**

**రూపాయి**
**₹70.16**
(ఒక అమెరికా డాలర్‌కు)



**పసిడి**
**32,310.20**
(హైదరాబాద్‌లో) 10 గ్రాములకు/(రూ.)లలో

## 5జీ స్మార్ట్‌ఫోన్‌లను విడుదల చేయనున్న సోనీ..?



**ఢిల్లీ:** ఎలక్ట్రానిక్స్ తయారీదారు సోనీ ఈ నెల 7వ తేదీన కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ షో (సెస్) 2019 సందర్భంగా ఓ ప్రత్యేక ఈవెంట్‌ను నిర్వహించనుంది. సెస్ 2019 జనవరి 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరగనుండగా అంతకు ఒక్క రోజు ముందు సోనీ ఈవెంట్‌ను నిర్వహిస్తున్నది. అందులో భాగంగా సోనీ కంపెనీ పలు నూతన ఎక్స్‌పీరియా స్మార్ట్‌ఫోన్‌లను విడుదల చేస్తుందని తెలుస్తుండగా, అవి 5జీ ఫోన్‌లు అయి ఉంటాయని సమాచారం. ఇప్పటికే అనేక మొబైల్ తయారీ కంపెనీలు మేం ముందంటే మేము ముందు అని 5జీ ఫోన్‌లను మార్కెట్‌లోకి తెచ్చేందుకు తహతహలాడుతుండగా అందరికన్నా ముందుగానే సోనీ ఆ ప్రయత్నం చేస్తుందని తెలిసింది. అయితే ఈ నెల 7వ తేదీ వరకు వేచి చూస్తే గానీ అసలు వివరాలు తెలియవు.

# పతనమైన స్టాక్ మార్కెట్‌లు


- సెన్సెక్స్ 360 పాయింట్లు పతనం, 10,800 దిగువకు నిఫ్టీ
- లాభపడిన టీసీఎస్, ఇన్ఫోసిస్ షేర్లు



**ముంబై:** ఆసియా మార్కెట్ల బలహీన సంకేతాలు, విదేశీ పెట్టుబడుల వెనక్కి మళ్లడంతో బుధవారం దేశీయ మార్కెట్లు భారీగా పతనమయ్యాయి. అమ్మకాల ఒత్తిడితో ఆరంభం నుంచే కుదేలైన సూచీలు అంతకంతకూ దిగజారుతూ వచ్చాయి. ఫలితంగా బుధవారం ట్రేడింగ్‌లో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీ సెన్సెక్స్ 360 పాయింట్లకు పైగా కోల్పోయి 36వేల దిగువకు పడిపోగా.. నిఫ్టీ 10,800 పాయింట్ల స్థాయిని కోల్పోయింది. అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాలతో బుధవారం ఉదయం సూచీలు బలహీనంగా ప్రారంభమయ్యాయి.

200 పాయింట్ల నష్టంతో ట్రేడింగ్‌ను ఆరంభించిన సెన్సెక్స్ ఆ తర్వాత కాస్త కోలుకున్నట్లే కన్పించినా.. లోహ, ఆటోమొబైల్ రంగాల షేర్లలో వెల్లువెత్తిన అమ్మకాల ముందు సూచీలు నిలబడలేకపోయాయి. ఫలితంగా భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి. బుధవారం మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 363 పాయింట్లు పతనమై 35,891 వద్ద, నిఫ్టీ 118 పాయింట్ల నష్టంతో 10,792 వద్ద స్థిరపడ్డాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ 70.06గా కొనసాగుతోంది. ఎన్‌ఎస్‌ఈలో సన్‌ఫార్మా, భారతీ ఇన్‌ఫ్రాటెల్, టీసీఎస్, ఏషియన్ పెయింట్స్, ఇన్ఫోసిస్ షేర్లు లాభపడగా.. ఐషర్ మోటార్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్స్, టాటాస్టీల్, వేదాంతా, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు భారీగా నష్టపోయాయి.

## ఆన్‌లైన్ మందుల అమ్మకాల నిషేధంపై స్టే



**ఢిల్లీ:** ఆన్‌లైన్ ఔషధాలను అమ్మే విధానాన్ని నిషేధించాలని గత నెలలో ఏక సభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై తాజాగా మద్రాస్ హైకోర్టులోని ద్విసభ్య ధర్మాసనం నిలుపుదల ఉత్తర్వులు (స్టే) ఇచ్చింది. దీనిపై ప్రభుత్వం చట్టబద్ధమైన మార్గ దర్శకాలు రూపొందించేవరకూ స్టే కొనసాగుతుందని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈఫార్మా సంస్థలు దాఖలు చేసిన పలు పిటిషన్లపై విచారణ జరిపిన జస్టిస్ ఎం.సత్యనారాయణన్, జస్టిస్ పి.రాజమాణిక్యంతో కూడిన ధర్మాసనం.. ఈ మేరకు తీర్పు వెలువరించింది.ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాల నిషేధం 30 నుంచి 40 లక్షల రోగులపై ప్రభావం చూపుతుందని, దీని వల్ల రానున్న రెండు నెలల్లోనే పరిశ్రమ రూ.300 కోట్ల వరకూ నష్టపోవాల్సి వస్తుందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. "మద్రాసు హైకోర్టు తీర్పుతో మేం చాలా సంతోషంగా ఉన్నాం. ప్రజలు ఆర్డర్ చేసిన మేరకు మందులను మేం నిబద్ధతతో సరసమైన ధరలకు అందించేందుకు మరింత కృషి చేస్తాం." అని ఓ ఆన్‌లైన్ ఫార్మసీ సంస్థ వ్యవస్థాపకుడు ఆనందం వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ ఔషధాల అమ్మకాలను నిషేధించాలని కోరుతూ ఓ వ్యక్తి ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. డ్రగ్స్, కాస్మోటిక్స్ చట్టం1940, ఫార్మసీ చట్టం 1948 ప్రకారం ఔషధాలను ఆన్‌లైన్ వేదికల్లో అమ్మేందుకు అనుమతి లేదని ఆయన పిల్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం లక్షల సంఖ్యలో మందులు ఆన్‌లైన్ పోర్టళ్ల ద్వారా అమ్ముడవుతున్నందున, పొరపాటున ఔషధ మార్పిడి జరిగితే రోగులతో పాటు వైద్యులకు సైతం ప్రమాదం పొంచి ఉంటుందని వివరించారు. దీనిపై విచారణ జరిపిన ఏక సభ్య ధర్మాసనం ఆన్‌లైన్‌లో మందులను విక్రయించడం నిలిపేయాలని గత నెలలో తీర్పునిచ్చింది.

# ఈపీఎఫ్ ఖాతాదారులకు శుభవార్త

- ఈపీఎఫ్ వడ్డీ రేటును పెంచే యోచనలో కేంద్రం

**ఢిల్లీ:** ఈపీఎఫ్ చందాదారులకు గుడ్ న్యూస్. రానున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఉద్యోగుల ఈపీఎఫ్ ఖాతాల వడ్డీ రేటును పెంపునకు కేంద్రం సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ సంస్థ వార్షిక అంతర్గత రివ్యూలో భాగంగా ఈ వడ్డీరేటు పెంచాలని భావిస్తున్నట్లు సమాచారం. 2018–19కు గాను వడ్డీ రేటును 8.55 శాతం నుంచి పెంచేందుకు యోచిస్తోందట. దీంతో 6 కోట్ల మంది ఈపీఎఫ్ చందాదారులు లబ్ధి పొందనున్నారు. జనవరి మాసాంతంలో జరిగే సెంట్రల్ బోర్డ్ మీటింగ్‌లో తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ ఫిబ్రవరి 1న జారీ చేసే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ఈపీఎఫ్‌వో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ సభ్యుడు ప్రభాకర్ బనసూర్ వడ్డీరేటు పెంపునకు ఎక్కువ అవకాశం ఉందంటూ ధృవీకరించారు. మరో సభ్యుడు వ్యాఖ్యానిస్తూ వాస్తవానికి డిసెంబర్ నెలలో ఈపీఎఫ్ వడ్డీరేటును ప్రకటించాల్సి ఉన్నప్పటికీ అకౌంట్ల ఆడిటింగ్ ఇంకా కొనసాగుతున్న కారణంగా ఆలస్యమైందన్నారు. కాగా 2017–18 ఏడాదికి ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ఈపీఎఫ్ ఖాతాలపై వడ్డీరేటు 8.55శాతంగా ఉంది. ఇది అయిదేళ్ల కనిష్టం.

# ప్రభుత్వ రంగ మూడు బ్యాంకులు విలీనం

- ఆమోదం తెలిపిన కేంద్ర ప్రభుత్వం

**ఢిల్లీ:** ప్రభుత్వ రంగ బ్యాంకులైన దేనా బ్యాంక్, విజయా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా విలీనానికి కేంద్ర ప్రభుత్వం బుధవారం ఆమోదం తెలుపుతున్నట్లు ప్రకటించింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఐదు అనుబంధ బ్యాంకులు విలీనం తర్వాత మరో విలీనానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ వెల్లడించారు. ఈ మూడింటి విలీనం వల్ల ఏర్పడే కొత్త బ్యాంకు ఎస్‌బీఐ, ఐసీఐసీఐ తర్వాత దేశంలోనే మూడో అతిపెద్ద బ్యాంక్‌గా అవతరించనుంది. విలీనం వల్ల సదరు బ్యాంకు ఉద్యోగుల సర్వీసుపై ఎటువంటి ప్రభావం చూపబోదని ఆయన తెలిపారు. ఈ విలీనం వల్ల బ్యాంకు సిబ్బందితో పాటు ఖాతాదారులకు లాభాలు చేకూరతాయని ప్రభుత్వం చెబుతోంది. విలీన ప్రక్రియ ముగిశాక ఏర్పడే కొత్త బ్యాంకులో సుమారు 85వేల మందికి పైగా ఉద్యోగులుంటారు. దేశ, విదేశాల్లో కలిపి దానికి 9,485 శాఖలు ఏర్పడతాయి. ఏప్రిల్1, 2019 నుంచి ఈ విలీనం అమల్లోకి వస్తుంది. ఇదిలా ఉంటే మూడు బ్యాంకుల విలీనాన్ని వ్యతిరేకిస్తూ గత నెల బ్యాంకు యూనియన్లు సమ్మె బాట పట్టిన విషయం తెలిసిందే. బ్యాంకు విలీనం కారణంగా సిబ్బంది తమ ఉద్యోగాలను కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.



# స్పోర్ట్స్

## అచ్రేకర్ సర్ ఇక లేరు

- ప్రముఖ క్రికెట్ కోచ్ పద్మశ్రీ రమాకాంత్ అచ్రేకర్ (87) కన్నుమూత
- క్రికెట్‌లో సచిన్‌కు ఓనమాలు నేర్పిన గురువు



**ముంబయి:** ద్రోణాచార్య పురస్కార గ్రహీత, ప్రముఖ క్రికెట్ కోచ్ రమాకాంత్ అచ్రేకర్ (87) ఇక లేరు. క్రికెట్ దిగ్గజం సచిన్ తెండూల్కర్‌కు ఆటలో ఓనమాలు దిద్దించిన ఆయన బుధవారం సాయంత్రం కన్నుమూశారు. పెద్దవారైన అచ్రేకర్ వృద్ధాప్య సమస్యలతో కన్నుమూశారు. 'ఆయన (అచ్రేకర్ సర్) మనకిక లేరు. ఈ రోజు సాయంత్రం కన్నుమూశారు' అని కుటుంబ సభ్యులు మీడియాకు తెలిపారు. ప్రపంచానికి తిరుగులేని క్రికెటర్ సచిన్‌ను తీర్చిదిద్దిన ఘనత అచ్రేకర్‌కు చెందుతుంది. వినోద్ కాంబ్లి, ప్రవీన్ ఆమ్రె, సమీర్ దిఘె, బల్వీందర్ సింగ్ సంధు, అజిత్ అగార్కర్ వంటి క్రికెటర్లకు ఆయన శిక్షణ నిచ్చారు.

పద్మశ్రీ పురస్కారం గ్రహీత అచ్రేకర్‌కు సచిన్ టెండూల్కర్‌కు ప్రియశిష్యుడు. ఆయనను తన మార్గదర్శకునిగా సచిన్ ఎన్నోసార్లు చెప్పారు. ప్రతి గురుపౌర్ణమికి ఆయన ఇంటికి వెళ్లి గౌరవించేవారు. శాలువా కప్పి సత్కరించేవారు. బాల్యంలో ఆయనెంత కఠినంగా శిక్షణనిచ్చారో గుర్తు చేసుకొనేవారు. 1932లో అచ్రేకర్ జన్మించారు. క్రికెట్ కెరీర్ అంత సవ్యంగా సాగలేదు. 1943లో క్రికెట్ ఆడటం ప్రారంభించారు.



1945లో న్యూ హిందు స్పోర్ట్స్ క్లబ్ తరపున ఆడారు. యంగ్ మహారాష్ట్ర ఎలెవన్, గుల్ మోహర్ మిల్స్, ముంబయి పోర్టుకు ప్రాతినిధ్యం వహించారు. 1963–64 మొయినుద్దౌలా టోర్నీలో ఆల్ ఇండియా స్టేట్ బ్యాంకు జట్టు తరపున హైదరాబాద్‌పై ఒక ఫస్ట్ క్లాస్ మ్యాచ్ ఆడారు. ముంబయిలోని శివాజీ పార్క్ వద్ద కామత్ స్మారక క్రికెట్ క్లబ్‌ను అచ్రేకర్ ప్రారంభించారు. ఎంతో మంది క్రికెటర్లకు ఆయన పాఠాలు చెప్పారు. ఘనకీర్తి తెచ్చిపెట్టింది మాత్రం సచిన్ తెందుల్కరే. ప్రస్తుతం ఈ క్లబ్‌ను అచ్రేకర్ కుమార్తె కల్పన, అల్లుడు దీపక్ నిర్వహిస్తున్నారు.

# నేటి నుంచే సిడ్నీ టెస్ట్

- హాట్‌ఫేవరేట్‌గా టీం ఇండియా
- పైన్ సేనకు సిడ్నీ పరీక్ష
- సమష్టి ప్రధర్శనపై కోహ్లీ ఆశాభావం
- విజయమే లక్ష్యంగా బరిలోకి ఆసీస్





**సిడ్నీ:** ఆస్ట్రేలియాపై ఆస్ట్రేలియాలో సిరీస్ విజయం సాధించే సువర్ణావకాశాన్ని సృష్టించుకున్న కోహ్లీసేన.. ఉరకలెత్తే ఉత్సాహంతో సిడ్నీ టెస్టుకు సిద్ధమైంది. నాలుగు టెస్టుల సిరీస్ చివరి మ్యాచ్ నేడు సిడ్నీలో ఆరంభం కాబోతోంది. అడిలైడ్‌లో విజయంతో సిరీస్‌ను గొప్పగా ఆరంభించి.. పెర్త్‌లో ఎదురు దెబ్బ తిన్నప్పటికీ.. మెల్‌బోర్న్‌లో మళ్లీ పుంజుకుని ఘన విజయం సాధించిన భారత్.. అదే ఊపులో సిడ్నీనీ జయించాలనుకుంటోంది. గత మ్యాచ్‌లో ఇరు జట్ల ప్రదర్శన ప్రకారం చూస్తే ఈ మ్యాచ్‌లో కోహ్లీసేనే ఫేవరెట్ అనడంలో సందేహం లేదు.

పెర్త్ టెస్టు ఓటమి తర్వాత మెల్‌బోర్న్ లో టీం ఇండియా పుంజుకున్న తీరు అమోఘం. ఓవైపు ఓపెనర్ల ఘోర వైఫల్యం.. మరోవైపు అశ్విన్ గాయం.. సెలక్షన్ తప్పిదాలు.. అన్నీ కలిసి రెండో టెస్టులో భారత్ కొంపముంచాయి. ఐతే మెల్‌బోర్న్‌లో అన్నీ సర్దుకున్నాయి. అరంగేట్ర టెస్టులోనే మయాంక్ అగర్వాల్ గొప్ప ఆట తీరుతో ఓపెనింగ్ సమస్య తీర్చాడు. విహారి పెద్దగా పరుగులు చేయకున్నా.. అతడికి బాగానే సహకరించాడు. మరోవైపు పుజారా, కోహ్లి అసాధారణ పట్టుదలతో బ్యాటింగ్ చేసి భారీ స్కోరుకు బాటలు వేయగా.. రోహిత్, పంత్ సైతం తమ వంతు బాధ్యత నిర్వర్తించడంతో ఈ ఏడాది విదేశీ పర్యటనల్లో తన అత్యుత్తమ స్కోరును సాధించగలిగింది భారత్. మరోవైపు బుమ్రా సహా బౌలర్లందరూ చక్కటి ప్రదర్శన కొనసాగించి భారత్‌కు గొప్ప విజయాన్ని కట్టబెట్టారు.

మెల్‌బోర్న్ సమష్టి ప్రదర్శన టీం ఇండియా ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసేదే. ఇదే తరహాలో అందరూ బాధ్యత తీసుకుంటే సిడ్నీలో గెలుపు కష్టమేమీ కాదు. మరోవైపు ఆస్ట్రేలియా పరిస్థితి పూర్తి భిన్నం. స్మిత్, వార్నర్ వస్తే తమ జట్టు బలోపేతం అవుతుందని కెప్టెన్ పైన్ అంటున్నాడంటే.. ఆ జట్టు ఆత్మవిశ్వాసం ఏ స్థాయికి పడిపోయిందో అర్థం చేసుకోవచ్చు. బ్యాట్స్‌మెన్స్ ఘోర వైఫల్యం ఆ జట్టును కలవరపెడుతోంది. ఓపెనర్లు ఫించ్, హారిస్.. మూడో నంబర్ ఆటగాడు ఖవాజాల వైఫల్యం జట్టుకు పెద్ద సమస్యగా మారింది. షాన్ మార్ష్, టిమ్ పైన్ కూడా స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోతున్నారు. ఇన్నింగ్స్ బాగానే ఆరంభిస్తున్నప్పటికీ.. పెద్ద స్కోర్లు చేయనివ్వకుండా అడ్డుపడుతున్నారు భారత బౌలర్లు. బ్యాట్స్‌మెన్స్ అందరూ విఫలమవుతుండటంతో ఎవరిని తీయాలో.. ఎవరిని ఉంచాలో తెలియట్లేదు.







కెరీర్ అత్యుత్తమ ఫామ్ అందుకున్న బుమ్రాను ఎదుర్కోవడం కంగారూ బ్యాట్స్‌మెన్స్‌కు సవాలే. సిడ్నీ పిచ్ పేసర్లకు ఏమాత్రం సహకరించినా బుమ్రాను ఆపడం కష్టమే. ఐతే ఆస్ట్రేలియా బౌలింగ్ మాత్రం ఎప్పుడూ ప్రమాదకరమే కాబట్టి.. భారత బ్యాట్స్‌మెన్స్ మరోసారి బాధ్యతతో ఆడాలి. టాప్, మిడిలార్డర్లను దెబ్బ తీస్తున్న బౌలర్లు ప్రత్యర్థి తోకను తెంచే విషయంలో సరైన ప్రణాళికలతో బరిలోకి దిగాల్సి ఉంది.

### అశ్విన్ చాన్స్..?

అడిలైడ్‌లో జరిగిన మొదటి టెస్టులో పార్శ్వపు నొప్పి(సైడ్ స్ట్రెయిన్)తో జట్టుకు దూరమైన రెండు, మూడు టెస్టులు ఆడలేకపోయిన అతడికి చివరి టెస్ట్‌లో ఛాన్స్ ఇచ్చారు అశ్విన్‌కు తుది జట్టులో చోటు దక్కిన నేపథ్యంలో . అశ్విన్ తుది జట్టులో ఉంటాడా, లేదా అనేది మ్యాచ్ ప్రారంభానికి ముందు నిర్ణయిస్తామని బీసీసీఐ తెలిపింది. వ్యక్తిగత కారణాలతో రోహిత్ శర్మ నాలుగో టెస్టుకు దూరమయ్యాడు. తనకు కూతురు పుట్టడంతో అతడు స్వదేశానికి వచ్చాడు. చివరిదైన సిడ్నీ టెస్టులో పైచేయి సాధించి చరిత్ర సృష్టించాలని టీమిండియా భావిస్తోంది. ఒకవేళ ఈ మ్యాచ్ ఫలితం తేలకున్నా సిరీస్ భారత్ సొంతమవుతుంది.

### భారత జట్టు

విరాట్ కోహ్లి(కెప్టెన్), అజింక్య రహానే(వైస్ కెప్టెన్), ఛతేశ్వర్ పుజారా, కేఎల్ రాహుల్, మయాంక్ అగర్వాల్, హనుమ విహారి, రిషబ్ పంత్, రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్, రవీంద్రన్ అశ్విన్, మహ్మద్ షమి, జస్ప్రిత్ బుమ్రా, ఉమేశ్ యాదవ్


### చరిత్రలో నిలిచిపోవడం ముఖ్యం కాదు: కోహ్లీ

చరిత్రలో నిలిచిపోవడం తనకు ముఖ్యం కాదని భారత క్రికెట్ జట్టు సారథి విరాట్ కోహ్లీ స్పష్టం చేశాడు. ఆస్ట్రేలియాపై తొలిసారి టెస్టు సిరీస్ గెలిస్తే అది అద్భుతమేనని వెల్లడించాడు. తన సారథ్యంలో జట్టు పరివర్తన సిడ్నీ నుంచే మొదలైందని పేర్కొన్నాడు. నాలుగేళ్ల క్రితం సిడ్నీ మైదానంలోనే ఎంఎస్ ధోనీ టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. అప్పుడు ఏడో ర్యాంకులో ఉన్న టీమిండియా ప్రస్తుతం ప్రపంచ నంబర్ వన్‌గా కొనసాగుతోంది.

ఇప్పటికి నాలుగేళ్లు (సారథిగా). ఈ సిరీస్ గెలిస్తే అద్భుతమే. నేనిక్కడ పర్యటించడం నాలుగోసారి. ఆస్ట్రేలియాలో టెస్టు సిరీస్ గెలవడం ఎంత కష్టమో తెలుసు. చాలాసార్లు మంచి ప్రదర్శనలు చేశాం. కానీ విజయం సాధించడం అతి పెద్ద సవాల్. నిజం చెప్పాలంటే గత రెండు పర్యటనల్లో వ్యక్తిగత ప్రదర్శనలను పట్టించుకోలేదు. సిరీస్ గెలిస్తే గౌరవనీయుల జాబితాలో పేరు చేరొచ్చు. చివరి టెస్టు గెలవకపోతే మాత్రం దానికి అర్థం లేదు. ఇప్పటికైతే ఇదే అతి పెద్ద విజయం. నా ఒక్కడికే కాదు జట్టుకూ ఇదే పెద్ద విజయం. నిజాయతీగా చెప్పాలంటే భారత జట్టు పరివర్తన ఇక్కడే మొదలైంది' అని కోహ్లీ పేర్కొన్నాడు.

'సిడ్నీలో ధోనీ సారథ్యం వదిలేసినప్పుడు టీమిండియా ఆరు, ఏడు ర్యాంకుల్లో ఉంది. అక్కడ్నుంచి పుంజుకొని ప్రపంచంలో నంబర్‌వన్ అయ్యాం. ఆ వారసత్వాన్ని మేం కొనసాగించాలని కోరుకుంటున్నాం. మెల్‌బోర్న్‌లో చివరి వికెట్ పడగానే మేమంతా భావోద్వేగానికి గురయ్యాం. ప్రశాంతంగా ఉండే వ్యక్తులు సైతం సంబరాలు చేసుకున్నారు. జట్టును ఒక దిశలో నడిపిస్తే పరిస్థితులు స్థిరంగా ఉంటాయి. నిజం చెప్పాలంటే నేను చరిత్ర గురించి పట్టించుకోవడం లేదు. ఆస్ట్రేలియాలో సిరీస్ గెలవడం చాలా కష్టం. వర్తమానంలో ఉంటూ మ్యాచ్‌లు గెలవడంపై దృష్టి సారించాం. మెల్‌బోర్న్‌లో విజయం మా అందరిలో నమ్మకం పెంచింది. అడిలైడ్, మెల్‌బోర్న్ విజయాలు బృంద స్ఫూర్తిని రగిలిస్తాయి' అని కోహ్లీ అన్నాడు.

### కఠిన పోటీ ఇవ్వడంపైనే దృష్టి: టిమ్ పైన్



టీమిండియాతో జరిగే నాలుగో టెస్టులో కఠిన పోటీ ఇవ్వడంపైనే దృష్టి సారించామని ఆస్ట్రేలియా సారథి టిమ్‌పైన్ అన్నాడు. గెలుపోటముల గురించి ఆలోచించడం లేదన్నాడు. భారత్ ఇంతకు ముందు ఎప్పుడూ ఆస్ట్రేలియాలో సిరీస్ గెలవలేదు. నాలుగు టెస్టుల సీరీస్‌లో కోహ్లీసేన 2–1తో ఆధిక్యంలో ఉంది. చరిత్ర సృష్టించేందుకు మ్యాచ్ దూరంలో నిలిచింది. కాగా చివరి టెస్టు గెలిచి సిరీస్‌ను డ్రా చేయాలని ఆస్ట్రేలియా భావిస్తోంది.'మేం మెరుగవ్వడం, వీలైనంత వరకు అత్యుత్తమ క్రికెట్ ఆడటంపైనే దృష్టి సారించాం. ఆడే ప్రతి టెస్టు గెలవాలనే కోరుకుంటాం. కొన్ని సార్లు అలా కుదరదు. ప్రస్తుతం అత్యద్భుతంగా ఆడుతున్న ప్రపంచ నంబర్ వన్ జట్టుతో మేం పోటీపడుతున్నాం. సిరీస్ చేజార్చుకోవడం గురించి ఆలోచించడం లేదు. స్ఫూర్తి పొందేందుకు ఒక్కో ఆటగాడు వేర్వేరు పనులు చేస్తుంటాడు. మేం మెరుగవ్వడం, ప్రతిసారీ పోటీపడటం, టీమిండియాతో సిసలైన సమరానికి దిగడం నాకు ప్రేరణ. మా జట్టు నిలకడగా మెరుగవుతోంది. మా బ్యాట్స్‌మెన్స్ పూర్తి స్థాయిలో ఫామ్‌లో లేరు. ఒకరు ఆడితే మరొకరు ఆడటం లేదు. శతకాలు చేయకుండా మ్యాచ్‌లు గెలవలేమని తెలుసు. దీర్ఘకాలం సేవలందించే బ్యాటర్లకు అవకాశాలు ఇస్తున్నాం. అశ్విన్ ఆడటం లేదని తెలిస్తే మా బ్యాట్స్‌మెన్స్ సంతోషిస్తారు. కానీ కుల్‌దీప్, జడేజా ఉన్నారు' అని పైన్ అన్నాడు.

Printed and Published By Chilappagari Laxmi Rajam, on behalf of Intercontinental Publications Private Limited, Printed at Intercontinental Publications Private Limited, Survey No .713/P, Dundigal Grama Panchayat, Qutubullapur Mandal, Medchal – Malkajgiri District 500043, Published at Plot No. 1267/A, Road No. 63/A, Jubilee Hills, HYDERABAD-500033, Telangana State. Editor: Chilappagari Laxmi Rajam, RNI NO: TELTEL /2018/75203, Ph: +91 40 2355 6603, Fax No. +91 4023556604, Toll Free: 1800 599 3399.